
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



ప్రకాశం

జిల్లా వార్తలు

బుధవారం 10, సెప్టెంబరు 2025



ఎరువుల డీలర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

జిల్లాలో యూరియా సమస్యపై అధికార యంత్రాంగం సీరియస్‌గా దృష్టి సారించింది. సీజన్ సరిలేక, పంటలు సాగు కాక.. ఎరువుల వినియోగం అంతగా లేకపోయినా కొరత ఉందంటూ జరుగుతున్న ప్రచారం నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమై తగు చర్యలు తీసుకుంది. తదనుగుణంగా జిల్లాలో యంత్రాంగం యూరియా వాడకం, దానివలన కలిగే అనర్థాలపై రైతులకు అవగాహన కల్పిస్తోంది. అలాగే అక్రమ పద్ధతుల్లో ఎరువులను విక్రయిస్తే ఎదురయ్యే పరిణామాలపై వ్యాపారులకు హెచ్చరికలు చేస్తోంది. మరోవైపు జిల్లావ్యాప్తంగా విస్తృతంగా ఎరువుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తోంది. కాగా వైసీపీ మంగళవారం చేపట్టిన నిరసన కార్యక్రమం జనం లేక పేలవంగా సాగింది.

యూరియాపై అప్రమత్తం

దాడులు.. అవగాహన



259 దుకాణాలలో తనిఖీలు

జిల్లాలో మొత్తం 529 ఎరువుల దుకాణాలు లైసెన్సులు పొంది ఉన్నాయి. అందులో 355 షాపుల వారు మాత్రమే వ్యాపారంలో ఉన్నారు. వాటిలోని 259 దుకాణాలలో ఇప్పటివరకు ఆయా శాఖల అధికారులు దాడులు చేశారు. ఆ సందర్భంగా పలు అవకతవకలు, అక్రమాలు ఉన్నట్లు గుర్తించి 12 దుకాణాలపై 6ఏ కేసులు, ఒక దుకాణంపై 6ఏతోపాటు క్రిమినల్ కేసు కూడా నమోదు చేశారు. సుమారు రూ.39.24లక్షల విలువైన 219.04 మెట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకాలను నిలిపేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. దాడులను నిరంతరాయంగా కొనసాగించాలని నిర్ణయించారు. అదే సమయంలో జిల్లాలో అవసరాలకు సరిపడా యూరియాను అందుబాటులో ఉంచే చర్యలు చేపట్టారు. ఈనెలలో జిల్లాలో 4,273 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. అందుకు సంబంధించి సోమవారం వరకు 3,752 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నట్లు గుర్తించారు. అందులో 1,356 మెట్రిక్ టన్నులు రైతు సేవా కేంద్రాలలో, 1,313 మెట్రిక్ టన్నులు రిటైల్ డీలర్లు, 878 మెట్రిక్ టన్నులు మార్క్‌ఫెడ్ వద్ద నిల్వ ఉండగా మిగిలింది ఇతర సంస్థల వద్ద ఉంది.



పొదిలిలోని ఎరువుల దుకాణం గోడౌన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు (ఫైల్)

- ఎరువుల డీలర్లతో కలెక్టర్ సమీక్ష
- జిల్లావ్యాప్తంగా కొనసాగుతున్న దాడులు
- ఇప్పటి వరకు 259 దుకాణాలు తనిఖీ
- 6ఏ కేసులు 12 నమోదు
- రూ.39.24లక్షల విలువైన ఎరువులు సీజ్
- ఈనెలలో 4,273 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం
- ఇప్పటికే 3,752 ఎంటీలు నిల్వ
- నేడు మరో 1,587 మెట్రిక్ టన్నులు రాక
- కొరత లేదంటున్న డీఏవో శ్రీనివాసరావు
- నామమాత్రంగా సాగిన వైసీపీ నిరసనలు

ఒంగోలు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : దాదాపు పక్షం రోజుల క్రితం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో యూరియా కొరత ఏర్పడింది. అయితే ఉన్న సమస్యకన్నా ఎక్కువగా అసత్య ప్రచారాలు సాగుతుండటంతో భవిష్యత్‌లో దొరకదేమోనన్న అనుమానంతో తక్షణం అవసరం లేకపోయినా యూరియా కొనుగోలుకు పలు ప్రాంతాల రైతులు మొగ్గు చూపారు. దానిని ఆసరా చేసుకొని అధిక ధరలకు విక్రయించే ప్రయత్నం కూడా కొన్నిచోట్ల వ్యాపారులు చేశారు. పరిస్థితిని గుర్తించిన జిల్లా యంత్రాంగం తక్షణం దుకాణాలలో తనిఖీలు చేపట్టింది. కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాలతో వ్యవసాయ, రెవెన్యూ అధికారులు ఈ తనిఖీలు చేపట్టారు. స్వయంగా జేసీ గోపాలకృష్ణ, వ్యవసాయశాఖ అధికారి సీహెచ్.శ్రీనివాసరావు కూడా పాల్గొన్నారు. మరోవైపు ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాలతో విజిలెన్స్, పోలీస్ అధికారులు సైతం విస్తృత దాడులు చేశారు. అలా నాలుగైదుశాఖల అధికారులు ఎడాపెడా దాడులు చేయడం ఇటీవల కాలంలో ఇదేకావడంతో ఎరువుల వ్యాపారులు బెంబేలెత్తిపోయారు.

యూరియా వస్తోంది..

ఆర్‌సీఎఫ్ కంపెనీ నుంచి 300 టన్నుల ఎరువులు సోమవారం రాత్రి జిల్లాకు వచ్చాయి. బుధవారం 1,310 టన్నులు కోరమండల్, 275 టన్నులు పీపీఎల్ కంపెనీల నుంచి జిల్లాకు రానుంది. అలా అవసరం కన్నా

మిగతా 6వ పేజీలో

చలో అనంతపురం

- తరలివెళ్లిన జిల్లా కీలక నేతలు
- నేడు సూపర్ సిక్స్-సూపర్ హిట్ సభ
- అక్కడ ముందస్తు ఏర్పాట్లలో పలువురు ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు



అనంతపురంలో సభ ఏర్పాట్లపై చర్చలో పాల్గొన్న జిల్లా నేతలు

ఒంగోలు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాకు చెందిన కూటమి పార్టీల ప్రజాప్రతినిధులు, కీలక నేతలు అనంతపురం తరలివెళ్లారు. రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పడి 15 మాసాలు పూర్తికావస్తుండగా సూపర్‌సిక్స్-సూపర్ హిట్ పేరుతో బుధవారం అనంతపురంలో భారీ బహిరంగ సభ జరగనుంది. తెలుగుదేశం పార్టీ తరఫున ఈ సభను నిర్వహిస్తుండగా ఆపార్టీతోపాటు కూటమిలో భాగస్వామ్యమైన జనసేన, బీజేపీ నేతలు కూడా పాల్గొంటున్నారు. మహానాడు స్థాయిలో ఈ సభను నిర్వహించాలని టీడీపీ అధిష్ఠానం నిర్ణయించింది. సభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు నారా లోకేష్, సత్యకుమార్‌తోపాటు మూడు పార్టీల రాష్ట్రస్థాయి కీలక నేతలు పాల్గొంటున్నారు. రాయలసీమ నుంచి ప్రధానంగా అనంతపురం, కర్నూలు, కడప జిల్లాల నుంచి భారీగా జనసమీకరణ

మిగతా 6వ పేజీలో

తస్మాత్.. జాగ్రత్త!



- మధ్యాహ్న భోజన బియ్యంపై అప్రమత్తం
- లెక్కల్లో తేడాలు వస్తే కఠిన చర్యలు
- హెచ్‌ఎంలకు డైరెక్టర్ హెచ్చరిక

6

రాత్రివేళ వచ్చి... అతిథి గృహంలో సేదతీరి!

- డీసీసీబీలో విచారణకు తొలిరోజు బ్రేక్
- ఆలస్యంగా వచ్చిన విచారణాధికారి
- బ్యాంకు సమయం అయిపోయిందని వెళ్లిపోయిన అధికారులు

ఒంగోలు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో సెక్షన్ 51 విచారణకు తొలిరోజు బ్రేక్ పడింది. విచారణాధికారైన రాష్ట్ర సహకారశాఖ అదనపు రిజిస్ట్రార్ గౌరీశంకర్ రాత్రి ఏడు గంటలకు స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహానికి చేరుకొని బ్యాంకుకు వెళ్లేందుకు కబురు పంపారు. పనివేళలు ముగిసి చాలాసేపు అయినందున అధికారులు, సిబ్బంది వెళ్లిపోయారన్న సమాధానం అటువైపు నుంచి వచ్చినట్లు తెలిసింది. దీంతో విచారణాధికారి రాత్రికి అక్కడే సేదతీరారు. ఇదంతా ఒక పథకం ప్రకారమే సాగుతుందని, బ్యాంకులో వైసీపీ కాలంలో జరిగిన అవినీతి, అక్రమాలు, అవకతవకలు వెలుగులోకి రాకుండా కొందరు బ్యాంకు

మిగతా 6వ పేజీలో

ప్రబలుతున్న విషజ్వరాలు



దర్శి ఏరియా హాస్పిటల్‌లో ఓపీలు రాయించుకుంటున్న రోగులు

- ఆందోళన రేకెత్తిస్తున్న గున్యా
- కిటకిటలాడుతున్న ఆస్పత్రులు

దర్శి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : దర్శి ప్రాంతంలో విష జ్వరాలు ఉధృతంగా ప్రబలుతున్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. దర్శి ఏరియా ఆసుపత్రికి రోజుకు 200 మందికి పైగా ఓపీలు వస్తున్నాయి. కొంతమంది వైద్యం చేయించుకొని వెళ్తుండగా, జ్వరం తీవ్రంగా ఉన్న వారు అక్కడే చికిత్స పొందుతున్నారు. వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులు, కలుషిత నీరు తాగటం వల్ల విషజ్వరాలు, టైఫాయిడ్ సోకుతున్నాయి. దోమల కారణంగా గున్యా, మలేరియా తదితర వ్యాధులు ప్రబలుతున్నాయి. పదేళ్ల క్రితం దర్శి ప్రాంతంలో గున్యా, మలేరియా, టైఫాయిడ్ విషజ్వరాలు ఉధృతంగా సోకాయి. గ్రామాలకు గ్రామాలే మంచంపట్టాయి. ప్రస్తుతం అదే పరిస్థితి నెలకొంటున్నదని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ముండ్లమూరు మండలంలోని పూరిమిట్ల, పసుపుగల్లు గ్రామాల్లో అనేకమంది గున్యా, విష జ్వరాలతో మంచం పట్టిన విషయం విదితమే. దర్శి పట్టణంతోపాటు అనేక గ్రామాల్లో జ్వరాలు తీవ్రంగా ఉన్నాయి. ప్రధానంగా కలుషితనీరు తాగటం, మురుగునీరు నిల్వతో దోమలు కుట్టడంతో ఈ వ్యాధులు సోకుతున్నాయని వైద్యులు చెబుతున్నారు. దర్శి ఎన్ఏపీ రక్షిత పథకం ద్వారా గ్రామాలకు మంచినీరు సరఫరా అవుతుంది. ఫిల్టర్‌బెడ్లు కొన్ని ఏళ్లగా పనిచేయకపోవడంతో అనేక గ్రామాలకు నీటిని అలాగే



ఆసుపత్రిలో బెడ్లమీద ఉన్న రోగులు

మిగతా 6వ పేజీలో

తర్లుపాడు ఎంపీడీవో సస్పెన్షన్!



ఎంపీడీవో చక్రపాణి ప్రసాద్

- మహిళపై లైంగిక వేధింపులే కారణం

తర్లుపాడు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : తర్లుపాడు ఎంపీడీవో చక్రపాణిప్రసాద్‌పై సస్పెన్షన్ వేటు పడింది. కార్యాలయంలో పనిచేస్తున్న మహిళపై లైంగిక వేధింపులకు పాల్పడడంతో కలెక్టర్ అన్సారియా ఆయనపై చర్యలు తీసుకున్నారు. తర్లుపాడు ఎంపీడీవో కార్యాలయంలో పనిచేస్తున్న మహిళపై జూలై 23న చక్రపాణిప్రసాద్ లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాధిత మహిళ ఫిర్యాదుతో కేసు నమోదైంది. అనంతరం దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ కార్యాలయానికి వచ్చి విచారణ చేపట్టారు. ఆగస్టు 20న ఒంగోలు ఆర్డీవో విచారించి నివేదికను కలెక్టర్‌కు అందజేశారు. ఈమేరకు చక్రపాణి ప్రసాద్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు.

రగడ.. రాద్ధాంతం

- నిమజ్జన ఊరేగింపులో పోలీసులపై వైసీపీ మూకల దాడి
- ఆపై డీఎస్పీ ఆఫీసులో హోంగార్డుపై దౌర్జన్యం
- చుండూరి రవితోపాటు ముగ్గురు లాయర్లపై కేసు
- కోర్టు విధులను బహిష్కరించి నిరసనకు సిద్ధం
- పోలీసులు, న్యాయవాదుల మధ్య కోల్డ్‌వార్

ఒంగోలు క్రైం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులో వినాయక విగ్రహ నిమజ్జన ఊరేగింపులో పోలీసులపై వైసీపీ మూక దాడి వ్యవహారం సరికొత్త మలుపు తిరిగింది. అది చివరకు పోలీసులు వర్సెస్ లాయర్ల మధ్య వివాదంలా మారింది. ఆదివారం వినాయక విగ్రహం ఊరేగింపు సందర్భంగా కర్నూల్ రోడ్డు ఫ్లైఓవర్ వద్ద విధి నిర్వహణలో ఉన్న ట్రాఫిక్ ఎస్సై, కానిస్టేబుల్‌పై వైసీపీ కార్యకర్తలు దాడి చేశారు. పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకొన్న నేపథ్యంలో వైసీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవితోపాటు ముగ్గురు న్యాయవాదులు డీఎస్పీ కార్యాలయానికి వెళ్లారు. కార్యాలయం గేటు నెట్టుకుంటూ అడ్డువచ్చిన హోంగార్డుపై దౌర్జన్యం చేశారు. వెంటనే



పోలీసులపై దాడి చేస్తున్న వైసీపీ కార్యకర్తలు (ఫైల్)

మిగతా 6వ పేజీలో

నేడు జిల్లాకు కేంద్ర బృందం

- మూడు రోజులపాటు పీహెచ్‌సీల పరిశీలన
- తొలుత డీఎంహెచ్‌వో కార్యాలయంలో అధికారులతో సమీక్ష

6



వైద్యశాఖలో వివాదం

- హాజరు విషయంలో ఇద్దరు ఉద్యోగుల మధ్య గొడవ
- కార్యాలయంలోనే నువ్వెంత అంటే నువ్వెంత అంటూ వాగ్వాదం
- ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారంటూ ఒకరిపై మరొకరు ఆరోపణ

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో కోల్డ్‌వార్ ప్రారంభమైంది. హాజరు పట్టికలో సంతకం విషయమై నెలకొన్న వివాదం చినికిచినికి గాలివానలా మారింది. ఇరువురు ఉద్యోగుల మధ్య రగడ చోటుచేసుకుంది. ఒక ఉద్యోగి కార్యాలయానికి ఆలస్యంగా వచ్చారన్న కారణంతో మరో ఉద్యోగి సీఎల్ వేయడంతో వివాదం మొదలైంది. వివరాల్లోకి వెళితే.. ఒక ఉద్యోగి సోమవారం కార్యాలయానికి వచ్చి పనిమీద బయటకు వెళ్లినట్లు తెలిసింది. అయితే ఆ ఉద్యోగి వచ్చాడని తెలిసి కూడా హాజరుపట్టికలో సంతకం చేయలేదనే కారణంతో మరో ఉద్యోగి సీఎల్ వేసినట్లు సమాచారం. ఈ విషయాన్ని గుర్తించిన సదరు ఉద్యోగి తాను కార్యాలయానికి వచ్చినా హాజరు పట్టికలో సీఎల్ ఎలా వేస్తారని ప్రశ్నించినట్లు తెలిసింది. దీంతో ఇరువురు ఉద్యోగుల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వివాదం చేసుకొంది. కార్యాలయం దద్దరిల్లే విధంగా అరుపులు, కేకలతో మోతపుట్టించారు. సాధారణంగా ఉద్యోగుల హాజరుపట్టిక డీఎంహెచ్‌వో చాంబర్‌లో

మిగతా 6వ పేజీలో

పొగాకు కిలో రూ.321

- క్రమంగా పెరుగుతున్న గరిష్ఠ ధర
- రూ.109కి తగ్గిన కనిష్ఠ ధర
- నాల్గో వంతుకు పైగానే నోబిడ్‌లు

ఒంగోలు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : దక్షిణాది పొగాకు మార్కెట్లో గరిష్ఠ ధరలు క్రమంగా పెరుగుతున్నాయి. అదేసమయంలో నోబిడ్‌లు తగ్గించేందుకు కనిష్ఠ ధరలను కూడా బోర్డు అధికారులు తగ్గించి వేస్తున్నారు. అయినా సగటున నాల్గో వంతు బేళ్లు నోబిడ్ అవుతున్నాయి. అధికోత్పతి కొనుగోళ్లకు కూడా అనుమతి ఇవ్వడంతో దక్షిణాదిలోని 11 వేలం కేంద్రాలలో మంగళవారం వేలం సాగింది. మొత్తం 11 కేంద్రాలలో 8,963 బేళ్ల అమ్మకాలకు బోర్డు అధికారులు అనుమతించారు. అందులో 5,702ను మాత్రమే వ్యాపారులు కొనుగోలు చేశారు. అలా తెచ్చిన బేళ్లలో 3,261 వివిధ రూపాలలో తిరస్కరణకు గురయ్యాయి. వాటిలో 2,387 నోబిడ్ అయ్యాయి. అంటే వేలానికి వచ్చిన వాటిలో నోబిడ్‌లు దాదాపు 26.50శాతం ఉన్నాయి. కనిష్ఠ ధరలను తగ్గించినా అంతస్థాయిలో నోబిడ్‌లు ఉండటంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. నోబిడ్ అయిన వాటిలో 95శాతానికి పైగా లోగ్రేడ్ బేళ్లు ఉన్నట్లు సమాచారం. వారంరోజులుగా క్రమంగా గరిష్ఠ ధరలు పెరుగుతున్నాయి. సోమవారం కిలో రూ.317 ఉండగా మంగళవారం మరో రూ.4 పెరిగి రూ.321కి చేరింది.





దొనకొండలో ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాపింగ్

- రైల్వే ఉన్నతాధికారుల ఉత్తర్వులు
- నేటి నుంచే అమలు

7

యూరియాపై అప్రమత్తం

(5వ పేజీ తరువాయి)

అధికంగానే ఎరువు అందుబాటులో ఉండనుండగా 70శాతం సొసైటీలు, ఆర్ఎస్‌కేలకు, 30శాతం డీలర్లకు ఇచ్చేలా నిర్ణయించారు. మరోవైపు ఎరువులు ప్రత్యేకించి యూరియా విక్రయాలపై డీలర్లకు, వాడకంపై రైతులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఇందుకోసం మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని ఎరువుల డీలర్లతో కలెక్టర్ అన్సారియా నేతృత్వంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జేసీ గోపాలకృష్ణ, డీఏవో శ్రీనివాసులు పాల్గొని ఎరువుల విక్రయాలలో అవకతవకలు జరిగితే తీవ్ర చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అలాగే యూరియా వాడకంపై రైతులకు కూడా అవగాహన కార్యక్రమాలు చేపట్టారు.

సరిపడా నిల్వలు ఉన్నాయి..

జిల్లావ్యాప్తంగా మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఈ అంశాన్ని ప్రధానంగా చేపట్టారు. అధిక యూరియా వాడకం వల్ల అనేక అనర్థాలు జరుగుతాయని తొలివిడత నేలలో యూరియా వాడి అనంతరం మొక్కలపై స్ప్రే చేసే నానో యూరియాను వాడాలని సూచించారు. అలాగే జిల్లాలో యూరియా కొరత లేదని అవసరానికి మించి కొనుగోలు చేయరాదని రైతులకు వివరించారు. కాగా జిల్లాలో యూరియాకు ఎలాంటి కొరత లేదని అవసరానికి సరిపడా నిల్వలు ఉన్నాయని రైతులు ఎవ్వరూ ఆందోళన చెందవద్దని డీఏవో శ్రీనివాసరావు కోరారు. ఇదిలా ఉండగా యూరియా కొరత అంటూ వైసీపీ చేపట్టిన నిరసనలు నామమాత్రంగా సాగాయి. ఆ పార్టీ కార్యకర్తలకే పరిమితమయ్యారు.

రగడ.. రాద్ధాంతం

(5వ పేజీ తరువాయి)

డీఎస్పీ కల్పించుకుని సీరియస్ కావడంతో వెనక్కి తగ్గారు. కాగా పోలీసు విధులను ఆటంకపరిచి హోంగార్డుపై దౌర్జన్యం చేసిన విషయమై ఒంగోలు టూటౌన్ పోలీసు స్టేషన్‌లో చుండూరి రవితోపాటు ముగ్గురు న్యాయవాదులపై కేసు నమోదు చేశారు. దీంతో మంగళవారం ఒంగోలు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించి నగరంలో ర్యాలీ చేయాలని నిర్ణయించుకున్నారు. అయితే బార్ అసోసియేషన్ నేతలు కల్పించుకుని జిల్లా ప్రధాన న్యాయాధికారి భారతితో మాట్లాడదామని చెప్పారు. ఒంగోలు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బొడ్డు భాస్కరరావు నేతృత్వంలో జిల్లా న్యాయాధికారిని కలిసి వినతిపత్రం అందజేశారు. న్యాయవాదులపై పెట్టిన కేసులను ఎత్తివేయించాలని కోరారు. దీంతో ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావును పిలిపించి లాయర్లపై నమోదు చేసిన కేసుల గురించి జిల్లా న్యాయాధికారి భారతి చర్చించారు. ఈ సందర్భంగా కేసు నమోదు చేయాల్సిన పరిస్థితులను డీఎస్పీ వివరించినట్లు తెలిసింది. అయితే లాయర్లపై నమోదైన కేసులో ఒంగోలు టూటౌన్ పోలీసులు 41 సీఆర్పీసీ ప్రకారం నోటీసులు కూడా జారీ చేశారు.

పోలీసులపై దాడి చేసిన వారిపై హత్యాయత్నం కేసు

ట్రాఫిక్ ఎస్సై, కానిస్టేబుల్‌పై దాడిచేసిన వైసీపీ కార్యకర్తలపై ఒంగోలు తాలూకా పోలీసు స్టేషన్‌లో హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఈ దాడికి పాల్పడిన స్థానిక కూచిపూడి వీధికి చెందిన 13 మందిని పోలీసులు గుర్తించి వారిలో ఏడుగురిని అరెస్టు చేశారు. వారిని న్యాయాధికారి ఎదుట సోమవారం హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించారు. మరో 50 మందికిపైగా దాడిలో పాల్గొన్నట్లు పోలీసులు తేల్చారు.


వందమందికి పైగా విద్యార్థులకు ఇరుకు మరుగుదొడ్లే దిక్కు


కారుతున్న రేకుల షెడ్


అల్పాహారం తింటున్న విద్యార్థులు

వసతులు కరువు

● ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు ● వార్డెన్లు హాస్టల్‌కు ఎప్పుడు వస్తారో తెలియదు ● పిల్లల ఆలనాపాలనా చూసేది వంట పనివారే

కంభం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కంభం మండలంలో ఉన్న పలు వసతి గృహాలలో (హాస్టల్స్) వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కంభంలో ఎస్సీ, బీసీ, వసతి గృహాలు మొత్తం 7 ఉండగా, అందులో కంభం, రావిపాడు రోడ్డులో ఉండే ఎస్సీ బాలుర వసతి గృహం-1, రంగరాజు పాఠశాల సమీపంలో బాలికల బీసీ హాస్టల్ మాత్రమే ప్రభుత్వ భవనాలు కాగా, మిగిలిన 5 వసతిగృహాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. ముఖ్యంగా రైల్వేస్టేషన్ సమీపంలో ఒక్కొక్క గదిలో 10 మంది విద్యార్థులు ఉంటున్నారు. ఈ హాస్టల్‌లో మొత్తం 100 మందికిపైగా విద్యార్థులుండగా, వారందరికీ కేవలం నాలుగు టాయిలెట్స్ మాత్రమే ఉన్నాయి. ఇక 30మందికిపైగా హాలు లాంటి ఒక రేకుల షెడ్డు ఉంది. చిన్నపాటి వర్షం కురిసినా షెడ్ మొత్తం కారుతుంది. విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.

అందుబాటులో లేని వార్డెన్లు

పలు వసతి గృహ వార్డెన్లు తాము పని చేసే హాస్టల్‌కు ఎప్పుడు వస్తారు, ఎప్పుడు వెళ్తారో తెలియని పరిస్థితి. మంగళవారం ఆయా హాస్టల్స్‌ను పరిశీలించగా ఎస్సీ బాలుర హాస్టల్-2లో ఉదయం 7గంటల సమయంలో వార్డెన్ లేరు. విద్యార్థులను వంట చేసేవారే చదివిస్తున్నారు. వార్డెన్ ఎక్కడా అని ప్రశ్నించగా ఆయన కాలేజీ బీసీ బాయ్స్ హాస్టల్‌కు ఇన్‌చార్జి అని అక్కడ ఉన్నారన్న సమాధానం వచ్చింది. అక్కడికి వెళ్లగా ఇప్పుడే ఎస్సీ బాయ్స్ హాస్టల్‌కు వెళ్లారని చెప్పారు. దీంతో ఆ వార్డెన్ ఎప్పుడు ఎక్కడ ఉంటారో తెలియని పరిస్థితి. ఇక బీసీ బాయ్స్ హాస్టల్ వార్డెన్‌కు అర్ధవీడు బీసీ బాయ్స్ హాస్టల్ ఇన్‌చార్జి కావడంతో ఆయన కూడా ఎప్పుడు ఎక్కడ ఉంటారో తెలియదు. దీంతో పిల్లల ఆలనాపాలనను వంట వారే చూస్తున్నారు. ఇలా వార్డెన్లు ఏ హాస్టల్‌లోనూ విద్యార్థులను సరిగ్గా చూడడం లేదన్న విమర్శ ఉంది. అసలు వార్డెన్లు ఎక్కడ ఉంటారో తెలుసుకుందామని ఫోన్ చేస్తే ఫోన్ లిఫ్ట్ చేయకపోవడం లేదా ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు హాస్టల్స్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

విలీన శాపం వైసీపీదే

● ఆ ప్రక్రియతో పంచాయతీ కూలీలకు ఉపాధి కరువు ● ఎమ్మెల్యే కందుల

పొదిలి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ పాలకులు తమ స్వార్థ రాజకీయాల కోసం గ్రామ పంచాయతీలను నగర పంచాయతీలో విలీనం చేశారని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం మాదిరెడ్డిపాలెం, నందిపాలెం, కంభాలపాడు గ్రామాల్లో ఎంపీడీవో గుత్తా శోభన్ బాబు అధ్యక్షతన జరిగిన ఉపాధి హామీ కూలీలకు జరిగిన అవగాహన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. మాదాలవారిపాపాలెం, నందిపాలెం, కంభాలపాడు గ్రామ పంచాయతీలను పొదిలి నగరపంచాయతీలో విలీనం చేయడంతో నిరుపేద కూలీలకు శాపంగా మారిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఐదేళ్లుగా ఆయా గ్రామాలకు చెందిన కూలీలు ఉపాధి పనులు లేక జీవనోపాధిని కోల్పోయారన్నారు. ఫలితంగా ఆయా గ్రామాల్లో అభివృద్ధి కూడా కుంటుపడిందన్నారు. ఎంతో మంది పనుల కోసం ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లిపోయారని కందుల పేర్కొన్నారు. విలీనంతో గ్రామాలపై పన్నుల భారాలు పడడంతో దానిని వ్యతిరేకిస్తూ కోర్టుకు వెళ్లారన్నారు. ఈ క్రమంలో ఎన్నికల ప్రక్రియ కూడా నిలిచిపోయిందన్నారు. గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి కూలీలకు ఉపాధి కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ప్రజాభీష్టం మేరకు విలీనమైన గ్రామ పంచాయతీలను యథావిధిగా కొనసాగించేందుకు కృషి



చేస్తామని ఎమ్మెల్యే కందుల హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీవో మహాలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ ఇమాంసాహెబ్, మాదిరెడ్డిపాలెం సొసైటీ అధ్యక్షుడు యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి ఆవులూరి యలమంద, మాజీ మండలాధ్యక్షుడు మీగడ ఓబులరెడ్డి, జిల్లా ముస్లిం మైనారిటీ నాయకులు రసూల్, టీడీపీ నాయకులు దొర్నాల అంజిరెడ్డి, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు గౌస్‌బాషా, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలి


మాట్లాడుతున్న ఏడీఈ నిర్మలకుమారి

పొన్నలూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి నానో ఎరువులను వినియోగించాలని ఏడీఈ నిర్మలకుమారి సూచించారు. పొన్నలూరు గ్రామ సచివాలయంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మోతాదుకు మించి యూరియా వాడటం వల్ల సారవంతమైన భూమి పనికిరాకుండా పోతుందన్నారు. రైతులు విధిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని కోరారు. వ్యవసాయ అధికారి వడ్డే రాము మాట్లాడుతూ 2025-26 రబీ సీజన్లో నల్ల బర్లీ పొగాకు సాగును ప్రభుత్వం నిషేధించిందని చెప్పారు. దాన్ని ఎవ్వరూ సాగు చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో తాసీల్దార్ పుల్లారావు, ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత, పశువైద్యాధికారి శివరామకృష్ణ, నాయకులు మండవ మురళీమోహన్ పాల్గొన్నారు.

కొండపిలో..

కొండపి : రైతులు రసాయన ఎరువులను తగ్గించి జీవ ఎరువుల వాడకాన్ని పెంచాలని ఏవో మాల్యాద్రి సూచించారు. మండలంలోని పెదకండ్లగుంట, జాళ్లపాలెం గ్రామాల్లో రైతులకు సమగ్ర ఎరువుల యాజమాన్యంపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఏవో మాట్లాడుతూ భూసార పరీక్షలు చేయించుకుని నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. తహసీల్దార్ ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులు ఎరువుల గురించి ఎలాంటి ఆందోళన చెందవద్దన్నారు. అవసరమైన మేర అందుబాటులో ఉంచామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాసరావు, ఏఈవో పి.కుమార్, వీపీఏలు షేక్ మహేష్ పాల్గొన్నారు.

చికిత్సపొందుతూ మరొకరు మృతి

త్రోవగుంట సమీపంలో ప్రమాదం

ఒంగోలుక్రైం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదానికి గురైన వ్యక్తి చికిత్సపొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందాడు. సోమవారం సాయంత్రం త్రోవగుంట సమీపంలోని ముంది గుండ వాగు వంతెనపై జరిగిన రోడ్డుప్రమాదంలో అక్కడికక్కడే ఒకరు మృతిచెందిన విషయం తెలిసిందే. ఎదురుగా వస్తున్న కారును బైక్ ఢీకొట్టింది. దానిపై ఉన్న ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. ఏ. బ్రహ్మయ్య ఘటన స్థలంలోనే తీవ్రగాయాలతో మృతిచెందాడు. బైక్‌పై ప్రయాణిస్తున్న కొత్తపట్నం మండలం అల్లూరు పీవైకాలనీకి చెందిన తలుపుల శ్రీను (50) రిమ్స్‌లో చికిత్సపొందుతూ మృతిచెందాడు. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది.

ప్రబలుతున్న విష జ్వరాలు

(5వ పేజీ తరువాయి)

విడుదల చేస్తున్నారు. ఫిల్టర్ చేయని కలుషిత నీరు తాగటంతో ఈ వ్యాధులు సోకుతున్నాయనే అనుమానాలు కల్గుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రక్షిత మంచినీటి పథకం గురించి పట్టించుకోకపోవటంతో అధ్వానంగా మారింది. ఏడు ఫిల్టర్‌బెడ్లు ఉండగా అందులో ఐదు పనిచేయటం లేదు. సుమారు 140 గ్రామాలకు నీరు అందించే ఈ పథకం అధ్వానంగా మారింది. ఆ పథకం ద్వారా సరఫరా అవుతున్న శుద్ధిచేయని నీరు తాగటం వల్ల రోగాల బారిన పడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

శుభ్రమైన నీరు తాగాలి: డాక్టర్ ఆనందబాబు

వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులతో కలుషిత నీరు తాగటం వలన ప్రజలకు పలు రకాల వ్యాధులు సోకుతున్నాయి ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలి. మురుగునీరు నిల్వ లేకుండా పరిసరాలు శుభ్రం చేసుకోవాలి. గృహాల్లో దోమకాటుకు గురికాకుండా చర్యలు తీసుకోవాలి. దోమకాటుతో గున్యా, మలేరియా, టైఫాయిడ్ వంటి తీవ్ర జ్వరాలు సోకుతున్నాయి. కలుషిత నీరు తాగటం వల్ల విషజ్వరాలు సోకుతున్నాయి. ప్రజలు జ్వరం వచ్చిన వెంటనే ప్రాథమిక దశలోనే వైద్యం చేయించుకోవాలి. ఆరోగ్య సూత్రాలు పాటించాలి.

వైద్యశాఖలో వివాదం

(5వ పేజీ తరువాయి)

ఉండేది. దాన్ని ఇప్పుడు ఒక ఉద్యోగికి ఇవ్వడం వల్లనే ఈ పరిస్థితి ఏర్పడిందన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా వైద్యశాఖకు ముఖహాజరును అమలులో ఉంది. ప్రతి ఉద్యోగి కార్యాలయానికి వచ్చిన వెంటనే ముఖహాజరు వేస్తుంటారు. మరలా కార్యాలయంలో ఉండే హాజరుపట్టికలో సంతకాలు చేస్తుంటారు. కానీ ప్రస్తుతం కార్యాలయంలో ఆ ఉద్యోగి వద్ద హాజరుపట్టికను ఎందుకు ఉంచారన్నది కూడా తేలాల్సి ఉంది. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారి జోక్యం చేసుకొని ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. లేనిపక్షంలో ఆ శాఖ పరువు బజారునపడే అవకాశం ఉందని ఆ శాఖ ఉద్యోగులు చర్చించుకుంటున్నారు.

చలో అనంతపురం

(5వ పేజీ తరువాయి)

చేస్తున్నారు. తొలుత మన జిల్లాలోని పశ్చిమ ప్రాంత నియోజకవర్గాల నుంచి కూడా జన సమీకరణ చేయాలని భావించినా సుదూర ప్రాంతం కావడంతో ఇబ్బందికరంగా ఉంటుందని ఆలోచించి విరమించినట్లు సమాచారం. అయితే రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు, రాష్ట్రస్థాయి వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు వంటి ముఖ్యనేతలంతా హాజరు కావాలని టీడీపీ అధిష్ఠానం సూచించింది. తదనుగుణంగా జిల్లాకు చెందిన కూటమి పార్టీల ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతలు అనంతపురం తరలారు. అధిష్ఠానం ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, ఉగ్రనరసింహారెడ్డి, అశోక్‌రెడ్డి, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ వంటివారు ముందుగానే అనంతపురం వెళ్లి అక్కడ సభా ఏర్పాట్లు, జనసమీకరణ పనుల్లో నిమగ్నమయ్యారు. జిల్లాకు చెందిన సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ స్వామి మంగళవారం రాత్రికి అనంతపురం చేరుకొన్నారు. ఇతర ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలతో పాటు పెద్దసంఖ్యలో పార్టీ ద్వితీయశ్రేణి నాయకులు కూడా ఆ సభలో పాల్గొనేందుకు తరలివెళ్లారు.

ఇన్‌చార్జి జీపీగా శివరామకృష్ణ



ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కోర్టు ఇన్‌చార్జి గవర్నమెంట్ ప్లీడర్ (జీపీ)గా బి.వెంకట శివరామకృష్ణను నియమిస్తూ జిల్లా రెవెన్యూ అధికారి బి చిన ఒబులేషు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం శివరామకృష్ణ ఒంగోలు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా పనిచేస్తున్నారు. తదుపరి ఉత్తర్వులు వచ్చేంతవరకు ఆయన జీపీగా బాధ్యతలు చేపట్టనున్నారు.

తస్మాత్.. జాగ్రత్త!

● మధ్యాహ్న భోజన బియ్యంపై అప్రమత్తం

● లెక్కల్లో తేడాలు వస్తే కఠిన చర్యలు

● హెచ్‌ఎంలను హెచ్చరిస్తూ డైరెక్టర్ ఉత్తర్వులు

ఒంగోలు విద్య, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకం బియ్యం విషయంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అప్రమత్తంగా వ్యవహరించాలి. స్టాకు, లెక్కల్లో తేడాలు వస్తే కఠిన చర్యలు తప్పవని ప్రభుత్వం హెచ్చరించింది. ఈ మేరకు మధ్యాహ్న భోజన పథకం డైరెక్టర్ బి.శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీచేశారు. పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు ప్రభుత్వం కిలో రూ.48 విలువైన మంచి బియ్యాన్ని పాఠశాలలకు సరఫరా చేస్తోంది. ఈ విషయంలో ప్రభుత్వ చిత్తశుద్ధిని పరిగణనలోకి తీసుకొని హెచ్‌ఎంలు బాధ్యతగా వ్యవహరిస్తూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాల్సి ఉంది. పాఠశాలల్లో బియ్యం పాత స్టాకు లేకుండా హెచ్‌ఎంలు వెంటనే చర్యలు తీసుకోవాలి. పాఠశాలల్లో విద్యార్థుల నమోదు, మధ్యాహ్న భోజనం తింటున్న వారి సంఖ్య ప్రామాణికంగా బియ్యం సరఫరా చేస్తారు. నెల చివరలో బియ్యం నిల్వలు, ఎంతమంది విద్యార్థులు భోజనం చేస్తున్నారన్న దానిని పరిగణనలోకి తీసుకొని వచ్చేనెలకు బియ్యం ఇండెంట్ పెట్టాలి. ఆ మేరకు బియ్యం నిల్వలకు సంబంధించి స్టాక్ రిజిస్టర్ నిర్వహించాలని డైరెక్టర్ ఆదేశించారు. పాఠశాలల్లో వచ్చేనెలకు ఎంతమందికి బియ్యం అవసరమో ఈనెల 9 నుంచి 12 వరకు ఇండెంట్ పెట్టాలని తెలిపారు.

నేడు జిల్లాకు రానున్న కేంద్ర బృందం

● మూడు రోజుల పాటు జిల్లాలో పీహెచ్‌సీల పరిశీలన

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కేంద్ర బృందం మంగళవారం పర్యటించనుంది. వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లను పరిశీలించారు. ఆ వైద్యశాలల్లో అందుతున్న సేవలతో పాటు మౌలిక సదుపాయాలు, రికార్డులను పరిశీలించనున్నారు. కేంద్ర బృంద ప్రతినిధి డాక్టర్ వర్ష నేతృత్వంలో ఈ బృందం పరిశీలించనుంది. ముందుగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో అందుకు సంబంధించి ఆ శాఖ అధికారులతో సమీక్షించనున్నారు. వైద్యశాఖ అధికారులు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా జిల్లాలో జరుగుతున్న కార్యక్రమాలను కేంద్ర బృందసభ్యులకు వివరించనున్నారు.

వైసీపీ నాయకులపై కేసు

ఒంగోలుక్రైం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నగరంలో 30 పోలీసు చట్టం అమలులో ఉండగా ఎలాంటి అనుమతులూ లేకుండా రెవెన్యూ డివిజనల్ కార్యాలయం వద్ద నిరసనకు దిగిన వైసీపీ నాయకులు, కార్యకర్తలపై కేసు నమోదు చేసినట్లు ఒంగోలు వన్‌టౌన్ సీఐ నాగరాజు తెలిపారు. మంగళవారం వైసీపీ నాయకులు చీమకుర్తి జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, నాయకులు బొట్ల రామారావు, సుబ్బారావు, రమణమ్మతో పాటు మరి కొందరు స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద పోలీసు నిబంధనలకు వ్యతిరేకంగా ధర్నా చేయడంతోపాటు నినాదాలు చేశారు. దీంతో వైసీపీ నాయకులతో పాటు మరి కొంతమందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రాత్రి వేళ వచ్చి.. అతిథిగృహంలో సేదతీరి..

(5వ పేజీ తరువాయి)



ఉద్యోగులే అడ్డుపడుతుండటంతో ఇలా జరుగుతుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందుకు సహకార శాఖ ఉన్నతాధికారుల తీరు ఊతమిస్తోంది. తొలి నుంచి ఈ విషయంలో జిల్లా యంత్రాంగానికి సహకారశాఖ ఉన్నతాధికారుల నుంచి సహకారం కొరవడింది. తాజాగా విచారణాధికారి వ్యవహారశైలి కూడా అలాగే కనిపిస్తోంది. సాధారణంగా ఏ సంస్థలోనైనా విచారణ చేయాల్సి వస్తే విచారణాధికారిగా నియమితులైన వారు ముందుగా సంబంధిత కార్యాలయానికి సమాచారం ఇస్తారు. కార్యాలయం పనిచేసే సమయంలో వచ్చి అవసరమైతే రాత్రి పొద్దుపోయే వరకు విచారణ కొనసాగిస్తారు. అయితే డీసీసీబీలో విచారణ వ్యవహారం అందుకు విరుద్ధంగా ఉంది. విచారణాధికారైన గౌరీశంకర్ మంగళ, బుధవారాల్లో విచారణకు వస్తున్నట్లు స్థానిక సహకారశాఖ అధికారులకు తెలియజేయగా తదనుగుణంగా బ్యాంకు అధికారులకు వారు తెలియజేశారు. ఇక్కడికి వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న గుంటూరులోని సహకారశాఖ కమిషనర్ కార్యాలయంలో అదనపు రిజిస్ట్రార్ అయిన విచారణాధికారి మంగళవారం ఉదయం అక్కడి నుంచి బయలుదేరినా గంటన్నరలో ఇక్కడకు రావచ్చు. మధ్యాహ్నం బయల్దేరినా మూడు గంటల కల్లా వచ్చి విచారణ ప్రారంభించవచ్చు. అయితే అందుకు భిన్నంగా రాత్రి ఏడు గంటలకు సదరు అధికారి అతిథిగృహానికి చేరారు. అయితే మధ్యాహ్నం మూడు గంటలకు వస్తారన్న సమాచారం ఉన్న స్థానిక సహకారశాఖ అధికారులు ఆ మేరకు బ్యాంకు అధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. తీరా రాత్రి ఏడు గంటలకు విచారణాధికారి ఆర్అండ్‌బీ అతిథి గృహానికి చేరుకోగా అక్కడ ఆయన్ను సహకారశాఖ అధికారులు రిసీవ్ చేసుకున్నారు. ఇలాంటి సమయంలో బ్యాంకుకు చెందిన బాధ్యత గల అధికారులు కూడా అక్కడ ఉంటారు. అలాంటిది బ్యాంకు అధికారులు ఎవ్వరూ లేరని సమాచారం. ఆ పరిస్థితుల్లో విచారణాధికారి బ్యాంకుకు వస్తున్నారని అందరూ అందుబాటులో ఉండాలని సహకారశాఖ అధికారులు సమాచారం పంపగా పనివేళలు ముగిసి చాలా సమయం అయినందున అందరూ వెళ్లిపోయారన్న సమాధానం అటు నుంచి రావడంతో సదరు అధికారులు అవాక్కయ్యారు. అదే విషయాన్ని వారు విచారణాధికారి గౌరీశంకర్‌కు తెలియజేశారు. సాధారణంగా ఇలాంటి సందర్భంలో విచారణాధికారి బ్యాంకు అధికారులపై తీవ్రంగా స్పందించాలి. అందుకు భిన్నంగా ప్రస్తుత విచారణాధికారి గౌరీశంకర్ ఆ విషయాన్ని వదిలేసి కొద్దిసేపు స్థానిక సహకార శాఖ అధికారులతో మాట్లాడి బుధవారం ఉదయం సమీపంలోని సొసైటీలో ఎరువుల పరిశీలనకు వెళ్దామని చెప్పి పంపించినట్లు తెలిసింది. రాత్రికి ఆయన అతిథిగృహంలో బస చేశారు. ఈ మొత్తం వ్యవహారంపై సహకార వర్గాల్లో తీవ్ర చర్చ నడుస్తోంది. తొలి నుంచి ఉన్నతాధికారులు బ్యాంకులో సెక్షన్ 51 విచారణపై విముఖత చూపుతున్నారని, అలాగే బ్యాంకులో అక్రమాలకు, అవకతవకలకు బాధ్యులైన కొందరు ఉద్యోగులు ఉన్నతాధికారులతో టచ్‌లో ఉన్నారన్న ఆరోపణలు ఉన్నాయి.



ఆటో ఎక్కిన పడవ!

సముద్రపు నీటిలో నడవాల్సిన పడవ ఆటో ఎక్కింది. ఫైబర్ పడవల తయారీ యూనిట్లు తీరంలోని కొత్తపట్నం, కావలి వంటి ప్రాంతాల్లో ఉన్నాయి. కొత్తపట్నంలో తయారు చేసిన ఫైబర్ పడవను బాపట్ల ప్రాంతానికి చెందిన మత్స్యకారులు కొనుగోలు చేసి ఆటోపైకి ఎక్కించుకుని తీసుకుపోతున్నారు. 500 కేజీల బరువు ఉండే ఈ పడవను ప్రయాణికుల కోసం తయారు చేసిన ఆ టోపై ఉంచి సులభంగా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. సముద్రంలో ప్రయాణించాల్సిన పడవ ఇలా ఆటో టాప్‌పై ఎక్కి వెళుతుండటంతో ప్రజలు ఈ దృశ్యాన్ని ఆసక్తిగా తిలకించారు. కొత్తపట్నం-ఒంగోలు రహదారిలో ఈ దృశ్యం మంగళవారం చూపరులను ఆకట్టుకుంది.

- ఒంగోలు నగరం, (ఆంధ్రజ్యోతి)

స్తంభమెక్కిన నిర్లక్ష్యం!

విద్యుత్ స్తంభాలకు పిచ్చిమొక్కలు ప్రమాదభరితంగా అల్లుకుని అప్పుడపుడు విద్యుత్ సరఫరా ఏర్పడుతోంది. మండలంలోని మైనంపాడు, సంతనూతలపాడు గ్రామాల్లో పలు విద్యుత్ స్తంభాలకు పిచ్చి మొక్కలు అల్లుకుని విద్యుత్ సరఫరాకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని మైనంపాడు, సంతనూతలపాడు ప్రజలు వాపోతున్నారు. పిచ్చి మొక్కలు కిందవరకు అల్లుకుని ఉండటంతో వర్షాలుకు తడిసి స్తంభాలకు విద్యుత్ సరఫరా జరిగి ఏదైన ప్రమాదజరిగే పరిస్థితి లేకపోలేదని వాపోతున్నారు.

- సంతనూతలపాడు, (ఆంధ్రజ్యోతి)



సంతనూతలపాడులో పార్కు వద్దనున్న విద్యుత్ స్తంభానికి అల్లుకున్న పిచ్చిమొక్కలు



మైనంపాడులో బ్యాంకు సెంటర్లోని స్తంభాలకు అల్లుకున్న పిచ్చి మొక్కలు

నీతి నిజాయితీకి నిదర్శనం చంద్రబాబు

● మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి

టంగుటూరు (కొండపి), సెప్టెంబరు9 (ఆంధ్రజ్యోతి): నీతి, నిజాయితీకి, విలువలతో కూడిన రాజకీయాలకు చిరునామా సీఎం చంద్రబాబని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖామంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. మంత్రి తూర్పునాయుడుపాలెంలోని క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. రెండేళ్ల క్రితం ఇదేరోజు చంద్రబాబుపై వైసీపీ ప్రభుత్వం తప్పుడు కేసు పెట్టి అక్రమంగా అరెస్ట్ చేయడం దారుణమన్నారు. రాష్ట్ర చరిత్రలో అదొక దుర్దినమని మంత్రి అభివర్ణించారు. వైసీపీ ఎన్ని కుట్రలు చేసినా చంద్రబాబు నిజాయితీకి అవినీతి మకిలి అంటించలేకపోయిందన్నారు. వైసీపీ పతనానికి నాంది పలికిన రోజని ఆయన అన్నారు.

జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారిగా శ్యాంసుందరి

సింగరాయకొండ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సింగరాయకొండ జూనియర్ సివిల్ కోర్టు నూతన న్యాయాధికారిగా వి.లీలా శ్యాంసుందరి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. బార్ అసోసియేషన్ తరుపున న్యాయవాదులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ ఇకపై రెగ్యూలర్‌గా కోర్టును నిర్వహిస్తామని తెలిపారు. ఈ నెల 13వ తేదీ సింగరాయకొండ కోర్టులో నిర్వహించే లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు సన్నెబోయిన శ్రీనివాసులు, కార్యదర్శి బక్కమంతుల వెంకటేశ్వర్లు న్యాయవాదులు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, రాఘవేంద్ర, రియాజ్, వంశీ పాల్గొన్నారు.



న్యాయాధికారి లీలాశ్యాంసుందరికి శుభాకాంక్షలు తెలుపుతున్న న్యాయవాదులు

19న ఉద్యోగుల సమస్యలపై గ్రీవెన్స్

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై ఈనెల 19న కలెక్టరేట్‌లోని మీ కోసం హాలులో నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి బి.చిన ఓబులేషు ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగులు వారి సమస్యలను ఈ గ్రీవెన్స్‌సెల్‌లో అర్జీలు ఇవ్వవచ్చని తెలిపారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. ఈ గ్రీవెన్స్‌లో సంబంధిత అధికారులు కూడా పాల్గొంటారన్నారు.

ప్రభుత్వానికి రైతుల పట్ల చిన్నచూపు

● మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రైతాంగ సమస్యలపై కూటమి ప్రభుత్వానికి ముందు చూపులేదని మాజీమంత్రి ఆదిమూలపు సురేష్ మండిపడ్డారు. ఎరువుల కోసం రైతులు రోడ్డున పడుతున్నా పట్టించుకోని పరిస్థితి ఏర్పడిందన్నారు. వైసీపీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం ఒంగోలులో వైసీపీ ఆధ్వర్యంలో అన్నదాత పోరు నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ భవన్ నుంచి కలెక్టరేట్ మీదుగా ఆర్డీవో కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. ముందుగా చర్చి సెంటర్‌లో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్నను కలిసి వినతిపత్రం అందజేశారు. అక్కడ జరిగిన కార్యక్రమంలో సురేష్ మాట్లాడుతూ రైతులకు సకాలంలో ఎరువులు అందించాలని డిమాండ్ చేశారు. అంబేడ్కర్ భవన్ నుంచి వస్తున్న ర్యాలీని పోలీసులు అడ్డుకున్నారు. 20 మందికి మాత్రమే అనుమతి ఉందని పోలీసులు తేల్చిచెప్పారు. దీంతో అక్కడ కొద్దిసేపు పోలీసులు, వైసీపీ నేతల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఈ కార్యక్రమంలో ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు, ఒంగోలు పార్లమెంట్ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, కటారి శంకర్, రమణారెడ్డి, ఆళ్ల రవీంద్రారెడ్డి, కొమ్మూరి కనకారావు, కఠారి శంకర్, బొట్లా సుబ్బారావు, బొట్లా రామారావు, వై.వెంకటేశ్వరరావు, వేమా శ్రీనివాసరావు ఉన్నారు.




ర్యాలీలో పాల్గొన్న ఆదిమూలపు సురేష్

వ్యర్థాల నిర్వహణపై అవగాహన

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగర కార్పొరేషన్‌తో పాటు జిల్లాలోని అన్ని మునిసిపాలిటీల్లో ఘన వ్యర్థాల నిర్వహణపై ప్రజల్లో అవగాహన కల్పించే ందుకు ఐటీసీ సంస్థ వెల్-బీయింగ్ అవుట్ ఆఫ్ వెస్ట్ కాన్సెప్ట్‌తో ముందుకు రావడం పట్ల కలెక్టర్ తమీమ్ అన్సారియా అభినందించారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా వ్యర్థాల నిర్వహణ, సోర్స్‌సెగ్రిగేషన్‌కు సంబంధించి ఐటీసీ, ఏజీఎస్ సంస్థలు ఒంగోలు నగరంతో పాటు కనిగిరి, మార్కాపురం మునిసిపాలిటీలతో ఎంవోయూ చేసుకోగా ఈ విషయంపై మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ అన్సారియా కమిషనర్లు, ఐటీసీ, ఏజీఎస్ సంస్థల ప్రతినిధులతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఐటీసీ సంస్థ ప్రతినిధి సుధారాణి వెల్‌బీయింగ్ అవుట్ ఆఫ్ వేస్ట్ కాన్సెప్ట్‌తో చేపట్టనున్న వ్యర్థాల నిర్వహణ, సోర్స్ సెగ్రిగేషన్‌పై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. కలెక్టర్ అన్సారియా మాట్లాడుతూ వెల్‌బీయింగ్ అవుట్ ఆఫ్ వెస్ట్ కార్యక్రమాన్ని అన్ని మునిసిపాలిటీల్లో అమలు చేస్తూ అందుకు సంబంధించి సమగ్ర కార్యచరణ ప్రణాళికను రూపొందించాలని సూచించారు.

ఆరోగ్య కేంద్రంలో ఆకస్మిక తనిఖీ

మార్కాపురం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కోర్టు సెంటర్‌లోని పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట్ త్రివినాగ్ మంగళవారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పల్నాడు జిల్లాలోని తురకపాలెంలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాల మేరకు ఉన్నతాధికారులు ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలోనే సబ్ కలెక్టర్ త్రివినాగ్ ఆరోగ్య కేంద్రానికి వెళ్లి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వైద్యశాలలో ఎక్కువగా ఎలాంటి ఓపీలు నమోదవుతున్నాయి, రక్త పరీక్షలు ఏం చేస్తున్నారు, ఇన్ పేషెంట్‌గా చేరితే ఎలాంటి సేవలు అందిస్తారు అనే విషయాలను డాక్టర్ తేజను అడిగి తెలుసుకున్నారు. సాధారణ జ్వరాలకు సంబందించిన రోగులు మాత్రమే ఎక్కువగా వైద్యశాలకు వస్తున్నట్లు వైద్యులు తెలిపారు. ప్రమాదకరమైన రోగ లక్షణాలు ఉంటే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని సబ్ కలెక్టర్ ఆదేశించారు.



వైద్యాధికారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ త్రివినాగ్

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● పసుపుగల్లు, పూరిమెట్ల గ్రామాల్లో వైద్య శిబిరాలు కొనసాగించాలి ● వైద్య సిబ్బందికి జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్లు ఆదేశం

ముండ్లమూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పసుపుగల్లు, పూరిమెట్ల గ్రామాల్లో సీజనల్ వ్యాధుల్లో భాగంగా విష జ్వరాలు, చికున్ గున్యా సోకి మంచం పట్టిన విషయం తెలుసుకున్న జిల్లా వైద్యాధికారి (డీఎం అండ్ హెచ్‌వో) మంగళవారం గ్రామాల్లో పర్యటించారు. ముందుగా పసుపుగల్లులో విష జ్వరంతో చనిపోయిన పాములరి మహాలక్ష్మమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఎన్ని రోజుల నుంచి జ్వరం సోకింది? ఎలాంటి వైద్య సదుపాయం తీసుకున్నారు? తదితర వివరాలు కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్య శిబిరాన్ని పరిశీలించారు. వైద్యాధికారి జాస్మిన్‌తో పాటు ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ఇంటింటికీ వెళ్లి జ్వర పీడితులను గుర్తించాలన్నారు. జ్వర పీడితులు పూర్తిగా అదుపులోకి వచ్చేంత వరకు వైద్య శిబిరం కొనసాగించాలన్నారు. అవసరమైతే రక్త పరీక్షలు నిర్వహించి సీజనల్ వ్యాధుల్లో భాగంగా డెంగ్యూ జ్వరాలు ఉంటే గుర్తించాలన్నారు. ప్రస్తుతం పసుపుగల్లులో మృతి చెందిన మహాలక్ష్మి కేవలం జ్వరంతోనే చనిపోయిందన్నారు. అనంతరం మహాలక్ష్మమ్మ ఇంటి పరిసర ప్రాంతాలు, ప్రధాన వీధి చూసి పారిశుధ్యం అధ్వానంగా ఉండటంతో వెంటనే జిల్లా ఇన్‌చార్జ్ పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావుతో మాట్లాడారు. వైద్యాధికారులు, పంచాయతీ అధికారులు సంయుక్తంగా మురుగు కాలువల్లో మురుగును తొలగించటంతో పాటు నివాస ప్రాంతాల వద్ద మురుగు నిల్వ లేకుండా చూడాలన్నారు. అనంతరం పూరిమెట్లలో విష జ్వరాలతో మంచం పట్టిన పూరిమెట్ల అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ప్రచురించటంతో డీఎం అండ్ హెచ్‌వో గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఇంటింటికి వెళ్లి జ్వర పీడితులను పరామర్శించారు. బాధితులు కోలుకొనేంత వరకు వైద్య శిబిరం కొనసాగిస్తామని చెప్పారు. వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు అందుబాటులో ఉంటారన్నారు. ఆయన వెంట జిల్లా మలేరియా అధికారి ఉన్నారు.



పూరిమెట్లలోని ఎస్సీ కాలనీలో జ్వర పీడితులతో మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌వో వెంకటేశ్వర్లు



గండి చెరువు లీకులు పూడ్చివేత పనులు చేస్తున్న అధికారులు

గండి చెరువుకు లీకులు పూడ్చివేత

పెద్దదోర్నాల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్ద బొమ్మలాపురం గండి చెరువుకు లీకుల పూడ్చివేత పనులు మంగళవారం ప్రారంభించినట్లు ఇరిగేషన్ ఏఈ వెంకట రామిరెడ్డి తెలిపారు. ఇటీవల నల్లమల అటవీ ప్రాంతంలో కురిసిన భారీ వర్షానికి చెరువుకు 90 శాతం వరదనీరు చేరింది. అయితే లీకులు పడి నీరు వృథాగా పోతోందని గ్రామస్థులు ఫిర్యాదు చేయడంతో స్పందించిన ఇరిగేషన్ అధికారులు మరమ్మతు చేపట్టారు. ఈ క్రమంలో నీటి సంఘం అధ్యక్షుడు, గ్రామ పెద్దల సమక్షంలో నాలుగు ట్రాక్టర్ల ఇసుకను వెయ్యి సంచుల్లో నింపి లీకులున్నచోట కూరుస్తున్నట్లు ఏఈ తెలిపారు. రెండు రోజుల్లో పూర్తి స్థాయిలో లీకులను నియంత్రణ చేయనున్నట్లు చెప్పారు.

ట్యాంకర్ లారీ కిందపడి యువకుడు మృతి

మద్దిపాడు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మద్దిపాడు మండలం గుండ్లాపల్లి సమీపంలో మంగళవారం రాత్రి యువకుడు నీటి ట్యాంకర్ లారీ కిందపడి మృతిచెందాడు. గుండ్లాపల్లి రోడ్డు బొమ్మిడాల కంపెనీ ఎదురు ఆక్వా లారీ నీటి ట్యాంకర్ వెనుక వైపు నుంచి కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు దార్ల ఉదయకుమార్ (35) గుండ్లాపల్లికి చెందిన వ్యక్తి. మృతుడిని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. దీనిపై స్థానిక ఎస్ఐ వెంకట సైదులు ఘటనా ప్రదేశాన్ని పరిశీలించి పోలీస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రైతులకు నాణ్యమైన ఎరువులు అందించాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రైతులకు సకాలంలో నాణ్యమైన ఎరువులను అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా.. అధికారులను ఆదేశించారు. యూరియాను నిర్దిష్ట ధరలకు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ఈ విషయంలో ప్రైవేటు డీలర్లు కూడా నిబంధనల మేరకు పనిచేస్తూ అధికార యంత్రాంగానికి సహకరించాలని సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లోని మీ కోసం హాలులో మంగళవారం జిల్లాలోని ఎరువుల డీలర్లతో ప్రత్యేక సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఖరీఫ్ వ్యవసాయ సీజన్ ఊపందుకోవడం, ఎరువుల అవసరం, లభ్యత, షాపుల నిర్వహణ తీరు తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. నిబంధనలను డీలర్లు ఉల్లంఘిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో యూరియాకు కొరత లేదన్నారు. అవసరమైన మేరకు ప్రభుత్వం కేటాయించిందని, ఇందులో 70 శాతం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, రైతు సేవా కేంద్రాల ద్వారా, మిగిలిన 30 శాతం ప్రైవేటు డీలర్లు ద్వారా అందుబాటులో ఉంచేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ప్రైవేటు డీలర్లు కూడా రైతులలో ఎలాంటి ఆందోళనకు ఆస్కారం లేకుండా ఎరువులను విక్రయించాలన్నారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని అన్నారు. రైతు ప్రయోజనాలను కాపాడేందుకు విస్తృతంగా షాపుల తనిఖీలు చేసేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు అన్సారియా తెలిపారు. జయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ మాట్లాడుతూ రైతులకు అవసరమైన ఎరువులను కాలానుగుణంగా అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. వ్యవసాయశాస్త్రవేత్తల సూచనల మేరకు ఎరువులను వినియోగించేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. డీలర్లకు ఏమైనా సమస్యలు ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ అధికారి ఎస్.శ్రీనివాసరావు, మార్క్‌ఫెడ్ మేనేజర్ హరికృష్ణ, వ్యవసాయశాఖ అధికారులు, డీలర్లు ఉన్నారు.



మాతృ,శిశు మరణాలను నివారించేందుకు కృషి చేయాలి

మాతృశిశుమరణాలను నివారించేందుకు ప్రతి ఒక్కరు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లాకలెక్టర్ తమీమ్ అన్సారియా వైద్యాధికారులనరు అదేశించారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఎండీఆర్ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఏప్రిల్, మే, జూన్ నెలల్లో జిల్లాలో జరిగిన మాతృ, శిశుమరణాలపై సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. బాలింత మృతిపై వైద్యఆరోగ్యశాఖ అధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేసి సమగ్ర నివేదిక అందించాలని అదేశించారు.

దొనకొండలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు స్టాపింగ్

దొనకొండ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): దొనకొండ స్టేషన్ మీదుగా రాత్రిపూట ప్రయాణించే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపింగ్ సౌకర్యం కల్పించారు. ఈమేరకు రైల్వే ఉన్నతాధికారులు అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు. కరోనాకు ముందు దొనకొండలో అన్ని రైళ్లకు స్టాపింగ్ సౌకర్యం ఉండేది. కరోనా అనంతరం రైళ్ల పునఃప్రారంభం జరిగిన తర్వాత దొనకొండలో హాల్టింగ్ సౌకర్యాన్ని పునరుద్ధరించలేదు. దీంతో దూరప్రాంతాలకు రాకపోకలు జరుపుకునే ఈప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈక్రమంలో దొనకొండకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, ప్రజలు తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి దృష్టికి అనేకసార్లు తీసుకెళ్లారు. రైల్వే ఉన్నతాధికారులతో ఆయన చర్చించారు. ఇటీవల దొనకొండకు చెందిన అడ్వకేట్ జొన్నలగడ్డ జయరావు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు దొనకొండలో హాల్టింగ్ లేకపోవటంతో ప్రజల ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరిస్తూ ప్రజల విజ్ఞప్తులతో హైకోర్టును ఆశ్రయించాడు. వీరుచేసిన కృషికి రైల్వే ఉన్నతాధికారులు ఎనిమిది ఎక్స్‌ప్రెస్ రైళ్లకు బుధవారం నుంచి స్టాపింగ్ సౌకర్యం కల్పిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

హాల్టింగ్ సౌకర్యం కల్పించిన రైళ్లు

17211 మచిలీపట్నం నుంచి యశ్వంత్‌పూర్ వెళ్లే కొండవీడు ఎక్స్‌ప్రెస్ ప్రతి సోమ, బుధ, శుక్రవారాల్లో రాత్రి 8.05 గంటలకు దొనకొండకు చేరుతుంది. 17212 యశ్వంత్‌పూర్ నుంచి మచిలీపట్నం వెళ్లే కొండవీడు ఎక్స్‌ప్రెస్ మంగళ, గురు, శనివారాల్లో రాత్రి 12.41 గంటలకు దొనకొండకు వస్తుంది. 17225 నర్సాపూర్ నుంచి హుబ్లీ వెళ్లే అమరావతి ఎక్స్‌ప్రెస్ ప్రతిరోజు రాత్రి 10.30 గంటలకు దొనకొండకు చేరుతుంది. 17226 హుబ్లీ నుంచి నర్సాపూర్ వెళ్లే అమరావతి ఎక్స్‌ప్రెస్ రాత్రి 11.30 గంటలకు వస్తుంది. 18047 షాలిమార్ నుంచి వాస్కోడిగామా వెళ్లే అమరావతి ఎక్స్‌ప్రెస్ రాత్రి 9.30 గంటలకు, 18048 వాస్కోడిగామా నుంచి షాలిమార్ వెళ్లే అమరావతి ఎక్స్‌ప్రెస్ రాత్రి 10.25 గంటలకు దొనకొండకు చేరుతుంది. 18463 భువనేశ్వర్ నుంచి బెంగుళూర్ వెళ్లే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రాత్రి 10.30 గంటలకు, 18464 బెంగుళూర్ నుంచి భువనేశ్వర్ వెళ్లే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రాత్రి 1.10 గంటలకు దొనకొండకు చేరుతుంది.



క్విస్‌లో అతిథి ఉపన్యాసం

ఒంగోలు విద్య, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో ట్రిబుల్‌ఈ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు హై ఓల్టేజ్ ట్రాన్స్‌మిషన్ సిస్టం అనే అంశంపై అతిథి ఉపన్యాసం నిర్వహించారు. ఏపీ ట్రాన్స్‌కో విజయవాడ జోన్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ హై ఓల్టేజ్ ట్రాన్స్‌మిషన్ వ్యవస్థలో స్విచ్చింగ్, వాటి ప్రభావం, నివారణ పద్ధతులు విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా క్విస్ విద్యాసంస్థల అధినేత నిడమానూరి సూర్యకల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ శ్రీగాయత్రిలు మాట్లాడుతూ ఇటువంటి అతిథి ఉపన్యాసాలు విద్యార్థులకు ఎంతో మేలు చేస్తాయన్నారు. విభాగాధిపతి మౌళీచంద్ర పర్యవేక్షించారు. ప్రిన్సిపాల్ వైవీ హనుమంతరావు పాల్గొన్నారు.

12న కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగరపాలక సంస్థ పాలకవర్గ సమావేశం ఈనెల 12వ తేదీ మధ్యాహ్నం 3-30 గంటలకు కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం హాలులో జరుగుతుందని కమిషనరు కే వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో నగర అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను అజెండా అంశాలలో పొందుపరిచామని పేర్కొన్నారు.

విద్యుత్ విజిలెన్స్ తనిఖీలు

73 కేసుల నమోదు

ఒంగోలు క్రైం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి) : విద్యుత్తు అక్రమ వినియోగంపై ఆ శాఖ విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేసి 73 కేసులు నమోదు చేసినట్లు ఈఈ మాకినేని హరిబాబు చెప్పారు. మంగళవారం ఒంగోలు నగరంలోని ఉడ్‌కాంప్లెక్స్, శ్రీనగర్ కాలనీ, శ్రీరామ కాలనీ, కర్నూల్ రోడ్, ఎన్‌జీవో కాలనీ, సమతానగర్, తదితర ప్రాంతాలలో విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు 72 బృందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహించామన్నారు. అక్రమ విద్యుత్ వాడకందారులను గుర్తించి మొత్తం 4లక్షల 21 వేల రూపాయల అపరాధ రుసుం విధించినట్లు చెప్పారు. విద్యుత్తు చౌర్యంపై 9440812358, 9440812359 నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ ఈఈ టి.హైమావతి, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ బీటీ నాయక్, ఎస్సై ఎడ్వర్డ్, డీఈలు కేవీపీ రంగారావు, టి.శ్రీకాంత్, ఆర్.మోహన్‌రావు, కె.వెంకటేశ్వర్లు, ఏఈలు ఎస్ శివప్రసాద్, కే కోటయ్య పాల్గొన్నారు.

అద్దె ఇంటి పేరుతో దివ్యాంగురాలిపై దాడి.. దోపిడీ

ఏడున్నర సవర్ల బంగారం ఆభరణాలు అపహరణ

ఒంగోలుక్రైం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): అద్దెకు ఉండబోయే ఇంటిని చూసే పేరుతో ఓ యువతి దోపిడీకి పాల్పడింది. ఈ సంఘటన ఒంగోలు నగరంలో చోటుచేసుకుంది. వివరాల్లోకెళ్తే.. నగరంలోని సుజాతనగర్ 3వ లైన్‌లో రిటైర్డ్ ఇరిగేషన్ సూపరింటెండెంట్ దివ్యాంగురాలైన నూనె పుష్పావతి నివాసం ఉంటోంది. ఆమె నివాసం ఉండే ఇంటి పైఅంతస్తు ఖాళీగా ఉండడంతో ఇల్లు అద్దెకు ఇవ్వబడును అని టూలెట్ బోర్డు పెట్టింది. మంగళవారం సాయంత్రం 30 ఏళ్ల వయస్సు కలిగిన ఓ యువతి అద్దెకు ఇల్లు కావాలని వచ్చి అడిగింది. దీంతో ఆ వృద్ధురాలు పైకి తీసుకెళ్లి ఇంటిని చూపించింది. అయితే ఇంటిని వీడియో తీసుకుంటానంటూ వృద్ధురాలిపై దాడి చేసి బంగారం ఆభరణాలను అపహరించు కెళ్లింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలాన్ని తాలుకా సీఐ విజయకృష్ణ పరిశీలించి కేసు నమోదు చేశారు.

పారిశుధ్యం మెరుగుపరచాలి

నాగులుప్పలపాడు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలని జడ్పీ సీఈవో చిరంజీవి ఆదేశించారు. పారిశుధ్య పనులపై రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ఐవీఆర్ఎస్ సర్వే ద్వారా పోతవరం గ్రామ ప్రజల నుంచి అభిప్రాయ సేకరణ చేపట్టగా గ్రామంలో పారిశుధ్య పనుల పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో జడ్పీ సీఈవో మంగళవారం పోతవరం గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. వీధుల్లో తిరిగి చెత్త సేకరణ చేయాలని కార్మికులు, క్లాప్ మిత్రలకు సూచించారు. పెండింగ్‌లో ఉన్న క్లాప్‌మిత్ర జీతాలను త్వరగా చెల్లించాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంపీడీవో రవికుమార్ ఉన్నారు.

కారు ఢీ.. బైక్‌పై ఉన్న మహిళకు గాయాలు

ఒంగోలు క్రైం, సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి) : కూలి పనుల నుంచి ఇంటికి తిరిగి వెళుతున్న మహిళను కారు ఢీకొట్టింది. దీంతో ఆమె కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. మంగళవారం సాయంత్రం ఒంగోలు నగరం పాత బైపాస్‌లో ఉన్న హర్షిణి కళాశాల సమీపంలో కలికవాయి బిట్రగుంటకు చెందిన మహిళ కూలీ పనులకు వెళ్లి ఆమెకు తెలిసిన వ్యక్తి మోటార్ సైకిల్ ఎక్కింది. వెనుక నుంచి కొండపి మండలం వీఆర్వో కారు ఢీకొట్టింది. దీంతో మోటార్ సైకిల్‌పై ఉన్న ఆ మహిళ గాయపడింది. కారు ఢీకొట్టిన వీఆర్వో అక్కడ నుంచి పరారీ అయ్యాడు. పోలీసులు విచారిస్తున్నారు.

బాలబాలికలు పాఠశాలల్లోనే ఉండాలి

జిల్లా న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి ఇబ్రహీంషరీఫ్

ఒంగోలు రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : బాలురు, బాలికలు ప్రభుత్వ లేదా ప్రైవేటు పాఠశాలల్లో తప్పనిసరిగా విద్యను అభ్యసిస్తూ ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి షేక్ ఇబ్రహీంషరీఫ్ చెప్పారు. ఒంగోలు నగరం జిల్లా న్యాయాధికార సంస్థ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం లీగల్ సర్వీసెస్ టూ చిల్డ్రన్స్ అనే అంశంపై జిల్లా అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బాల్యవివాహాల నిర్మూలనకు అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి బాలిక ఉన్నతంగా చదువుకోవటానికి అధికారులు తమవంతు బాధ్యత తీసుకోవాలని చెప్పారు. అదేవిధంగా వైద్యసదుపాయాలు బాలబాలికలకు అందేవిధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డీడీ లక్ష్మీనాయక్, కార్మిక శాఖ అధికారులు ఎలిజిబెత్, పవన్‌కుమార్, డాక్టర్ భగీరథ, సీడబ్ల్యూసీ చైర్మన్ రామాంజనేయులు, వివిధ సంస్థల ప్రతినిధులు కట్టా శ్రీనివాసరావు, వాసాని అంకబాబు, పీర్‌బాషా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఇబ్రహీంషరీఫ్

జేసీఐతో సేవాభావం పెంపొందుతుంది

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులో జేసీఐ వారోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. స్థానిక కాపు కల్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఐపీఎస్ అధికారి రాధిక, జేసీఐ జోన్ పూర్వ అధ్యక్షుడు రాహుల్ వేదాంతం జేసీఐ ఇండియా జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఐపీఎస్ అధికారి రాధిక మాట్లాడుతూ అత్యుత్తమ శిక్షకుల్ని, సేవా భావాన్ని పెంపొందించే ఇలాంటి సంస్థలో పనిచేయడం అదృష్టమన్నారు. ఈ స్ఫూర్తి.. ఉన్నత స్థితికి, అనుకున్న లక్ష్యానికి చేరుకునే విధంగా ఉపయోగపడుతుందన్నారు. జూనియర్ ఛాంబర్ ఆఫ్ ఇండియా వివిధ రంగాల్లో సామాజిక సేవలు అందించే సీనియర్ సిటిజన్స్ కొద్దిమందికి, లైఫ్‌టైం సర్వీస్ మెంబరు అనే అవార్డుతో సత్కరించారు. ఈ కార్యక్రమానికి జేసీ వీక్ చైర్మన్‌గా పీ శివకోటిరెడ్డి, కార్యదర్శిగా కే శ్రీనివాసరావు, కోశాధికారిగా కే బాలసుబ్రహ్మణ్యం వ్యవహరించగా కో చైర్మన్స్‌గా శబరీనాథ్ నాయర్, గంధవల్ల బాలకృష్ణ, పి. అనిల్‌లు వ్యవహరించారు. ఈకార్యక్రమంలో జేసీఐ రాష్ట్ర నాయకులు లక్కం రవీంద్ర, గోపికిషోర్, కే వరుణ్‌కుమార్, బ్రిలియంట్స్ అధినేత న్యామతుల్లాబాషా, జేసీఐ ఒంగోలు అధ్యక్షుడు ఎంవీ సుబ్బారావు, రవికుమార్, దాసరి కృష్ణారావు, పూర్వ అధ్యక్షుడు మంత్రి శ్రీనివాసరావు, అద్దంకి శ్రీనివాసరావు, బొమ్మల శ్రీనివాసరావు, సోమినేని సురేష్, నాగేశ్వరరావు, ఆలపాటి విష్ణువర్ధన్‌రావు పాల్గొన్నారు.



మాట్లాడుతన్న ఐపీఎస్ అధికారి రాధిక

యూరియా అతి వాడకాన్ని నివారించాలి

ఒంగోలురూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): యూరియాను రైతులు భూములులో అతిగా వాడవద్దు.. యూరియా, రసాయనిక ఎరువులు అతిగా వాడకంతో భూములు నిస్సారవంతంగా మారతాయని మండల వ్యవసాయ శాఖ అధికారి కె.రమేష్‌బాబు చెప్పారు. ఒంగోలు మండలం దేవరంపాడు గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రసాయనిక యూరియాకు ప్రత్యామ్నాయంగా అవసరమైన పంట పొలాలకు నానో యూరియాను ఒక ఎకరాకు అరలీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. అదేవిధంగా నల్ల, తెల్ల బర్లీ పొగాకు సాగును ప్రభుత్వం నిషేధించిందని చెప్పారు. యూరియాను అధిక ధరలకు అమ్మినా, బ్లాక్ మార్కెట్‌కు తరలించినా కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె.రాజశేఖరరావు, డిప్యూటి ఎంపీడీవో బాలచెన్నయ్య. తహసీల్దార్ నాయబ్ రసూల్, సర్పంచ్ నన్నపనేని వెంకటేశ్వరరావు పాల్గొన్నారు



దేవరంపాడులో నానో యూరియాపై అవగాహనకల్పిస్తున్న ఏవో రమేష్‌బాబు

ఎండ్లూరులో యూరియా అవుట్‌రీచ్ కార్యక్రమం

సంతనూతలపాడు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎండ్లూరులో మంగళవారం యూరియా అవుట్ రీచ్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఒంగోలు సబ్‌డివిజన్ ఏడీఏ బి.రమేష్ బాబు మాట్లాడుతూ రైతులు పంటలలో రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి, జీవ ఎరువులను, పచ్చిరొట్ట ఎరువులను వినియోగించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు కేవీఎస్ రెడ్డి, వెంకటరావు పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి

నాగులుప్పలపాడు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలని ఎంపీడీవో తేళ్ల రవికుమార్ సూచించారు. యూరియా వినియోగం, లభ్యతపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నాగులుప్పలపాడులో జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్ రైతులకు అవగాహన కల్పించారు.

మద్దిపాడు మండలంలో...

మద్దిపాడు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాలలో నిర్వహించిన పొలంపిలుస్తుంది కార్యక్రమాలలో తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి, ఎంపీడీవో జ్యోతి, ఏవో స్వర్ణలతలు పాల్గొన్నారు. రైతులకు నానో యూరియాపై అవగాహన కల్పించారు.

ప్రజాపోరాటాల ద్వారానే సమాజ మార్పు సాధ్యం

ఒంగోలు విద్య, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రజాపోరాటాల ద్వారానే సమాజ మార్పు సాధ్యమని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు డి.రమాదేవి చెప్పారు. సామ్రాజ్యవాదుల కోసం, పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం, భారత ప్రజల సంక్షేమాన్ని విస్మరించి నిరంకుశ పాలకులపై ప్రజలు తిరుగుబాటు చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. సీపీఎం పూర్వ జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభ మంగళవారం రాత్రి స్థానిక సుందరయ్య భవన్‌లో జరిగింది. ముందుగా సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కే మాబు అధ్యక్షతన జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ ప్రపంచంలో పెట్టుబడిదారి వ్యవస్థకు వ్యతిరేకంగా తొలితరం నవరత్నాలుగా ఉన్న కమ్యూనిస్టు నేతలు అందించిన స్ఫూర్తితో దేశం మార్క్సిస్టు ఉద్యమ నిర్మాణానికి ఏచూరి కీలక భూమిక పోషించారన్నారు. జాతీయోద్యమం అనంతరం కాంగ్రెస్ అధికారం చేపట్టగా కమ్యూనిస్టులు సోషలిజం కోరుకున్నారని చెప్పారు. అధికారం చేపట్టిన పాలకులు పెట్టుబడిదారుల ప్రయోజనం కోసం కట్టుబడి ఉన్నట్లు ఉద్యమ చరిత్రను ప్రస్తావించారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులుజీవీ కొండారెడ్డి, చీకటి శ్రీనివాసరావు, జీ రమేష్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న రమాదేవి, పక్కన రమేష్, మాబు, కొండారెడ్డి, శ్రీనివాసరావు

యూటీఎఫ్ రణభేరి పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘ నేతలు

ఒంగోలు విద్య, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల ఆర్థిక, విద్యా రంగ సమస్యలపై యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 15 నుంచి ప్రారంభించనున్న రణ భేరి ప్రచార బైక్ జాతా పోస్టర్‌ను మంగళవారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ హై అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సంఘ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కే శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు, బోధనేతర కార్యక్రమాలను రద్దు చేయాలని, ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని, పునర్ వ్యవస్థీకరించిన పాఠశాలల వ్యవస్థను సరిచేయాలని, పేరుకుపోయిన వేల కోట్ల ఆర్థిక బకాయిలను చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలని, 12వ పీఆర్సీని ప్రకటించాలని, 29శాతం మధ్యంతర భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి డీవీ రాంజనేయులు, ఎన్.రవి, ఉమామహేశ్వరి, చినస్వామి, సంధ్యారాణి, వెంకటేశ్వరరావు, బాలరాజు, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాసులు, నారాయణ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రి



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి స్వామి

టంగుటూరు (కొండపి), సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తూర్పునాయుడుపాలెంలో జడ్పీ స్కూల్ అభివృద్ధి పనులను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి మంగళవారం పరిశీలించారు. జడ్పీ నిధులతో జరుగుతున్న ప్రహరీగోడ, ముఖద్వారం పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. స్కూల్ ఆవరణలోని పిచ్చి చెట్లను తొలగించాలని సూచించారు.

ఉపాధ్యాయ సమస్యలపై ఎస్టీయూ పోరాటం

కొండపి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ సమస్యలపై ఎస్టీయూ నిరంతరం పోరాటం సాగిస్తున్నదని యూనియన్ జిల్లా కార్యదర్శి గవిని శివశంకర్ అన్నారు. ముప్పవరంలోని జడ్పీ స్కూల్‌లో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు సిహెచ్.ఆదినారాయణ, నాయకులు కె.ప్రభాకర్‌రావు, పిగిలి కొండయ్య, టి.రమణయ్య, పి.చంద్రయ్య పాల్గొన్నారు.

జనసేన కార్యకర్త కుటుంబానికి రూ.5 లక్షల చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న బాలినేని ప్రణీత్, జనసేన నాయకులు

సింగరాయకొండ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాకల పంచాయతీ పరిధి కాంతినగర్‌కు చెందిన జనసేన కార్యకర్త వాయిల రాము కొద్ది నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. రాముకి జనసేన క్రియాశీల సభ్యత్వం ఉండటంతో ఆపార్టీ రూ.5లక్షల ప్రమాద బీమా చెక్కును పంపింది. దాన్ని మంగళవారం సాయినగర్‌లో నివాసం ఉంటున్న మృతుడి భార్య వాయిల కనకమ్మకు జనసేన నేత బాలినేని ప్రణీత్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కనపర్తి మనోజ్‌కుమార్, మండల అధ్యక్షుడు ఐనాబత్తిన రాజేష్, నాయకులు పాల్గొన్నారు.

జయవరంలో..

టంగుటూరు : మండలంలోని జయవరం గ్రామానికి చెందిన జనసేన కార్యకర్త దాచేపల్లి కృష్ణకిషోర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఆయన కుటుంబానికి పార్టీ పంపిన రూ.5లక్షల ఆర్థిక సాయం చెక్కును ఆపార్టీ నాయకుడు బాలినేని ప్రణీత్‌రెడ్డి శుక్రవారం కృష్ణకిషోర్ భార్య నాగజ్యోతికి అందించారు. కార్యక్రమంలో జనసేన వీర మహిళ రాయపాటి అరుణ, ఆపార్టీ కొండపి నియోజకవర్గ సమన్వయకర్త కనపర్తి మనోజ్‌కుమార్, టంగుటూరు, జరుగుమల్లి, సింగరాయకొండ మండలాల అధ్యక్షులు కె.రాంబాబు, గూడా శశిభూషణ్, ఐనాబత్తిన రాజేష్, పొన్నలూరు మండల నాయకుడు పత్తిపాటి మాధవ తదితరులు పాల్గొన్నారు.

విద్యావకాశాలను బాలలు సమర్థంగా వినియోగించుకోవాలి

అవీఇవీ



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సీఐ నాగరాజు

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : అందుబాటులో ఉన్న విద్యావకాశాలను వినియోగించుకుని మరింత ఉన్నతంగా ఎదగాలని ఒంగోలు వన్ టౌన్ సీఐ నాగరాజు చెప్పారు. గురుపూజోత్సవం సందర్భంగా స్థానిక 30 డివిజన్ టీడీపీ అధ్యక్షుడు నత్తల కనకారావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత ట్యూషన్ కేంద్రంలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీల్లోని విజేతలకు సీఐ నాగరాజు బహుమతి ప్రదానం చేశారు. సీఐ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నతంగా ఎదగాలని, ఉజ్వల భవిష్యత్ సాధించాలనే లక్ష్యంతో కనకారావు తన సొంత నిధులతో ఉచితంగా ట్యూషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. నిర్వాహకులు కనకారావు మాట్లాడుతూ 1 నుంచి 7వ తరగతి వరకు చదువుకునే విద్యార్థులకు గద్దలగుంటలోని మూడు బొమ్మల సెంటర్ వద్ద ఉచిత ట్యూషన్ ఏర్పాటు చేశానన్నారు. ఈ కార్యక్రమంలో నగర అభివృద్ధి అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు, దాయనేని ధర్మ, నత్తల శ్రీనివాసరావు, అంకబాబు పలువురు పాల్గొన్నారు.

'ఆస్టర్ రమేష్'లో ఆధునిక చికిత్స విజయవంతం

త్వరలో నల్లూరిలో ఎన్టీఆర్ వైద్యసేవలు అమలు : ఎండీ



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యులు

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని ఆస్టర్ రమేష్ హాస్పిటల్‌లో ఓ యువకుడికి అరుదైన శస్త్ర చికిత్స ఎక్స్‌ట్రాకార్పోరియల్ మెంబరెన్స్ ఆక్సిజన్(ఈసీఎంవో) చేసి, ప్రాణాలు కాపాడినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.వంశీకృష్ణ తెలిపారు. హాస్పిటల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గిద్దలూరుకు చెందిన 27 ఏళ్ల యువకుడు హఠాత్తుగా తీవ్ర ఆయాసం, అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో కార్డియాక్ అరెస్ట్‌కు గురైనట్లు తెలిపారు. దీంతో ఆసుపత్రికి రావడంతో స్పందించి క్లిష్టమైన చికిత్స చేసి ప్రాణహానిని నివారించామన్నారు. ఊపిరితిత్తుల్లో రక్తం గడ్డకట్టడంతో ఊపిరితిత్తులు, కిడ్నీలు పనితీరు పూర్తిగా స్థంభించిపోవడంతో అధునాతనమైన ఈసీఎంఓ చికిత్స చేసి ప్రాణాలు కాపాడినట్లు తెలిపారు. హాస్పిటల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ నల్లూరి నితిన్ మాట్లాడుతూ ఈసీఎంవో ఆపరేషన్ జిల్లాలో నిర్వహించడం వైద్య బృందం అంకితభావానికి నిదర్శనమన్నారు. హాస్పిటల్ ఎండీ డాక్టర్ పోతినేని రమేష్ మాట్లాడుతూ త్వరలోనే ఎన్టీఆర్ వైద్య సేవలను జిల్లా ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు.సమావేశంలో డాక్టర్లు వీజే సందీప్, ఎస్ శ్రీధర్‌రెడ్డి, జహంగీర్ సుల్తాన్ పాల్గొన్నారు.

14 రకాల రేషన్ సరుకులు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రమాదేవి

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రేషన్‌షాపుల ద్వారా 14 రకాల నిత్యవసర సరుకులను ప్రజలకు అందించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి డిమాండ్‌చేశారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో మంగళవారం ఐద్వా జిల్లా కమిటీ సమావేశానికి ఎస్‌డీ షర్మిల అధ్యక్షత వహించారు. సమావేశంలో రమాదేవి మాట్లాడుతూ నిత్యం పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలను అరికట్టే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ధరల నియంత్రణ చేపట్టడంతో పాటు ఆహార భద్రతచట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని కోరారు. ఆరు నెలలుగా రేషన్‌షాపుల్లో బియ్యం, పంచదార మాత్రమే ఇస్తున్నారని చెప్పారు. కందిపప్పు, నూనె ఊసేలేదన్నారు. గతంలో వాహనాల ద్వారా సరుకులు సరఫరా చేశారని, ఈ ప్రభుత్వం దానిని రద్దు చేయడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ సమావేశంలో ఐద్వా నాయకులు ఆదిలక్ష్మి, రాజ్యలక్ష్మి, కే లక్ష్మీప్రసన్న, కే రాజేశ్వరి, విశ్రాంత, డి. నారాయణమ్మ తదితరులు ఉన్నారు.

ఏఎంసీ చైర్మన్‌కు సత్కారం

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి) : ఒంగోలు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన రాచగొర్ల వెంకట్రావును జిల్లా వెనుకబడి తరగతుల సంక్షేమ సంఘం(రజకసంఘం) నాయకులు మంగళవారమిక్కడ సత్కరించారు. వెనుకబడిన వర్గానికి చెందిన వెంకట్రావుకు ఏఎంసీ చైర్మన్ పదవిని ఇచ్చినందుకు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పూడిపర్తి రవి, కడవకుదురు వెంకటేశ్వర్లు, కే శ్రీనివాసరావు, కే సురేష్ తదితరులు ఉన్నారు.

అట్టహాసంగా శ్రీ సరస్వతి మెగా స్పోర్ట్స్ వీక్



స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభిస్తున్న రమణారెడ్డి

ఒంగోలు విద్య, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని శ్రీ సరస్వతి విద్యాసంస్థల ఏడో మెగా స్పోర్ట్స్ వీక్‌ను మంగళవారం పెళ్లూరు శ్రీసరస్వతి జూనియర్ కళాశాల ఆవరణలో అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా 500 మంది విద్యార్థులు నిర్వహించిన మార్చ్‌ఫాస్ట్ ప్రదర్శన క్రీడాస్ఫూర్తిని ప్రతిబింబించింది. బాలురకు పెళ్లూరు క్యాంపస్‌లో, బాలికలకు చెర్వుకొమ్ముపాలెం క్యాంపస్‌లో వివిధ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించారు. పదిరోజుల పాటు జరగనున్న ఈ క్రీడా సంబరాల్లో 6వేల మంది విద్యార్థులు పాల్గొనున్నారు. ప్రారంభ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కళాశాల చైర్మన్ ఏవీ రమణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు ముఖ్యమన్నారు. కళాశాల డైరెక్టర్లు ఎ. గణేష్‌రెడ్డి, ఏజీ శంకర్‌రెడ్డి, సీఈవో ఎన్‌వీ సురేష్ పాల్గొన్నారు.

మహాలయ అమావాస్య నుంచే దసరా సెలవులు ఇవ్వాలి

నాగులుప్పలపాడు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం మహాలయ అమావాస్య ప్రారంభమైన రోజు నుంచే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు దసరా సెలవులు ఇవ్వాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జేవీఆర్ కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పాఠశాలలకు అకాడమిక్ క్యాలెండర్‌లో భాగంగా ఏటా దసరా సెలవులను మహాలయ అమావాస్య ప్రారంభమైన రోజు నుంచే దసరా సెలవులను ఇచ్చేవారని, ఈ విద్యా సంవత్సరంలో కూడా ఆ నియమాన్ని క్రమం తప్పకుండా పాటించి అమలు చేయాలని కోరారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి ఎమ్మెల్యే సాయం

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన టీడీపీ కార్యకర్త మండ్ల బుజ్జి కుటుంబానికి ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి రూ.50వేల ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. ఈ మేరకు రూ.50వేల నగదును మంగళవారం టీడీపీ నాయకులు బాధిత కుటుంబానికి అందజేశారు. మండలం ముండ్లపాడు గ్రామంలో టీడీపీ కార్యకర్త మండ్ల బుజ్జి పార్టీ కార్యక్రమాలలో ముమ్మరంగా పాల్గొనేవారు. అనారోగ్యంతో ఇటీవల మృతిచెందారు. కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే వారిని ఆదుకున్నారు. బుజ్జి భార్య మండ్ల తిరుమలమ్మకు ఉపసర్పంచ్ కడియం శేషగిరి, మార్కెట్‌యార్డు డైరెక్టర్ వినుకొండ చిన్న, నాయకులు పాలుగుళ్ల చిన్నశ్రీనివాసరెడ్డి, పెద్దశ్రీనివాసరెడ్డి, దిలీప్, అశోక్, వెంకటేశ్వర్లు నగదును అందజేశారు.

ఎమ్మెల్యేకు భగత్‌సింగ్ కాలనీవాసుల కృతజ్ఞతలు

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని భగత్‌సింగ్ కాలనీలో కాలనీ వాసులకు మంగళవారం ఇండ్ల ప్లాట్ల నెంబర్లు ఇచ్చారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు కౌన్సిలర్ హర్షితా బాబీ మాట్లాడుతూ.. భగత్ సింగ్ కాలనీలో ఎన్నో ఏళ్లుగా ఇంటి నెంబర్ల కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని, కాలనీలో శ్మశాన స్థలంతో పాటు పలు అభివృద్ధి పనులు చేపట్టిన ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్ సర్వేయర్ సంజీవయ్య, టీడీపీ నాయకులు తిరుపతయ్య, శివకుమార్, సీపీఎం నాయకులు రాజు తదితరులు పాల్గొన్నారు.

సబ్ డీఎఫ్‌వోగా బాలరాజు

గిద్దలూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : గిద్దలూరు అటవీ డివిజన్‌కు సబ్ డీఎఫ్‌వోగా 2023 ఐఎఫ్‌ఎస్ బ్యాచ్‌కు చెందిన కొప్పుల బాలరాజును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఐఎఫ్‌ఎస్ ట్రైనింగ్ పూర్తి చేసుకున్న వారికి పలు ప్రాంతాలలో పోస్టింగ్‌లు కేటాయించడంలో భాగంగా కొప్పుల బాలరాజును గిద్దలూరు సబ్ డీఎఫ్‌వోగా తొలి పోస్టింగ్ ఇస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు.

యూరియా కొరత లేదు

త్రిపురాంతకం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని, కొరత లేదని వ్యవసాయ సహాయ సంచాలకులు వెంకటరమణ అన్నారు. త్రిపురాంతకంలో మంగళవారం రైతు సేవా కేంద్రం వద్ద యూరియా అవుట్‌రిచ్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ రైతులు ఎరువులను విచ్చలవిడిగా వాడడం తగ్గించుకోవాలన్నారు.యూరియా వాడకం వల్ల కేవలం 30శాతం మాత్రమే పంట నత్రజనిని తీసుకుంటుందని, దాని స్థానంలో నానో యూరియా వాడితే 70 శాతం నత్రజనిని పంట తీసుకుంటుందని రైతులకు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి సంగమేశ్వరరెడ్డి, డీటీ కిరణ్, గ్రామ వ్యవసాయ సహాయకులు అబిద్ హుస్సేన్ పాల్గొన్నారు.

గిద్దలూరు : మండలంలోని కేఎస్‌పల్లి, ఉప్పలపాడు గ్రామాలలో యూరియా ఔట్‌రీచ్‌పై వ్యవసాయశాఖ అధికారులు రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. యూరియా వినియోగం, లభ్యతపై వివరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన తహసీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డి మాట్లాడుతూ గిద్దలూరు మండలంలో యూరియా కొరత లేదని పేర్కొన్నారు.



యూరియా ఔట్‌రీచ్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కార్యక్రమంలో ఏవో విజయభాస్కర్‌రెడ్డి, వ్యవసాయ విస్తరణాధికారులు శ్రీనివాసరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాఘవరావు పాల్గొన్నారు.

రాచర్ల : రసాయన ఎరువుల వాడకం వలన ఎలాంటి ప్రయోజనం లేదని మోతాదుకు మించి వాడితే నేల పాడవడమే కాకుండా క్యాన్సర్ లాంటి రోగాలు మనుషులకు సోకే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ ఏవో షేక్ మహబూబ్ బాషా అన్నారు. చిన్నగానిపల్లి, జేపీ చెరువు గ్రామాల్లో మంగళవారం ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీఏఏ రమణ, నూర్ అహ్మద్ పాల్గొన్నారు.

తర్లుపాడు : రైతులు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువుల వలన అధిక దిగుబడులు సాధించవచ్చని తహసీల్దార్ కేకే కిశోర్ కుమార్, ఎంపీడీవో చంద్రశేఖర్ అన్నారు. పలు రైతు సేవా కేంద్రాల్లో యూరియాపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏవో జోత్స్నదేవి, ఎంపీఈవో దేవేంద్రగౌడ్ పాల్గొన్నారు.

మార్కాపురం రూరల్ : రైతులు పంటల సాగులో రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని ఏడీఏ బాలాజీ నాయక్ సూచించారు. మండలంలోని తిప్పాయపాలెం, వేమలకోట గ్రామాల్లో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు, ఏవో బుజ్జిబాయి, పశు సంవర్ధక, రెవెన్యూ వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం : యూరియా బస్తా వద్దు.. నానో యూరియా ముద్దని వ్యవసాయశాఖ కార్యాలయం ఎదుట ఏవో నీరజ మంగళవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు.

పొదిలి : రసాయన ఎరువుల వినియోగం వద్దని మండల ఏవో డీ శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఈగలపాడు, పాములపాడు గ్రామాల్లో జరిగిన రైతుల అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

రైతులకు యూరియాను అందించాలి

ఎమ్మెల్యే చంద్రశేఖర్



సబ్ కలెక్టర్ త్రివినాగ్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మార్కాపురం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రాల ద్వారా యూరియాను రైతులకు అందించాలని ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే చంద్రశేఖర్, మార్కాపురం, గిద్దలూరు మాజీ ఎమ్మెల్యేలు కుందురు నాగార్జునరెడ్డి, అన్నా రాంబాబు అన్నారు. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు వైసీపీ ఆధ్వర్యంలో అన్నదాన పోరు కార్యక్రమం మంగళవారం మార్కాపురంలో జరిగింది. డివిజన్‌లోని మూడు నియోజకవర్గాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఉదయం స్థానిక గడియార స్తంభం వద్ద వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంద్రశేఖర్ మాట్లాడుతూ రైతులు ఎరువుల కొరతతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. వ్యాపారులు ఎరువులను దాచి కృత్రిమ కొరత సృష్టించి బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలకు అమ్ముకుంటూ సొమ్ముచేసుకుంటున్నారన్నారు. పండిన పంటలకు గిట్టుబాటు ధర కూడా దక్కడంలేదని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు మీర్జా షంషీర్ అలీబేగ్, వెన్నా హనుమారెడ్డి, కేవీ రమణారెడ్డి, మూడు నియోజకవర్గాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థినుల క్షేత్రపర్యటన

గిద్దలూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎనేబుల్ సర్వీసులో భాగంగా స్థానిక వివేకానంద ఐటీఐ కళాశాలను సందర్శించారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో శిక్షణ పొందుతున్న వైనాన్ని గమనించి విజ్ఞాన పరమైన అంశాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల హెచ్‌ఎం, ఎంఈవో నాగభూషన్‌రెడ్డి మాట్లాడుతూ వృత్తి విద్య కోర్సులు నేర్చుకుంటే భవిష్యత్‌లో తమ కాళ్ల మీద నిలబడడమే కాకుండా 10 మందికి జీవనోపాధి కూడా కల్పించవచ్చన్నారు. కార్యక్రమంలో ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరమణ, బాలికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జనసేన కార్యాలయంలో మంగళవారం ప్రమాద బీమా చెక్కును బాలినేని ప్రణీత్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇమ్మడి కాశీనాథ్ మాట్లాడుతూ.. ఇటీవల ప్రమాదవశాత్తు జనసేన క్రీయాశీలక సభ్యులు గురునాథం మృతిచెందగా, ఆయన కుటుంబ సభ్యులకు రూ.5లక్షల ప్రమాద బీమా చెక్కును అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు బాలనాగేంద్ర, రాయపాటి అరుణ, గిద్దలూరు, ఇన్‌చార్జిలు సాయిబాబు, కందుకూరి బాబు, పాపారావు, సాయి పాల్గొన్నారు.

మండలంలో 30యాక్ట్ అమలు

రాచర్ల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఈనెల 1వ తేదీ నుంచి 30 వరకు 30యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్‌ఐ పీ కోటేశ్వరరావు తెలిపారు. ధర్నాలు, ర్యాలీలు, సభలు, సమావేశాలు, నిరసనలు, ఎలాంటి కార్యక్రమాలు చేపట్టేందుకు వీలులేదని ఆయన సూచించారు.

బైకు కొనలేదని బాబాయ్‌పై దాడి

కంభం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్రవాహనం కొనివ్వలేదనే కోపంతో బాబాయ్‌పై దాడి చేసి గాయపరిచిన యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరసింహారావు తెలిపారు. ఎస్సై నరసింహారావు కథనం మేరకు.. కంభం మండలం రావిపాడు గ్రామానికి చెందిన అభిషేక్‌రెడ్డి తన బాబాయ్ శ్రీనివాసరెడ్డిని ద్విచక్రవాహనం కొనివ్వాలని అడుగగా, మనకు అంత స్తోమత లేదని తర్వాత కొనిస్తానని చెప్పడంతో కోపంతో అభిషేక్ రెడ్డి శ్రీనివాసరెడ్డిపై దాడి చేసి గాయపరిచినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు అభిషేక్ రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బైక్ పైనుంచి జారి పడి మహిళ మృతి

పెద్దదోర్నాల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పొలానికి వెళ్లిన భర్తకు రొట్టెలు తీసుకు వెళ్తూ గుండెపోటుతో మోటారు సైకిల్‌పై నుంచి జారి పడి మహిళ మృతి చెందిన ఘటన మంగళవారం మండల పరిధిలోని అయినముక్కల గ్రామ సమీపంలో జరిగింది. ఐనముక్కుల గ్రామానికి చెందిన దర్శనం నాగమ్మ(59)మృతి చెందింది. బైకు పైనుంచి పడిన ఆమెను ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది.

గుంతల పూడ్చివేత ప్రారంభం

» ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి చొరవతో కదిలిన ఆర్‌అండ్‌బీ అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



అల్లినగరం రోడ్డుపై గుంతలను పూడ్చువేయిస్తున్న ఆర్‌అండ్‌బీ అధికారులు

కొమరోలు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : అమరావతి - కడప రోడ్డుపై గుంతలను మంగళవారం అధికారులు పూడ్చారు. అమరావతి - కడప రోడ్డు అధ్వానం శీర్షికన ఆంధ్రజ్యోతిలో గత నెల 18న వచ్చిన కథనంపై ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి స్పందించి వెంటనే ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడి గుంతలను పూడ్చాలని ఆదేశించారు. దీంతో ఆర్‌అండ్‌బీ అధికారులు మంగళవారం గుంతలను పూడ్చే పనులు ప్రారంభించారు. వైసీపీ పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఈ రోడ్డు గుంతల మయంగా మారింది. దీంతో ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి సూచన మేరకు డీఈ ఎ రాంబాబు గుంతలను పూడ్చే పనులను ప్రారంభించడంపై ప్రయాణికులు హర్షం తెలిపారు.

పరస్పర సహకారంతో సేవ చేద్దాం



యోగానంద్‌ను సన్మానిస్తున్న గురుకుల సిబ్బంది

రాచర్ల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పరస్పర సహకారంతో ప్రజలకు సేవ చేద్దామని రాష్ట్ర గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ కే యోగానంద్ అన్నారు. పలువురు అధికారులు, సంఘ పెద్దలు మంగళవారం యోగానంద్‌ను రాచర్లలో కలిసి సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి సంక్షేమం కోసం ప్రభుత్వం పాటుపడుతుందని, మనమంతా కలిసి ప్రజల సమస్యలను పరిష్కరించి ప్రభుత్వానికి అండగా ఉందామని కోరారు. పశువైద్యాధికారి డీ హరిబాబు, గురుకులం ప్రిన్సిపాల్ మేరీ మంజుల, వైస్ ప్రిన్సిపాల్ శ్రీదేవీ, గిద్దలూరు ప్రభుత్వ ఖాజీ బృందం, మోడల్ స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎలుగుబంటి దాడిలో గాయపడిన వ్యక్తికి పరిహారం

పెద్ద దోర్నాల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఎలుగుబంటి దాడిలో గాయపడిన చెవుల వెంకటేశ్‌కు అటవీ శాఖ కార్యాలయంలో నష్ట పరిహారం చెక్కును అధికారులు మంగళవారం అందజేశారు. ఎర్రగొండపాలెం మండలం నెక్కంటి బీట్ పరిధిలో ఇష్టకామేశ్వరి గుడేనికి చెందిన వెంకటేశ్‌పై 2023 డిసెంబరు 7న పెద్దవాగు ప్రాంతంలో ఎలుగుబంటి దాడి చేసి గాయపర్చింది. దీంతో ఆయనకు రూ.75,000 చెక్కును అందజేశారు.

రోగాలపై అప్రమత్తంగా ఉండాలి

ఎర్రగొండపాలెం రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా రోగాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వెంకటాద్రిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పీ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం ఆసుపత్రిలో ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ అభిమాన్ శిబిరాన్ని నిర్వహించారు.

రాచర్ల : గర్భిణులు విధిగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని అనుములవీడు ప్రాథమిక వైద్యశాల వైద్యాధికారి కే రమేష్ అన్నారు. గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు.

యూరియాపై అసత్య ప్రచారం


మాట్లాడుతున్న డీసీఎంఎస్ చైర్మన్ శ్యామల కాశిరెడ్డి

కనిగిరి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): యూరియా కొరత అంటూ వైసీపీ అసత్య ప్రచారం చేస్తుందని డీసీఎంఎస్ చైర్మన్ శ్యామల కాశిరెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సూపర్ సిక్స్ - సూపర్‌హిట్ కార్యక్రమం విజయోత్సవ సభకు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక కూటమి ప్రభుత్వంపై లేనిపోని దుష్ప్రచారం చేస్తూ వైసీపీ పబ్బం గడుపుకోవాలని చూస్తుందన్నారు. విలేకరుల సమావేశం లో టీడీపీ నాయకులు రాచమల్ల శ్రీనివాసరెడ్డి, పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, కొండా కృష్ణారెడ్డి, ఫిరోజ్, అద్దంకి రంగబాబు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వృద్ధుడు మృతి

ముండ్లమూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలవరం ఎస్సీ కాలనీకి చెందిన నంబూరి పెద జక్రయ్య(65) మంగళవారం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. తన ఇంటి ఆవరణలో ఉన్న మోటారును ఆన్‌చేసేందుకు వెళ్లి షాక్‌కు గురై మృతి చెందాడు. గమనించిన మృతుని కుమారుడు విద్యుత్ సరఫరాను నిలిపివేయించారు. మృతునిక ఇంటికి లూజు కనెక్షన్‌తో మోటారుతో పాటు గోడలకు విద్యుత్ సరఫరా అవుతుంది. పది రోజులుగా లైన్‌మన్‌కు తెలియజేసినా పట్టించుకోలేదని జక్రయ్య బంధువులు ఆరోపిస్తున్నారు. మృతుడికి భార్య, ఐదుగురు పిల్లలు ఉన్నారు. జక్రయ్య కుమారుడు జాన్ ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ పీవీ హనుమంతరావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దర్శి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పీహెచ్‌సీ తనిఖీ

కురిచేడు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): కురిచేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం తహసీల్దార్ రజనీకుమారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మందుల విభాగం, ఓపీ విభాగం, శస్త్ర చికిత్సా విభాగాలను పరిశీలించారు. అనంతరం చికిత్స చేయించుకుంటున్న రోగులతో మాట్లాడారు. ఆమె వెంట వైద్యాధికారి రవితేజ, సుస్మితా రెడ్డి, వైద్య సిబ్బంది ఉన్నారు.

నేటి నుంచి నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్

కురిచేడులో నిలుపుదల

కురిచేడు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): 17225 నంబరు నర్సాపూర్ - హుబ్లీ ఎక్స్‌ప్రెస్ రైలు బుధవారం నుంచి కురిచేడులో ఆగనున్నది. గతంలో అమరావతి ఎక్స్‌ప్రెస్ రైలు పేరుతో నడిచే ఈ రైలు ప్రస్తుతం నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ పేరుతో నడుస్తున్నది.

దర్శిలో అధ్వానంగా పారిశుధ్యం

» రోగాల బారిన పడుతున్న ప్రజలు

దర్శి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణంలో పారిశుధ్యం పడకేసింది. అనేకచోట్ల మురుగునీరు కుంటలా నిల్వ ఉండటమే కాక రోడ్లపైకి చేరుతుంది. శివారు ప్రాంతాల్లో మురుగు కాల్వలు నిర్మించకపోవడంతో అధ్వాన్నంగా మారింది. మురుగు కాల్వల చుట్టూ గడ్డి పెరిగి దోమలకు ఉత్పత్తి కేంద్రాలుగా మారాయి. దీంతో ప్రజలు దోమల బారిన పడి రోగాలకు గురవుతున్నారు. ప్రస్తుతం దర్శి ప్రాంతంలో విషజ్వరాలు విపరీతంగా పెరిగాయి. ప్రధానంగా మురుగునీరు నిల్వ ఉండటంతో సోకే చెడు గాలి వల్ల దోమలు కుట్టడంతో గున్యా, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు సోకుతున్నాయి. స్వచ్ఛాంధ్ర పేరుతో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తూ పరిశుభ్రంగా ఉంచాలని ప్రభుత్వం సూచిస్తున్నా అధికారులు పట్టించుకోవటం లేదు.

దర్శి పట్టణంలో అనేక ప్రాంతాల్లో పారిశుధ్య లోపంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇంకా నిర్లక్ష్యం చేస్తే పరిస్థితులు ఇబ్బందికరంగా మారి రోగాల సంఖ్య పెరిగే ప్రమాదముంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుధ్య కార్యక్రమాలు క్రమం తప్పకుండా నిర్వహించాలి. అలాగే, మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.


దర్శిలోని 19వ వార్డులో రోడ్డుపైకి చేరిన మురుగునీరు

పారిశుధ్యం లోపించకుండా చర్యలు చేపట్టాలి

ముండ్లమూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పసుపుగల్లులో విషజ్వరం సోకి పామూరు మహాలక్ష్మి మృతి చెందారన్న విషం తెలుసుకున్న ఒంగోలు డీఎల్‌పీవో ఆర్.పద్మ మంగళవారం గ్రామాన్ని సందర్శించారు. వీధులను పరిశీలించి సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పారిశుధ్యం లోపించి వివిధరకాల వ్యాధులు ప్రబలితే అందుకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాలువల్లో పేరుకుపోయిన మురుగును తొలగించాలన్నారు. పంచాయతీ నిధులతో బ్లీచింగ్, ఎబేట్, ఆయిల్ బాల్స్ వేయాలన్నారు. పసుపుగల్లుతో పాటు పూరిమెట్ల గ్రామాల్లో కూడా పారిశుధ్యం లోపించి వ్యాధులు ప్రబలితే మాత్రం సహించేది లేదన్నారు. పంచాయతీ కార్యదర్శి మౌలాలి, క్లాప్ మిత్రలు ప్రత్యేకంగా దృష్టిపెట్టి వ్యర్ధ పదార్థాలు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో అబ్దుల్ రహీం, వైద్యాధికారి జాస్మిన్, సర్పంచ్ వరగాని బాలసుందరరావు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ దొంగపోరును ప్రజలు నమ్మరు

దర్శి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): వైసీపీ అన్నదాత పోరు పేరుతో డ్రామాలాడుతూ రైతులను మోసం చేస్తున్నారని దర్శి సొసైటీ చైర్మన్ కె.చంద్రశేఖర్, మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య తదితరులు ధ్వజమెత్తారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో 80వేల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయని స్పష్టం చేశారు. రైతులకు కావాల్సినంత యూరియా ఇతర ఎరువులు అందుబాటులో ఉన్నా వైసీపీ డ్రామాలాడటం సిగ్గుచేటన్నారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ దారం నాగవేణి, సుబ్బారావు, దామా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

282 విత్తనాల బస్తాలు సీజ్

దర్శి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజంపల్లిలో అధికారులు మంగళవారం ఎరువులు, విత్తనాల దుఖాణాలను తనిఖీలు చేశారు. ఏడీఏ బాలాజీనాయక్ ఆధ్వర్యంలో నిర్వహిచిన ఈ దాడుల్లో శ్రీప్రసన్నాంజనేయ ట్రేడర్స్ ఎరువుల దుఖాణాల్లో 282 విత్తనాల బస్తాలను అక్రమంగా నిల్వ చేసినట్లు గుర్తించారు. ఆ విత్తనాలకు సంబందించిన బిల్లులు లేకపోవటంతో సీజ్ చేసినట్లు ఏడీఏ బాలాజీనాయక్ తెలిపారు. కార్యక్రమంలో ఏవో కె రాధ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య కార్యక్రమాలు

ముండ్లమూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూరిమెట్ల గ్రామంలో ముమ్మరంగా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. 'మంచం పట్టిన పూరిమెట్ల' శీర్షికన మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంతో సర్పంచ్ ఒగులూరి రామాంజీ పారిశుధ్య పనులకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వేణు ఉన్నారు.

ముండ్లమూరును 'ప్రకాశం'లో కొనసాగించాలి

ముండ్లమూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ముండ్లమూరు మండలాన్ని కొత్తగా ఏర్పడే మార్కాపురం జిల్లాలో కలపకుండా ప్రకాశం జిల్లాలో ఉంచాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కైపు వెంకట కృష్ణారెడ్డి అన్నారు. ఈమేరకు మంగళవారం తహసీల్దాకు వినతి పత్రం అందజేశారు.

ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

ముండ్లమూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠినచర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణ హెచ్చరించారు. దుకాణదారులు యూరియాతో పాటు వివిధ రకాల కాంప్లెక్స్ ఎరువుల కొరత సృష్టించి రైతుల వద్ద అధిక ధరలు వసూలు చేస్తే చర్యలు తప్పవన్నారు. మండలంలోని పోలవరం, శంకరాపురం, మారెళ్ళ, నూజెండ్లపల్లి, నాయుడుపాలెం, పూరిమెట్ల గ్రామాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఎరువుల దుకాణదారులు, రైతులతో సమావేశం నిర్వహించారు.

కాగా, మండలంలోని పూరిమెట్ల గ్రామంలో విష జ్వరాలు సోకి పలువురు చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న తహసీల్దార్ మారెళ్ళలోని ఆస్పత్రికి వెళ్ళి పరామర్శించారు. పూరిమెట్ల వెళ్ళి వైద్య శిబిరాన్ని సందర్శించారు.

దొనకొండ: యూరియా అందడం లేదని రైతులు ఆందోళన చెందొద్దని తహసీల్దార్ రమాదేవి అన్నారు. మంగళవారం స్థానిక రైతు సేవా కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఏవో బాలకృష్ణానాయక్ తదితరులు పాల్గొన్నారు.

పీసీపల్లి: అవసరాన్ని మించి యూరియాను వాడవద్దని తహసీల్దార్ సీహెచ్ ఉష అన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని నేరేడుపల్లిలో మంగళవారం రసాయనిక ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

వెలిగండ్ల: రసాయన ఎరువుల వినియోగాన్ని రైతులు తగ్గించాలని వ్యవసాయ అధికారి టి.శిల్ప అన్నారు. మండలంలోని పలుగ్రామాల్లో మంగళవారం జరిగిన అవగాహన కార్యక్రమాల్లో ఆమె మాట్లాడారు. మోతాదుకు మించి రసాయన ఎరువులను వినియోగిస్తే భూసారం దెబ్బతిని భూమి సహజ స్థితిని కోల్పోతుందన్నారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ వాసు, ఎంపీడీవో బాషా, తదితరులు పాల్గొన్నారు.

పామూరు: యూరియా, రసాయనక ఎరువులు అధికంగా వాడితే భూసారం తగ్గుతుందని ఏవో టి.అబ్రహం అన్నారు. మంగళవారం రైతు సేవా కేంద్రాల్లో జరిగిన అవగాహన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. ఏవోతోపాటు తహసీల్దార్ వాసుదేవరావు, ఎంపీడీవో బ్రహ్మయ్య సారథ్యంలో మూడు బృందాలుగా ఏర్పడి రైతు సేవా కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

కనిగిరి: రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని ఏడీఏ జైనులాబ్దిన్ అన్నారు. మంగళవారం మండలంలోని వంగపాడులో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అనంతరం గ్రామంలో యూరియా కొరత లేదు, అపోహలు వద్దంటూ ప్రచారం చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవిశంకర్, యారవ రమాశ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

దర్శి: రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని తహసీల్దార్ ఎం.శ్రావణ్‌కుమార్, ఏడీఏ కె.బాలాజీనాయక్ సూచించారు. దర్శి మున్సిపాలిటీలోని శివరాజ్‌నగర్‌లో మంగళవారం సాయంత్రం రైతులతో కలిసి అవగాహన సదస్సులో వారు మాట్లాడారు.



రైతులకు తగినంత యూరియా అందించాలి

కనిగిరి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైతులకు తగినంత యూరియా సరఫరా చేయాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. వైసీపీ పిలుపుమేరకు యూరియా కొరతపై మంగళవారం కనిగిరిలో జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులకు ఎంత ఎరువులు అవసరమో తెప్పించి ఆదుకోవాలని కోరారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దద్దాల నారాయణ యాదవ్, మున్సిపల్ చైర్మన్ గఫార్, జడ్పీటీసీ కస్తూరిరెడ్డి, గంగసాని లక్ష్మీ, గాయం సావిత్రి, డీసీసీబీ మాజీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి తదితరులు

నానో ఎరువులను వినియోగించాలి

కురిచేడు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): రసాయనిక ఎరువులను తగ్గించి నానో ఎరువుల వినియోగం పెంచాలని తహసీల్దార్ రజనీకుమారి పేర్కొన్నారు. మంగళవారం కురిచేడులో తహసీల్దార్, వ్యవసాయశాఖాధికారులు రైతులతో కలసి ర్యాలీ నిర్వహించారు. రైతు సేవా కేంద్రంలో జరిగిన సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ అవసరంమేరకే యూరియాను పంటలకు వినియోగించుకోవాలన్నారు. రసాయన ఎరువులకు ప్రత్యామ్నాయంగా నానో ఎరువుల వినియోగం పెంచాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి సంపత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



- లక్ష మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం
- బాపట్లకు రేపు ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యేలు

ఉప ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటమురళి, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, ఎస్పీ తుషార్ డూడీ

తీర రక్షణకు కార్యాచరణ

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

తీర ప్రాంత రక్షణకు ప్రకృతి సహజసిద్ధంగా ప్రసాదించిన మడ అడవుల విస్తీర్ణం ఏటికేడు తగ్గిపోతున్న నేపథ్యంలో తీర ప్రాంత భద్రతకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. తీర ప్రాంతంలో భద్రతకు రక్షణ కవచంలా నిలిచే మొక్కల పెంపకంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ క్రమంలో దాదాపు లక్ష తాటి మొక్కలు నాటే కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రారంభించనున్నారు. సూర్యలంక బీచ్ రోడ్డులో మొక్కలు నాటే కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శ్రీకారం చుట్టనున్నారు. అంతరించిపోతున్న తాటి మొక్కలను సంరక్షించాలని సంకల్పించారు. ఇందుకు అటవీశాఖ అమర వీరుల దినాన్ని పవన్‌కల్యాణ్ వేదికగా మార్చుకున్నారు. ఈ క్రమంలో గురువారం పవన్‌కల్యాణ్ అడవిపాలెం పంచాయతీ పరిధిలో మొక్కలు నాటనున్నారు. జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవం సందర్భంగా బాపట్ల మండలంలోని నగర వనంలో ప్రత్యేక కార్యక్రమం జరగనున్నది. ఈ నేపథ్యంలో పవన్ కల్యాణ్ పర్యటనకు సంబంధించిన భద్రతా ఏర్పాట్లను కలెక్టర్ జె.వెంకటమురళి, ఎస్పీ తుషార్‌డూడి, బాపట్ల ఎమ్మెల్యే నరేంద్రవర్మతో కలిసి మంగళవారం పరిశీలించారు. నగర వనానికి వచ్చేమార్గంలో పవన్‌కళ్యాణ్ తాటి మొక్కను నాటనున్నారు. అనంతరం నగరవనరంలో అమరవీరుల స్థూపాన్ని ఆవిష్కరిస్తారు. విధినిర్వాహణలో ప్రాణత్యాగం చేసిన సిబ్బందికి నివాళులు అర్పించనున్నారు. ఈ సందర్భంగా అమరవీరుల కుటుంబసభ్యులతో ఆయన సమావేశం కానున్నారు. పవన్‌కల్యాణ్ హెలీకాప్టర్ ద్వారా బాపట్లకు రానున్నారని కలెక్టర్ తెలిపారు. సూర్యలంక నుంచి నగర వననానికి వచ్చే మార్గంలో ట్రాఫిక్, భద్రతా ఏర్పాట్లపై ఎస్పీ సమీక్షించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నామని ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్, డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్, జిల్లా అటవీశాఖాధికారి వినోద్, రెవెన్యూ, పోలీసు, వివిధశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తీరంలో గ్రీన్‌వాల్

జిల్లాలో మడ అడవుల విస్తీర్ణం ఏటికేడు కుచించుకుపోతూ వస్తోంది. దీంతో తుపాన్ల సమయంలో తీర ప్రాంత రక్షణ ప్రశ్నార్థకంగా మారుతోంది. విపత్తుల సమయంలో గాలుల తీవ్రతతో పాటు ఆటుపోట్లకు తీరం కోతకు గురవకుండా కూడా మడ అడవులు ఎంతగానో దోహదం చేస్తాయి. ఇంతటి కీలకమైన వాటిపై గత కొన్నేళ్లుగా అక్రమార్కుల కన్ను పడింది. ముఖ్యంగా అడవులను ధ్వంసం చేసి చెరువులుగా తవ్వి తమ స్వార్థం కోసం ప్రకృతిని చెరబడుతున్నారు. ఈ క్రమంలో తీర ప్రాంత భద్రత కోసం గ్రీన్ వాల్ ఏర్పాటయ్యేలా చూడడం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ముఖ్య ఉద్దేశంగా ఉంది. ఇందుకు సంబంధించి ఆయా విభాగాలకు ఆదేశాలు కూడా అందాయి. ముఖ్యంగా మడ మొక్కలతో పాటు సమానంగా తాటి మొక్కలకు కూడా అదే ప్రాధాన్యం ఇచ్చేలా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. మడ అడవులతో పాటు తాటి చెట్లు కూడా తీర ప్రాంత రక్షణకు సహజ కవచంలాగా పనిచేయనున్నాయి. పైగా నీటి ఎద్దడి లాంటి ప్రభావాలు కూడా తాటి చెట్లు ఎదుగుదలపై ప్రభావం చూపవు. ఈ దృష్ట్యానే తీర ప్రాంతానికి తాటిచెట్లతో గ్రీన్‌వాల్ ఏర్పాటు అయ్యేలా భవిష్యత్ ఉండాలని, ఆ దిశగా యాక్షన్ ప్లాన్‌ను యంత్రాంగం రూపొందిస్తోంది. అటవీశాఖతో పాటు డ్వామా విభాగాలను మొక్కలు నాటడంలో భాగస్వామ్యం చేయనున్నారు.



పైలాన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ తుషార్‌డూడి

- మారిన శ్లాబులతో ధరాభారం నుంచి ఉపశమనం
- ఎలక్ట్రానిక్ వస్తువులు, వాహనాల ధరలు భారీగా తగ్గుదల
- పండగ ఆఫర్లు, డిస్కౌంట్లతో కొనుగోలు దారులకు కంపెనీల వల
- భారీ స్థాయిలో దసరా, దీపావళి కొనుగోళ్లు ఉంటాయని వ్యాపారుల అంచనా

పండగే.. పండగ



దసరా.. దీపావళి... చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా అన్ని వర్గాలు పండుగ సంబరాల్లో మునిగితేలతాయి. అయితే ఈ సారి వ్యాపార వేత్తలు కూడా ఆనందంగా పండగ కోసం ఎదురుచూస్తున్నారు. ప్రధాని మోదీ ప్రజలపై జీఎస్టీ భారం తగ్గిస్తూ గత నెలలో ప్రకటించగా అది ఈ నెల దసరా నవరాత్రుల ఆరంభం నుంచి అమల్లోకి రానున్నది. దీంతో వివిధ వస్తువుల ధరలు భారీగా తగ్గను న్నాయి. సాధారణంగా సామాన్యుల నుంచి మధ్య వర్గాలు ఎక్కువగా దసరా, దీపావళి పండగల సంద ర్భంగా భారీగా కొనుగోళ్లు చేస్తుం టారు. ఇదే సమయంలో జీఎస్టీ శ్లాబుల మార్పు కూడా ఈ పం డుగల సమయాల్లో ఉండటం తో వివిధ కంపెనీల నిర్వాహ కులతో పాటు ఈ- కామర్స్ వెబ్‌సైట్లు పండగ ఆఫర్లు, రాయితీలు అంటూ విని యోగదారులను ఆకర్షించేం దుకు సిద్ధమయ్యాయి. దీంతో అటు ధరలు తగ్గి తమకు భారం తగ్గను న్నదని వినియోగదారులు.. ఇటు భారీ కొనుగోళ్లతో ఆదాయాలు పొందవచ్చని వ్యాపారులు దసరా పండగ కోసం ఎదురుచూస్తున్నారు. మొత్తం మీద దసరా నవరాత్రుల నుంచి కొనుగోళ్ల సందడికి వినియోగదారులు, వ్యాపారులు సిద్ధమవుతున్నారు.

జీఎస్టీ తగ్గింపుతో కొనుగోళ్ల సందడి



చీరాల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం వస్తు సేవల పన్ను(జీఎస్టీ) టారీఫ్‌ల్లో మార్పులతో ధరలు భారీగా తగ్గనున్నాయి. భారీగా తగ్గిన జీఎస్టీ పన్నులు అమల్లోకి వచ్చే ఈ నెల 22 నుంచి ఈ తగ్గింపులు అమల్లోకి రానుండటంతో కొనుగోలుదారుల్లో దసరా పండగ కోసం ఎదురుచూస్తున్నారు. ఈ ధరల తగ్గుదలతో పాటు దసరా, దీపావళి పండగ అమ్మకాల సందర్భంగా వచ్చే భారీ రాయితీలు కూడా వినియోగదారులను ఊరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో చిన్న, సన్న కారు మొదలు మధ్య తరగతి వర్గం వరకూ అందరూ పండగ అమ్మకాల కోసం ఎదురు చూస్తున్నారు. వచ్చే నెలలో ప్రజలకు అత్యంత ప్రీతి పాత్రమైన దసరా, దీపావళి పండగలు ఉన్నాయి. ఈ పండగల సందర్భంగా

(మిగతా 6వ పేజీలో)



యూరియా పంపిణీ రసాభాస



ఏవో నరేంద్రబాబుతో యూరియా కోసం వచ్చిన రైతులు వాగ్వివాదం

సిబ్బంది నుంచి చీటీలను లాక్కొన్న రైతులు

కొల్లూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కొల్లూరులోని మన గ్రోమోర్ కేంద్రానికి 440 బస్తాల యూరియా సరఫరా కాగా పంపిణీ రసాభాసగా మారింది. యూరియా కోసం మంగళవారం ఉదయం 6 గంటలకే రైతులు పెద్దసంఖ్యలో కేంద్రం వద్ద బారులు తీరారు. 10.30, 11 గంటలకు అధికారులు వచ్చి పంపిణీ చేస్తారని అప్పటి వరకు ఆగాలని కేంద్రం సిబ్బంది రైతులకు చెప్పి తలుపులు వేసుకున్నారు. చేసేదేమీ లేక రైతులు పడిగాపులు కాశారు. 10.30 సమయంలో రెవెన్యూ, వ్యవసాయ, పోలీసు సిబ్బంది కేంద్రం వద్దకు వచ్చారు. నానో డీఏపీ గురించి వివరించేందుకు ఏవో సిద్ధం కాగా ఉదయం నుంచి ఎండలో నానా పాట్లు పడితే యూరియా పంపిణీ చేయకుండా సమావేశం ఏర్పాటు చేయడం ఏమిటంటూ ఆయనపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తీసుకున్న వారే మళ్లీమళ్లీ తీసుకుంటున్నారనడంతో ఏవోకు రైతులకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో వారి మధ్య తోపులాట జరిగింది. దీంతో సహనం కోల్పోయిన రైతులు సిబ్బంది వద్ద ఉన్న స్లిప్పులను లాక్కున్నారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. ఆ తర్వాత రైతులు శాంతించినా బయోమెట్రిక్ పరికరం మొరాయించడంతో యూరియా పంపిణీ ఆలస్యమైంది. చివరకు రేపల్లె ఏడీ లక్ష్మీ, మండల ప్రత్యేక అధికారి దేవరాజు రైతులకు యూరియా పంపిణీ చేశారు.



స్లిప్పుల కోసం ఎగబడుతున్న రైతులు

కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్‌గా శ్రీనివాసకుమార్

భట్టిప్రోలు(కొల్లూరు), సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్‌గా మోటూరు పుణ్యశ్రీనివాసకుమార్ నియమితులయ్యారు. సోమవారం నాలుగు కార్పొరేషన్లను, డైరెక్టర్లను ప్రభుత్వం నియమించింది. వీటిలో రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పదవి భట్టిప్రోలు మండలం వెల్లటూరుకు చెందిన శ్రీనివాసకుమార్‌ను వరించింది. తనకు అవకాశం కల్పించిన ఎమ్మెల్యే నక్కా ఆనందబాబును మంగళవారం గుంటూరు క్యాంపు కార్యాలయంలో మండల నాయకులతో పాటు శ్రీనివాసకుమార్ కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ వాకా ఆనంద్ శేషుబాబు, నూతక్కి దినకరబాబు, కాట్రగడ్డ మల్లేశ్వరరావు, వేములపల్లి జగన్నాథరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ఆనందబాబును కలిసిన శ్రీనివాసకుమార్ తదితరులు

నాలా రద్దు.. అమల్లోకి

- ఇక పారిశ్రామిక అభివృద్ధి పరుగులు
- హర్షం వ్యక్తం చేస్తోన్న పెట్టుబడిదారులు
- పాత దరఖాస్తులకు యథావిధిగా వసూలు
- గతంలో 9 శాతం.. ఆ తర్వాత 3.. ఇప్పుడు సున్నా

రేపల్లె, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నాన్-అగ్రికల్చరల్ ల్యాండ్స్ అసెస్‌మెంట్ యాక్టు(ఎన్ఏఎల్ఏ)ని ప్రభుత్వం రద్దు చేసింది. ఈ ఏడాది మే నెలలో కలెక్టర్ల సదస్సు సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాలా చట్టం రద్దుని ప్రకటించారు. ఆ తర్వాత మంత్రివర్గం ఆమోదం పొంది గవర్నర్ సంతకంతో తాజాగా నాలా చట్టం రద్దు అమల్లోకి వచ్చింది. ఇప్పటికే ఈ విషయాన్ని సబ్ కలెక్టర్లు, ఆర్డీవోలకు తెలియజేశారు. ఇకపై వ్యవసాయేతర భూములకు ఎలాంటి ఫీజులు కట్టించుకోవద్దని ఆదేశాలు జారీ చేశారు. చట్టం అమల్లోకి రాక ముందు వచ్చిన దరఖాస్తులను మాత్రం పాత నాలా చట్టం ప్రకారమే నిర్ణీత ఫీజులు చెల్లించుకుని పరిష్కరించాలని ప్రభుత్వం ఆదేశించింది. వ్యవసాయ అవసరాలకు వినియోగించని భూములపై పన్ను విధించేందుకు 1963వ సంవత్సరంలోనే నాలా చట్టాన్ని ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చింది. 2006లో ఒక దఫా ఈ చట్టాన్ని మార్చారు. మొదట్లో భూముల మార్కెట్ విలువపై 9 శాతం నాలా చార్జీలను వసూలు చేసేవారు. ఆ తర్వాత దీనిని మూడు శాతానికి తగ్గించారు. ఎవరైనా వ్యవసాయ భూమిని వ్యవసాయేతర అవసరాలకు వినియోగించదలిస్తే తొలుత నాలా చార్జీలు చెల్లించి ఆ తర్వాతనే దరఖాస్తు చేసుకోవాలి. ఇది ఒక విధంగా పారిశ్రామిక అభివృద్ధికి ప్రతిబంధకంగా మారింది. ఈ విషయం సీఎం చంద్రబాబు దృష్టికి వెళ్లడంతో ఆయన అధికారులతో చర్చించారు. నాలా చట్టం రద్దు వల్ల ఫీజుల రూపంలో ప్రభుత్వం ఆదాయం కోల్పోవాల్సి ఉంటుంది. అయినా అమరావతి రాజధాని పరిసర ప్రాంతాలు, ఇతర నియోజకవర్గాల్లో పారిశ్రామిక అభివృద్ధి జరిగే అవకాశం ఉండటంతో నాలా చట్టాన్ని రద్దు చేస్తూ ప్రభుత్వం నిర్ణయిం తీసుకుంది. కాగా చాలామంది పాత దరఖాస్తులు కూడా కొత్త చట్టం కిందకు వస్తాయని అపోహకు గురౌతున్నారు. అయితే నాలా రద్దు చట్టంలో పెండింగ్ దరఖాస్తుల విషయాన్ని పొందుపరిచారు. పాత దరఖాస్తులను ఇంతకు ముందు ఉన్న చట్టం ప్రకారమే పరిష్కరించాలని ప్రభుత్వం స్పష్టంగా పేర్కొన్నది. అనధికార లేఅవుట్ల విషయంలో ఫీజులు మాత్రమే వసూలు చేయాలని, జరిమానాలు, వడ్డీలు విధించొద్దన్న నిబంధన పొందుపరిచింది. నాలా రద్దు చట్టంపై త్వరలోనే రెవెన్యూ అధికారులు మండలాల వారీగా సదస్సులు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తారు. నాలా ఫీజు రద్దుపై పెట్టుబడిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గేదెల కొనుగోళ్లపై ఒత్తిడి

- పొరుగు జిల్లాలవి వద్దంటోన్న మహిళలు
- కమీషన్ల కోసం కొనుగోలు చేయిస్తున్నారని ఆరోపణ
- అధికారుల ఒత్తిడిపై మంత్రి రవికుమార్‌కు సంఘాల ఫిర్యాదు
- జిల్లాలో ఒక్కో మండలానికి 500 వందల గేదెలు కొనుగోలుకు టార్గెట్లు

బల్లికురవ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పాడి పరిశ్రమను వృద్ధిలోకి తెచ్చేలా ప్రభుత్వం మహిళలకు గేదెల కొనుగోలుకు రుణాలు ఇస్తోంది. అయితే ఆయా మహిళలతో పొరుగు జిల్లాల ఫారాల్లోని పాడి గేదెలు కొనుగోలు చేయించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో తాము చెప్పిన గేదెలు మాత్రమే కొనుగోలు చేయాలని మహిళలపై వెలుగు అధికారులు ఒత్తిడి తెస్తున్నారు. మండలానికి ఐదు వందలు కొనుగోలు చేయాలని టార్గెట్లు పెట్టి పొదుపు గ్రూపులపై ఒత్తిడి తెస్తున్నారు. ఇతర జిల్లాల నుంచి తెచ్చే గేదెలు ఇక్కడ పాలు తక్కువ ఇస్తున్నాయని, వాతావరణ ప్రభావం తీవ్రంగా ఉంటుందని వాటి కొనుగోలుపై పొదుపు సంఘాల మహిళలు అనాసక్తి చూపుతున్నారు. పైగా ఇక్కడ తక్కువ ధరకు లభించే వాటిని కాదని ఎక్కువ ధర చెల్లించి ఇతర జిల్లాల్లో కొనుగోలు చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. గేదెలు ఇస్తామంటే సంతోష పడిన మహిళలు ఇప్పుడు గేదెలు వద్దే వద్దు అంటున్నారు. కమీషన్ల కోసం అధికారులు గేదెలు అంటకడుతున్నారని మహిళలు ఆరోపిస్తున్నారు. జిల్లాలోని 25 మండలాల్లో ఉన్న వెలుగు కార్యాలయాల పరిధిలో ఉన్న గ్రామ సంఘాల ద్వారా జిల్లా, మండల స్థాయి అధికారులు బ్యాంకు లింకేజీ రుణాల ద్వారా ఒక్కో మహిళకు గేదె కొనుగోలుకు రూ.1 లక్ష వరకు రుణాలను ఇస్తున్నారు. లబ్ధిదారులు ఎక్కడైన గేదెలు కొనుగోలు చేసుకోవచ్చు. కానీ తాము చెప్పిన చోటే గేదెలు కొనుగోలు చేయాలని ఆదేశాలు ఇచ్చారని అలా కొనుగోలు చేస్తే తమకు నష్టం వస్తుందని మహిళలు వాపోతున్నారు. కంకిపాడు, తణుకు, భీమవరం ప్రాంతాల్లోని డెయిరీ ఫాంలోనే గేదెలు కొనుగోలు చేయాలని మహిళలు సూచిస్తున్నారు. అక్కడ గేదెలకు పాలు తాము చూసిన సమయంలో ఎక్కువ ఇస్తే ఇక్కడకు తీసుకు రాగానే సగానికి సగం తగ్గిపోతున్నాయని అడిగితే పట్టించుకోవడం లేదం టున్నా రు. అధికారులు ఇతర జిల్లాల్లోని డెయిరీ ఫాంలతో ముందుగానే మాట్లా డుకుని గేదెలు కొనుగోలు చేయిస్తే కమీషన్లు ఇచ్చేలా ఒప్పందం కుదుర్చు కున్నారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికే పొదుపు మహిళలకు ఇబ్బం దులు లేకుండా చర్యలు చేపట్టాలని మంత్రి జిల్లా అధికారులను ఆదేశిం చారు. అయినా అధికారులు తగ్గడంలేదు. ఈ క్రమంలో మరో మారు మంత్రిని కలిసేందుకు పొదుపు సంఘాల మహిళలు సిద్ధమవుతున్నారు. ఇటీవల బల్లికురవ వెలుగు కార్యాలయంలో అన్ని గ్రామ సంఘాలతో సమావేశ మైన అధికారులు తాము చెప్పిన దగ్గరే గేదెలు కొనుగోలు చేయాలని చెప్పారని మహిళలు వాపోతున్నారు. బ్యాంకుల ద్వారా రుణాలను కూడా మంజూరు చేసి నేరుగా డెయిరీ ఫాంల వారికే చెక్కులను అందజేసే బాధ్యత కూడా తమదేనని అధికారులు చెప్పారన్నారు. గత ఏడాది కూడా ఇలానే గేదెలు అంట గట్టారని అవి కొన్ని నెలలకే ఒట్టి పోయాయని మహిళలు వాపోయారు. ఆ గేదెల వల్ల నష్టపోయామని, రుణాలను సకాలంలో చెల్లించామన్నారు. జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి గేదెల కొనుగోళ్లపై ఒత్తిడి నుంచి కాపాడాలని మహిళలు కోరుతున్నారు.



డెయిరీ ఫాంలో అమ్మకాలకు సిద్ధంగా ఉన్న గేదెలు (పాత చిత్రం)

అద్దంకి ఆర్టీసీకి పూర్వ వైభవం వచ్చేదెప్పుడో?

- కోవిడ్ తర్వాత సర్వీసుల పునరుద్ధరణలో విఫలం
- నేడు అద్దంకి డిపోకు రానున్న ఎండీ ద్వారకా తిరుమలరావు

అద్దంకి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు అద్దంకి ఆర్టీసీ డిపో ఆదర్శంగా నిలుస్తూ ముందు వరుసలో ఉండేది. రాష్ట్ర, రీజియన్ స్థాయిలో ఏ విభాగంలో చూసినా మొదటి మూడు స్థానాల్లో నిలిచేది. అయితే కోవిడ్ తర్వాత నుంచి గత వైభవం ఏటికేడు పడిపోతూ వస్తోంది. అనేక గ్రామాలకు సర్వీసులు పునరుద్ధరించడంలో అధికారులు పూర్తిగా విఫలమ్యారు. దీంతో అద్దంకి డిపోలో బస్సులను ఇతర డిపోలకు పంపారు. గతంలో అద్దంకి డిపోలో 80కు పైగా బస్సులు ఉండగా ప్రస్తుతం సంస్థకు చెందినవి 39, అద్దెబస్సులు 25 ఉన్నాయి. బస్సుల కొరతతో గ్రామీణ, దూర ప్రాంతాలకు సర్వీసులు రద్దయ్యాయి. హైదరాబాద్‌కు గతంలో నాలుగు బస్సులు ఉండగా ప్రస్తుతం రెండింటితో సరిపెడుతున్నారు. నైట్‌హాల్ట్ బస్సులు గతంలో 20కి పైగా ఉండగా ప్రస్తుతం రెండు, మూడుకే పరిమితమయ్యాయి. నియోజకవర్గంలో ఆర్టీసీ బస్సులు నడవని గ్రామాలు 30కు పైగానే ఉన్నాయి. ఆయా గ్రామాల నుంచి అద్దంకి రావాలంటే ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామాలకు బస్సులు లేకపోవడంతో స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలు లబ్ధి పొందలేకపోతున్నారు. అద్దంకి-బొద్దికూరపాడు, అద్దంకి-చిలకలూరిపేట వయా వైదన మీదగా బస్సులు ఉదయం పూట మాత్రమే పరిమితం చేయడంతో ప్రయాణికులు తిరిగి స్వగ్రామాలకు వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నారు.

శిథిలావస్థలో బస్టాండ్

సుమారు 4 దశాబ్దాల క్రితం నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్ శిథిలావస్థకు చేరింది. దీంతో తరచూ శ్లాబు పెచ్చులు ఊడి ప్రయాణికులు గాయపడిన సంఘటనలు కూడా ఉన్నాయి. రంగులు వేసి సోకులు చేశారే కానీ పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయలేదు. ఇటీవల కొత్త బస్ లను ప్రారంభోత్సవ సమయంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ బస్టాండ్ దుస్థితి గురించి తెలియజేయగా రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి మోడల్ బస్టాండ్ నిర్మాణానికి హామీ ఇచ్చారు. బుధవారం డిపోను ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు సందర్శించనున్నారు. ఈ నేపథ్యంలో డిపో అభివృద్ధి, సర్వీసుల పునరుద్ధరణపై దృష్టి సారించాలని ప్రయాణికులు కోరతున్నారు.

తవ్వారు.. వదిలేశారు

- పైపులైను కోసం సీసీ రోడ్లు ధ్వంసం
- చెన్నుపల్లిలో రోడ్లపై గోతులతో ప్రజల అవస్థలు

బల్లికురవ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నుపల్లి గ్రామంలో జలజీవన్ మిషన్ నిధులతో వాటర్ పైపులైన్ ఏర్పాటుకు సీసీ రోడ్లను పగల గొట్టి గోతులు పూడ్చకుండా వదిలేశారు. దీంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. గ్రామంలో ఇంటింటికి కుళాయి ద్వారా నీరు అందించేందుకు రక్షిత నీటి పథకం నుంచి అన్ని వీధులకు పైపులైన్ పనులు ఇటీవల చేపట్టారు. సీసీ రోడ్డు మార్జిన్ పగల గొట్టి పైపులైన్ వేసి తిరిగి మరమ్మతులు చేస్తామని సంబంధిత కాంట్రాక్టర్ చెప్పారు. అయితే పైపులైన్ పనులు ముగిశాక రోడ్ల గురించి పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. గతంలో ఎంతో బాగున్న సీసీ రోడ్లు ఇప్పుడు గోతుల మయం అయ్యాయని తెలిపారు. రాత్రుళ్లు రోడ్ల మార్జిన్‌లోని గోతుల్లో పడి గాయపడుతున్నట్లు వాపోయారు.



చెన్నుపల్లిలో వాటర్ పైపులైను కోసం రోడ్డును తవ్వి గోతులను పూడ్చని వైనం

అవీ..ఇవీ..

చెన్నుపల్లి ఎస్సీ కాలనీ వద్ద స్థల వివాదం

● స్థలానికి కంచె ఏర్పాటు చేస్తుండగా అడ్డుకొన్న కాలనీ వాసులు


వివాదాస్పద స్థలంలోని ఎక్స్‌కవేటర్

బల్లికురవ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నుపల్లి ఎస్సీ కాలనీ వద్ద మంగళవారం ఒక స్థల వివాదంతో కొంత సేపు ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. ఎస్సీకాలనీకి సమీపంలో ఉన్న సుమారు 40 సెంట్ల స్థలంలో శ్మశాన వాటిక, సమాధులున్నాయి. ఈ స్థలం తమదంటూ కొందరు సర్వేయర్ ద్వారా సర్వే చేయించి కంచె ఏర్పాటు పనులు చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్సీ కాలనీలోని కొందరు ఈ స్థలం గ్రామకంఠంలో ఉందని కంచె వేస్తే ఊరుకోమని అడ్డుకున్నారు. దీంతో కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. వెంటనే పోలీసులు రంగప్రవేశం చేశారు. రికార్డు ప్రకారం ఎవరైన నడుచుకోవాల్సిందే అన్నారు. ఘర్షణకు దిగితే చర్యలు తప్పవని వారు హెచ్చరించారు. రెవెన్యూ అధికారులు వెంటనే స్థల వివాదాన్ని పరిష్కరించాలని ఎస్సీ కాలనీ వాసులు కోరుతున్నారు.

పశువైద్యశాల రికార్డుల పరిశీలన


పశువైద్యశాలలో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా పశువైద్యాధికారి వేణుగోపాల్

వేందరవెంట్ల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొరిశపాడు, పమిడిపాడు పశువైద్యశాలలను జిల్లా పశువైద్యశాఖ అధికారి డాక్టర్ వేణుగోపాల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మంగళవారం తొలుత పమిడిపాడు వచ్చిన వేణుగోపాల్ శిథిలావస్థలోని పశువైద్యశాల సబ్ సెంటర్‌ను పరిశీలించారు. నూతన భవన నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేస్తామన్నారు. రైతులకు, పశువుల కాపరులకు సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. కొరిశపాడు పశువైద్యాశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పశువైద్యశాఖ ద్వారా అందించే పథకాలను రైతులకు వివరించాలని తెలిపారు. కార్యక్రమంలో కొరిశపాడు, పమిడిపాడు పశువైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీడీపీవోగా ఎలిజిబెత్ రాణి



మేదరమెట్ల, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): కొరిశపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో గాయం ఎలిజిబెత్‌రాణి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో కొరిశపాడు సీడీపీవోగా పనిచేసిన కృష్ణకుమారి ఆగస్టు 31న ఉద్యోగ విరమణ చేశారు. ఆమె స్థానంలో జిల్లా నుంచి ఎలిజిబెత్ రాణిని ఇక్కడికి బదిలీ చేశారు.

11న మేదరమెట్లలో ఉరుసు

మేదరమెట్ల, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మేదరమెట్లలోని హజరత్ సయ్యద్ కరిముల్లా షాఖాద్రీ ఉరుసు మహోత్సవం గురువారం రాత్రి నిర్వహించనున్నారు. 42వ ఉరుసు గంధ మహోత్సవం రాత్రి 9.45 గంటలకు సిపాయి మస్తాన్‌బాబా ఇంటి వద్ద నుంచి ఊ రేగింపుగా బయలు దేరుతుందన్నారు. రాత్రికి దర్గ వద్ద భక్తులకు అన్నదానం చేయనున్నట్లు తెలిపారు.

కొరమీను చేపల పెంపకానికి దరఖాస్తు చేసుకోవాలి

చినగంజాం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలో ఆసక్తి ఉన్న వారు కొరమీను చేపల పెంపకానికి దరాఖాస్తు చేసుకోవాలని వెలుగు డీపీఎం రవీంద్ర, ఏపీఎం గద్దె పెదసుబ్బారావులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీఆర్‌డీఏ వెలుగు ఆధ్వర్యంలో ఆక్వా వ్యవస్థ పథకంలో కొరమీను చేపల పెంపకానికి నిధులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఈ పథకంలో కొరమీను చేపల పెంపకానికి రూ.4,50,000లు మంజూరు చేస్తారన్నారు. దీనిలో 35 శాతం బ్యాంకు ద్వారా సబ్సిడీ, 10 శాతం లబ్ధిదారుని వాటా ఉంటుందన్నారు. పథకానికి అర్హత పొందాలంటే రిజిస్టర్ భూమి కలిగి ఉండాలని, త్రీఫేస్ విద్యుత్ ఉండాలని, డ్వాక్రా గ్రూపులో సభ్యులై ఉండాలన్నారు. ఉపాధిహామీ పథకం కింద వ్యవసాయ చెరువులు పొందిన వారికి ప్రాముఖ్యత ఇస్తారన్నారు. ఆసక్తి కలిగిన వారందరూ చినగంజాం వెలుగు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

దాతల సాయం మరువలేనిది


రాత పుస్తకాలు అందజేస్తున్న దాత వెంకటేశ్వర్లు

చినగంజాం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు దాతలు అందిస్తున్న సాయం మరువలేనిదని పాఠశాల హెచ్‌ఎం కే.సృజన అన్నారు. మండలంలోని కడవకుదురు ఎస్టీ కాలనీలోని మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు దాత అందజేసిన రాత పుస్త కాలను మంగళవారం పంపిణీ చేశారు. దాతలు అందిస్తున్న సహాయ సహకారాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పర్చూరు మండలం నూతలపాడు గ్రామానికి చెందిన చిమట వెంకటేశ్వర్లు తన సొంత నిధులతో పాఠశాలలోని 1వ తరగతి నుండి 5వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఒక్కొక్కరికి రెండు రాతపుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పొట్టి మురళిమోహన్, ప్రవీణ్‌కుమార్, శేఖర్‌బాబు, ఉమాదేవిలు పాల్గొన్నారు.

చేనేతల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలి


ఏడీకి వినతిపత్రం అందిస్తున్న ప్రతినిధులు

చీరాల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం చేనేతల సమస్యలపై దృష్టి సారించాలని చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సత్యన్నారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం చీరాల ఏడీ రఘునందన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఉప ఉత్పత్తులపై జీఎస్టీ ఎత్తి వేయాలని కోరారు. షెడ్డు కార్మికుల భవిష్యత్తుపై పారదర్శకంగా వ్యవహరించాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గద్దెబాబు, కమిటీ సభ్యులు ఎర్రం రాధా, సమన్వయ కమిటీ కార్యదర్శి కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

యూరియా అధిక వినియోగం వద్దు

వ్యవసాయశాఖ ఏడీఏ ఎప్రాయిమ్



మాట్లాడుతున్న ఏడీఏ ఎప్రాయిమ్, కోటపాడులో రైతులకు సూచనలిస్తున్న ఏవో

అద్దంకిటౌన్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): యూరియా అధిక వినియోగం అనర్థదాయకమని ఏడీఏ బి.ఎప్రాయిమ్ అన్నారు. మంగళవారం మండలంలోని బొమ్మనంపాడు, జార్లపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల రైతులతో ఏడీఏ మాట్లాడారు. యూరియా విచ్చలవిడిగా వినియోగిస్తే, పంటలు పురుగు, తెగుళ్ల బారిన పడతాయన్నారు. ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ మాట్లాడుతు ప్రతి రైతు నానో యూరియా వినియోగించాలన్నారు. నానో యూరియా 500 ఎంఎల్ బాటిల్ ధర రూ.225 ఉంటుందన్నారు. ఇది ఒక బస్తా యూరియాతో సమానమన్నారు. మండలంలో యూరియా 50 టన్నులు అందుబాటులో ఉందన్నారు. మరో రెండు రోజుల్లో 100 మెట్రిక్ టన్నులు యూరియా మండలానికి వస్తోందన్నారు. కార్యక్రమంలో ఏఈవో కోటేశ్వరరావు, ఆత్మ మేనేజర్ శేషారావు, వీఏఏలు సుభాని, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర ఎరువుల యాజమాన్యాన్ని పాటించండి

పంగులూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): రైతులు పంటసాగులో సమగ్ర ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించడం లాభదాయకమని ఏవో డి.సుబ్బారెడ్డి సూచించారు. మండలంలోని కోటపాడు, కొండమంజులూరు గ్రామాలలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ప్రతి రైతు తాముసాగు చేసిన పంట వివరాలను విధిగా ఈక్రాప్‌లో నమోదు చేసుకోవాలన్నారు. కౌలురైతులు గుర్తింపు కార్డులు కలిగి ఉంటేనే ప్రభుత్వ ప్రయోజనాలు పొందగలుగుతారన్నారు. సేంద్రీయ ఎరువుల వినియోగంతో తక్కువఖర్చుతో అధికదిగుబడులు సాధించవచ్చన్నారు. దీర్ఘకాలంలో భూసారాన్ని కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కోటపాడు పీఏసీఎస్ అధ్యక్షుడు రావుల సింగరకొండ, గడ్డం నాగేశ్వరరావు, వ్యవసాయ సహాయకులు పవిత్ర, రోజి, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఇంకొల్లు, సెప్టెంబరు 9, (ఆంధ్రజ్యోతి) : రైతులకు కావలసినంత యూరియా పంపిణీకి సిద్ధంగా ఉందని ఏ రైతు యూరియా కోసం ఆందోళన చెందనవసరం లేదని పర్చూరు ఏడీఏ ప్రవీణ అన్నారు. మండలంలోని పావులూరు, నక్కలపాలెంలో రైతులకు పంటలసాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది పొగాకు సాగుకు దూరంగా ఉండాలన్నారు. ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు. పత్తిలో వచ్చే గులాబీరంగు పురుగు నివారణ చర్యలు వివరించారు. కార్యక్రమంలో ఏవో మేరమ్మ రైతులు పాల్గొన్నారు.

వసతులు కరువు

● ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
● వార్డెన్లు హాస్టల్‌కు ఎప్పుడు వస్తారో తెలియదు
● పిల్లల ఆలనాపాలనా చూసేది వంట పనివారే


వందమందికి పైగా విద్యార్థులకు ఇరుకు మరుగుదొడ్లే

కంభం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కంభం మండలంలో ఉన్న పలు వసతి గృహాలలో (హాస్టల్స్) వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కంభంలో ఎస్సీ, బీసీ, వసతి గృహాలు మొత్తం 7 ఉండగా, అందులో కంభం, రావిపాడు రోడ్డులో ఉండే ఎస్సీ బాలుర వసతి గృహం-1, రంగరాజు పాఠశాల సమీపంలో బాలికల బీసీ హాస్టల్ మాత్రమే ప్రభుత్వ భవనాలు కాగా, మిగిలిన 5 వసతిగృహాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. ముఖ్యంగా రైల్వేస్టేషన్ సమీపంలో ఒక్కొక్క గదిలో 10 మంది విద్యార్థులు ఉంటున్నారు. ఈ హాస్టల్‌లో మొత్తం 100 మందికిపైగా విద్యార్థులుండగా, వారందరికీ కేవలం నాలుగు టాయిలెట్స్ మాత్రమే ఉన్నాయి. ఇక 30మందికిపైగా హాలు లాంటి ఒక రేకుల షెడ్డు ఉంది. చిన్నపాటి వర్షం కురిసినా షెడ్ మొత్తం కారుతుంది. విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.

అందుబాటులో లేని వార్డెన్లు

పలు వసతి గృహ వార్డెన్లు తాము పని చేసే హాస్టల్‌కు ఎప్పుడు వస్తారు, ఎప్పుడు వెళ్తారో తెలియని పరిస్థితి. మంగళవారం ఆయా హాస్టల్స్‌ను పరిశీలించగా ఎస్సీ బాలుర హాస్టల్-2లో ఉదయం 7గంటల సమయంలో వార్డెన్ లేరు. విద్యార్థులను వంట చేసేవారే చదివిస్తున్నారు. వార్డెన్ ఎక్కడా అని ప్రశ్నించగా ఆయన కాలేజీ బీసీ బాయ్స్ హాస్టల్‌కు ఇన్‌చార్జి అని అక్కడ ఉన్నారన్న సమాధానం వచ్చింది. అక్కడికి వెళ్లగా ఇప్పుడే ఎస్సీ బాయ్స్ హాస్టల్‌కు వెళ్లారని చెప్పారు. దీంతో ఆ వార్డెన్ ఎప్పుడు ఎక్కడ ఉంటారో తెలియని పరిస్థితి. ఇక బీసీ బాయ్స్ హాస్టల్ వార్డెన్‌కు అర్థవీడు బీసీ బాయ్స్ హాస్టల్ ఇన్‌చార్జి కావడంతో ఆయన కూడా ఎప్పుడు ఎక్కడ ఉంటారో తెలియదు. దీంతో పిల్లల ఆలనాపాలనను వంట వారే చూస్తున్నారు. ఇలా వార్డెన్లు ఏ హాస్టల్‌లోనూ విద్యార్థులను సరిగ్గా చూడడం లేదన్న విమర్శ ఉంది. అసలు వార్డెన్లు ఎక్కడ ఉంటారో తెలుసుకుందామని ఫోన్ చేస్తే ఫోన్ లిఫ్ట్ చేయకపోవడం లేదా ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు హాస్టల్స్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

విలీన శాపం వైసీపీదే

● ఆ ప్రక్రియతో పంచాయతీ కూలీలకు ఉపాధి కరువు ● ఎమ్మెల్యే కందుల


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

పొదిలి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ పాలకులు తమ స్వార్థ రాజకీయాల కోసం గ్రామ పంచాయతీలను నగర పంచాయతీలో విలీనం చేశారని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం మాదిరెడ్డిపాలెం, నందిపాలెం, కంభాలపాడు గ్రామాల్లో ఎంపీడీవో గుత్తా శోభన్ బాబు అధ్యక్షతన జరిగిన ఉపాధి హామీ కూలీలకు జరిగిన అవగాహన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. మాదాలవారిపాపాలెం, నందిపాలెం, కంభాలపాడు గ్రామ పంచాయతీలను పొదిలి నగరపంచాయతీలో విలీనం చేయడంతో నిరుపేద కూలీలకు శాపంగా మారిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఐదేళ్లుగా ఆయా గ్రామాలకు చెందిన కూలీలు ఉపాధి పనులు లేక జీవనోపాధిని కోల్పోయారన్నారు. ఫలితంగా ఆయా గ్రామాల్లో అభివృద్ధి కూడా కుంటుపడిందన్నారు. ఎంతో మంది పనుల కోసం ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లిపోయారని కందుల పేర్కొన్నారు. విలీనంతో గ్రామాలపై పన్నుల భారాలు పడడంతో దానిని వ్యతిరేకిస్తూ కోర్టుకు వెళ్లారన్నారు. ఈ క్రమంలో ఎన్నికల ప్రక్రియ కూడా నిలిచిపోయిందన్నారు. గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి కూలీలకు ఉపాధి కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ప్రజాభీష్టం మేరకు విలీనమైన గ్రామ పంచాయతీలను యథావిధిగా కొనసాగించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే కందుల హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీవో మహాలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ ఇమాంసాహెబ్, మాదిరెడ్డిపాలెం సొసైటీ అధ్యక్షుడు యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి ఆవులూరి యలమంద, మాజీ మండలాధ్యక్షుడు మీగడ ఓబులరెడ్డి, జిల్లా ముస్లిం మైనారిటీ నాయకులు రసూల్, టీడీపీ నాయకులు దోర్నాల అంజిరెడ్డి, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు గౌస్‌బాషా, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

విద్యావకాశాలను బాలలు సమర్థంగా వినియోగించుకోవాలి


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సీఐ నాగరాజు

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : అందుబాటులో ఉన్న విద్యావకాశాలను వినియోగించుకుని మరింత ఉన్నతంగా ఎదగాలని ఒంగోలు వన్‌టౌన్ సీఐ నాగరాజు చెప్పారు. గురుపూజోత్సవం సందర్భంగా స్థానిక 30 డివిజన్ టీడీపీ అధ్యక్షుడు నత్తల కనకారావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత ట్యూషన్ కేంద్రంలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీల్లోని విజేతలకు సీఐ నాగరాజు బహుమతి ప్రదానం చేశారు. సీఐ మాట్లాడుతూ కనకారావు తన సొంత నిధులతో ఉచితంగా ట్యూషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. నిర్వాహకులు కనకారావు మాట్లాడుతూ 1 నుంచి 7వ తరగతి వరకు చదువుకునే విద్యార్థులకు గద్దలగుంటలోని మూడు బొమ్మల కూడలి వద్ద ఉచిత ట్యూషన్ ఏర్పాటు చేశానన్నారు. కార్యక్రమంలో నగర అభివృద్ధి అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు, దాయనేని ధర్మ, నత్తల శ్రీనివాసరావు, అంకబాబు పలువురు పాల్గొన్నారు.

పండగే పండగ

(5వ పేజీ తరువాయి)

గృహావసరాలకు కావాల్సిన ఎలక్ట్రానిక్ పరికరాలు, వాహనాలు కొనడం తెలుగు ప్రజల ఆనవాయితీ. ఈ పండగ సమయం లోనే టీవీలు, వాషింగ్‌మిషన్లు, రిఫ్రిజిరేటర్లు, మిక్సర్, గ్రైండర్లు, ఏసీలు, ఓవెన్లు తదితర ఎలక్ట్రానిక్ వస్తువులతో పాటు బైక్‌లు, కార్లు కొనుగోలు చేస్తుంటారు. ప్రత్యేకించి దసరా సందర్భంగా పలువురు వాహనాలు కొనుగోలు చేస్తుంటారు. పాత వస్తువులు, వాహనాలను కొత్త వస్తువులు, వాహనాలతో రీప్లేస్ చేసేం దుకు ఆసక్తి చూపుతారు. సరిగ్గా అలాంటి సమయంలో కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ కారణంగా ఒక్కో వస్తువుపై రూ.2 నుంచి 15 వేల వరకూ ధర తగ్గే అవకాశం కనిపిస్తోంది.

● **భారీగా తగ్గనున్న ధరలు..**

కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కారణంగా ఎలక్ట్రానిక్ వస్తువులు, వాహనాల ధరలు బాగా తగ్గనున్నాయి. ప్రస్తుతం ద్విచక్ర వాహనాలపై 10 శాతం వరకూ జీఎస్టీ తగ్గింది. దీంతో ఒక్కో వాహనంపై 10 నుంచి 15 వేల వరకూ ఊరట లభించినట్లే చెప్పాలి. కార్లకైతే ఈ తగ్గింపు 50 నుంచి 75వేల వరకూ తగ్గనున్నాయి. ప్రస్తుతం 28 శాతం జీఎస్టీ శ్లాబులో ఉన్న టీవీలు, వాషింగ్ మిషన్లు, ఫ్రిజ్‌లు, సెల్‌ఫోన్లను 18 శాతం శ్లాబుకు తగ్గించడంతో వాటి ధరలు రూ.2 నుంచి 10 వేల వరకూ తగ్గుదల కనిపించే అవకాశం ఉంది. సరిగ్గా ఈ అవకాశాన్నే వాణిజ్య సంస్థలు సొమ్ము చేసుకోవడానికి భారీ రాయితీలను ప్రకటిస్తున్నాయి.

● **భారీ ఆఫర్లు.. డిస్కౌంట్లు**

దసరా, దీపావళి అమ్మకాలే అన్ని వాణిజ్య సంస్థలకు కీలకం. ఈ ఒక్క పండుగ సందర్భంగానే ఉమ్మడి గుంటూరు జిల్లాలో 125 నుంచి 150 కోట్ల రూపాయల మేర అమ్మకాలు జరుగుతాయని అంచనా. కరోనా తర్వాత అమ్మకాలపై ఒకింత ప్రతికూల ప్రభావం పడింది. అయినా పండుగ అమ్మకాల విషయంలో ఆ ప్రభావం పెద్దగా కనిపించలేదనే చెప్పాలి. అందుకు కారణం పండుగ సమయంలో వినియోగదారుడిని ఆకర్షించేలా భారీ రాయితీలు ప్రకటించడమే. ఈసారి కూడా వాణిజ్య సంస్థలు పండగల సందర్భంగా భారీ ఆఫర్లు ప్రకటిస్తున్నాయి. ఇప్పటికే ఈ-కామర్స్ దిగ్గజాలు సేల్స్ తేదీలను కూడా ప్రకటించారు. తొలుత ఈ నెల 15 నుంచి ఆఫర్ సేల్స్ ప్రారంభించాలనుకున్న సంస్థలు, కొత్త జీఎస్టీ అమలు కోసం ఈ నెల 23 వరకూ వాయిదా వేశాయి. మిగిలిన ఆఫ్‌లైన్ వాణిజ్య సంస్థలు కూడా అదేబాట పట్టాయి. ఒక్కో సంస్థ 5 నుంచి 40 శాతం వరకూ రాయితీలు ఇవ్వడమే కాకుండా, కార్డు డిస్కౌంట్లు, ఫ్రీగిఫ్టుల పేరుతో వినియోగదారు లను ఆకర్షిస్తున్నాయి. ఒక్కో సంస్థ క్రెడిట్ కార్డుపై 5 నుంచి 15 వేల రూపాయల వరకూ ఇన్‌స్టెంట్ డిస్కౌంట్‌తోపాటు, క్యాష్‌బ్యాక్ ఆఫర్లను కూడా ఇస్తున్నాయి. ఇటు జీఎస్టీ తగ్గుదల, వాటికి తోడుగా భారీ ఆఫర్లు, డిస్కౌంట్లు మధ్య తరగతి వర్గాన్నే కాకుండా, సామాన్య ప్రజానీకాన్ని కూడా ఆకర్షిస్తున్నాయి. దీంతో వారంతా ఈనెలాకరు, వచ్చే నెలలో జరిగే పండుగ అమ్మకాల్లో తమకు కావాల్సిన వస్తువుల కొనుగోలు కోసం ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. జీఎస్టీ తగ్గుదల కారణంగా ఈసారి అమ్మకాల్లో కనీసం 20 నుంచి 30 శాతం పెరుగుదల ఉంటుందని చెబుతున్నారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

అద్దంకి, సెప్టెంబరు9 (ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణం నుంచి బెల్ట్‌షాపునకు మద్యం తీసుకు వెళుతున్న వ్యక్తిని స్పెషల్ టాస్క్‌ఫోర్స్ అధికారులు అరెస్టు చేశారు. ఆయన వద్ద నుంచి 50 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అందిన సమాచారం మేరకు అద్దంకి పట్టణంలోని ఓ మద్యం దుకాణం నుంచి నామ్ రోడ్డులో మోటార్‌సైకిల్‌పై 50 మద్యం సీసాలను ఓ వ్యక్తి తీసుకువెళుతున్నాడు. పాత పెట్రోల్‌బంకు సమీపంలో మంగళవారం రాత్రి స్పెషల్ టాస్క్‌ఫోర్సు అధికారులు సీసాలు, మోటారు సైకిల్ స్వాధీనం చేసుకున్నారు. ఆయన్ను అద్దంకి ఎక్సైజ్ పోలీసుస్టేషన్‌లో అప్పగించారు.

అంగన్వాడీ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

● సమస్యల పరిష్కారానికి డిమాండ్



మాట్లాడుతున్న అంగన్వాడీ ప్రతినిధులు

చీరాల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ జిల్లా యూనియన్ మహాసభలు ఈ నెల 13 నుంచి జరుగుతాయని ప్రతినిధులు తెలిపారు. మంగళవారం సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. అంగన్వాడీలు కనీస వేతనాలకు అవస్థలు పడుతున్నట్లు చెప్పారు. ప్రయోజనకరంగా లేని సెల్‌ఫోన్‌లతో సమస్యలు పడుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రేఖ ఎలిజబెత్, ప్రాజెక్టు చీరాల అధ్యక్షులు ప్రమీల, కార్యదర్శి బ్యూలా, సహాయ కార్యదర్శి సజీవన, సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి జీపీగా శివరామకృష్ణ



ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కోర్టు ఇన్‌చార్జి గవర్నమెంట్ ప్లీడర్ (జీపీ)గా బి.వెంకట శివరామకృష్ణను నియమిస్తూ జిల్లా రెవెన్యూ అధికారి బి చిన ఓబులేషు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం శివరామకృష్ణ ఒంగోలు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా పనిచేస్తున్నారు. తదుపరి ఉత్తర్వులు వచ్చేంతవరకు ఆయన జీపీగా బాధ్యతలు చేపట్టనున్నారు.

తస్మాత్.. జాగ్రత్త!

● మధ్యాహ్న భోజన బియ్యంపై అప్రమత్తం
● లెక్కల్లో తేడాలు వస్తే కఠిన చర్యలు
● హెచ్‌ఎంలను హెచ్చరిస్తూ డైరెక్టర్ ఉత్తర్వులు

ఒంగోలు విద్య, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకం బియ్యం విషయంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అప్రమత్తంగా వ్యవహరించాలి. స్టాకు, లెక్కల్లో తేడాలు వస్తే కఠిన చర్యలు తప్పవని ప్రభుత్వం హెచ్చరించింది. ఈ మేరకు మధ్యాహ్న భోజన పథకం డైరెక్టర్ బి.శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీచేశారు. పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు ప్రభుత్వం కిలో రూ.48 విలువైన మంచి బియ్యాన్ని పాఠశాలలకు సరఫరా చేస్తోంది. ఈ విషయంలో ప్రభుత్వ చిత్తశుద్ధిని పరిగణనలోకి తీసుకొని హెచ్‌ఎంలు బాధ్యతగా వ్యవహరిస్తూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాల్సి ఉంది. పాఠశాలల్లో బియ్యం పాత స్టాకు లేకుండా హెచ్‌ఎంలు వెంటనే చర్యలు తీసుకోవాలి. పాఠశాలల్లో విద్యార్థుల నమోదు, మధ్యాహ్న భోజనం తింటున్న వారి సంఖ్య ప్రామాణికంగా బియ్యం సరఫరా చేస్తారు. నెల చివరలో బియ్యం నిల్వలు, ఎంతమంది విద్యార్థులు భోజనం చేస్తున్నారన్న దానిని పరిగణనలోకి తీసుకొని వచ్చేనెలకు బియ్యం ఇండెంట్ పెట్టాలి. ఆ మేరకు బియ్యం నిల్వలకు సంబంధించి స్టాక్ రిజిస్టర్ నిర్వహించాలని డైరెక్టర్ ఆదేశించారు. పాఠశాలల్లో వచ్చేనెలకు ఎంతమందికి బియ్యం అవసరమో ఈనెల 9 నుంచి 12 వరకు ఇండెంట్ పెట్టాలని తెలిపారు.

నేడు జిల్లాకు రానున్న కేంద్ర బృందం

● మూడురోజుల పాటు పీహెచ్‌సీల పరిశీలన

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కేంద్ర బృందం మంగళవారం పర్యటించనుంది. వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లను పరిశీలించారు. ఆ వైద్యశాలల్లో అందుతున్న సేవలతో పాటు మౌలిక సదుపాయాలు, రికార్డులను పరిశీలించనున్నారు. కేంద్ర బృంద ప్రతినిధి డాక్టర్ వర్ష నేతృత్వంలో ఈ బృందం పరిశీలించనుంది. ముందుగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో అందుకు సంబంధించి ఆ శాఖ అధికారులతో సమీక్షించనున్నారు. వైద్యశాఖ అధికారులు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా జిల్లాలో జరుగుతున్న కార్యక్రమాలను కేంద్ర బృందసభ్యులకు వివరించనున్నారు.

అద్దె ఇంటి పేరుతో దివ్యాంగురాలిపై దాడి.. దోపిడీ

● ఏడున్నర సవర్ల బంగారు ఆభరణాలు అపహరణ

ఒంగోలుక్రైం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): అద్దెకు ఉండబోయే ఇంటిని చూసే పేరుతో ఓ యువతి దోపిడీకి పాల్పడింది. ఈ సంఘటన ఒంగోలు నగరంలో చోటుచేసుకుంది. వివరాల్లోకెళ్తే... నగరంలోని సుజాతనగర్ 3వ లైన్‌లో రిటైర్డ్ ఇరిగేషన్ సూపరింటెండెంట్ దివ్యాంగురాలైన నూనె పుష్పావతి నివాసం ఉంటోంది. ఆమె నివాసం ఉండే ఇంటి పైఅంతస్తు ఖాళీగా ఉండడంతో ఇల్లు అద్దెకు ఇవ్వబడును అని టూలెట్ బోర్డు పెట్టింది. మంగళవారం సాయంత్రం 30 ఏళ్ల వయస్సు కలిగిన ఓ యువతి అద్దెకు ఇల్లు కావాలని వచ్చి అడిగింది. దీంతో ఆ వృద్ధురాలు పైకి తీసుకెళ్లి ఇంటిని చూపించింది. అయితే ఇంటిని వీడియో తీసుకుంటానంటూ వృద్ధురాలిపై దాడి చేసి బంగారం ఆభరణాలను అపహరించు కెళ్ళింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలాన్ని తాలుకా సీఐ విజయకృష్ణ పరిశీలించి కేసు నమోదు చేశారు.

విద్యుత్ విజిలెన్స్ తనిఖీలు

● 73 కేసులు నమోదు రూ.4.21 లక్షల అపరాధం విధింపు

ఒంగోలు క్రైం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి) : విద్యుత్తు అక్రమ వినియోగంపై ఆ శాఖ విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేసి 73 కేసులు నమోదు చేసినట్లు ఈఈ మాకినేని హరిబాబు చెప్పారు. మంగళవారం ఒంగోలు నగరంలోని ఉడ్‌కాంప్లెక్స్, శ్రీనగర్ కాలనీ, శ్రీరామ కాలనీ, కర్నూల్‌రోడ్, ఎన్‌జీవో కాలనీ, సమతానగర్, తదితర ప్రాంతాలలో విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు 72 బృందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహించామన్నారు. అక్రమ విద్యుత్ వాడకందారులను గుర్తించి మొత్తం 4లక్షల 21 వేల రూపాయల అపరాధ రుసుం విధించినట్లు చెప్పారు. విద్యుత్తు చౌర్యంపై 9440812358, 9440812359 నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ ఈఈ టి.హైమావతి, విజిలెన్స్ ఇన్ స్పెక్టర్ బీటీ నాయక్, ఎస్పై ఎడ్వర్డ్, డీఈలు కేవీపీ రంగారావు, టి.శ్రీకాంత్, ఆర్.మోహన్‌రావు, కె.వెంకటేశ్వర్లు, ఏఈలు ఎస్ శివప్రసాద్, కే కోటయ్య పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

పతోలజీలో స్టేట్ టాపర్‌గా దీప్తి

ఎన్టీఆర్ యూనివర్సిటీ స్నాతకోత్సవాలలో బంగారుపతకం బహూకరణ



బంగారు పతకంతో దీప్తి

బల్లికురవ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమ్మినేని వారి పాలెం గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు చింతల సుబ్బయ్య కుమార్తె చింతల దీప్తి పతోలజీ విభాగంలో బంగారు పతకం అందుకున్నారు. ఎంబీబీఎస్ ఎన్‌ఆర్‌ఐ కళాశాలలో చదివిన దీప్తి పతోలాజీ సబ్జెక్టులో స్టేట్ టాపర్‌గా నిలిచారు. మంగళవారం విజయవాడలో జరిగిన ఎన్టీఆర్ యూనివర్శిటీ 27వ స్నాతకోత్సవంలో భాగంగా యూనివర్శిటి వైస్ చాన్సలర్ డాక్టర్ చంద్రశేఖర్ చేతుల మీదుగా బంగారు పతకాన్ని అందుకున్నారు. తండ్రి సలహా మేరకు చదువులో ముందుకు వెళ్లి ఎంబీబీఎస్ చదువును పూర్తి చేసుకొని మెత్తం 10 సబ్జెక్టులలో ప్రతిభను కనబరిచారు. ఇందుకు గాను విజయవాడ ఎన్టీఆర్ యూనివర్శిటీ బంగారు పతకాన్ని అందజేసి డాక్టర్ దీప్తిని ఘనంగా సత్కరించింది. ఈసందర్భంగా డాక్టర్ దీప్తిని పలువురు అభినందించారు.

టీడీపీ మండల అధ్యక్షుడిగా రమేష్


రావూరి రమేష్

పంగులూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల అధ్యక్షుడిగా రావూరి రమేష్ ఎన్నికయ్యారు. జె.పంగులూరు మండల టీడీపీ నూతన కార్యవర్గ ఎన్నిక ముప్పవరంలోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టీడీపీ మండల అధ్యక్షుడిగా రావూరి రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శిగా అత్తింటి రవి, ఉపాధ్యక్షులుగా ఇరిగల అచ్చిరెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శులుగా బాచిన సురేష్, రావిపాటి సుజాత, తన్నీరు శ్రీనివాసరావు, కార్యదర్శులుగా తోకచిచ్చు అచ్చిరాజు, కొత్తపల్లి సుజాత, వలేరు మేరమ్మ, కోశాధికారిగా రాగినబోయిన హరి కృష్ణలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తమ ఎన్నికకు సహకరించిన మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు వారు ధన్యవాదాలు తెలిపారు.

నవరాత్రుల ప్రారంభం నుంచే సెలవులు ఇవ్వాలి

- ఏపీటీఎఫ్ రాష్ట్రకౌన్సిలర్ జేవీఆర్ విజ్ఞప్తి

పంగులూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి) : దేవీ నవరాత్రులు ఈనెల 22న ప్రారంభం అవుతున్నందున పాఠశాలలకు ఆ రోజు నుంచి దసరా సెలవులు ఇవ్వాలని, ఏపీటీఎఫ్ రాష్ట్రకౌన్సిలర్ జంపని వెంకటేశ్వరరావు(జేవీఆర్) కోరారు. పాఠశాల అకడమిక్ క్యాలెండర్‌లో భాగంగా ప్రతి సంవత్సరం దసరా సెలవులు మహాలయ అమావాస్య ప్రారంభతేదీని ప్రామాణికంగా తీసుకుంటున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ విద్యాసంవత్సరంలో కూడా దాన్నే ప్రామాణికంగా తీసుకుంటూ ఈ నెల 22 నుంచే దసరా సెలవులు ఇవ్వాలని కోరారు. దేవీనవరాత్రులు ప్రారంభమైన రెండురోజుల తర్వాత తర్వాత దసరా సెలవులు ఇవ్వడం సరికాదన్నారు.

ఎంపీడీవో సింగయ్యకు ఉద్యోగోన్నతి


సింగయ్యను సత్కరిస్తున్న సర్పంచులు

అద్దంకిటౌన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అద్దంకి ఎంపీడీవోగా పని చేస్తున్న బత్తిన సింగయ్య డ్వామా ఏపీడీగా ఉద్యోగోన్నతిపై బదిలీపై వెళ్లనున్నారు. ఈ సందర్భంగా మంగళవారం పలు గ్రామాల సర్పంచులు, టీడీపీ నాయకులు ఎంపిడీవోను తన కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో కుంకుపాడు సర్పంచ్ గాలం శ్రీను, నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షుడు కరిముల్లా, బ్రహ్మానందం, జ్యోతి రామారావు తదితరులు ఉన్నారు.

పాఠశాలను సందర్శించిన ఎంఈవో

ఇంకొల్లు,సెప్టెంబరు 9,(ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు మండలంలోని నాగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఎంఈవోలు శ్రీనివాసరావు, సామ్రాజ్యం సందర్శించారు. విద్యార్థులకు బోధిస్తున్న విధివిధానాలను తెలుసు కున్నారు. పాఠశాలకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని రుచిచూసి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. విద్యార్థులకు మంచి నాణ్యమైన భోజనం అందించాలన్నారు. ఈ పాఠశాలలో పనిచేస్తూ ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయుడుగా ఎంపికైన కూసం రమేష్‌బాబును విద్యాశాఖాధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ తోటి ఉపాధ్యాయులు సన్మానించారు.

అక్రమ చెరువుల తొలగింపునకు చర్యలు

గుండ్లకమ్మ ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విజయజ్యోతికుమారి

అద్దంకి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గుండ్లకమ్మ రిజర్వాయర్ ప్రాంతంలో అనధికారికంగా ఉన్న చేపల చెరువులను తొలగించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు గుండ్లకమ్మ ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విజయజ్యోతికుమారి అన్నారు. గుండ్లకమ్మ రిజర్వాయర్ చెరువులో అనధికార చేపల చెరువులు, చేపల పెంపకానికి కోళ్ల వ్యర్థాలు వినియోగిస్తూ, రిజర్వాయర్ నీరు కలుషితం చేయడంపై 'ఆంధ్రజ్యోతి'లో కథనాలు ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మణికేశ్వరానికి చెందిన పలువురు రైతులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం మత్స్య శాఖ, గుండ్లకమ్మ ప్రాజెక్టు అధికారులు పరిశీలించారు. మణికేశ్వరం వద్ద అనధికారికంగా చేపల చెరువులు ఉన్నట్లు గుర్తించారు. అదే సమయంలో చేపల పెంపకానికి కోళ్ల వ్యర్థాలను వినియోగిస్తున్నట్లు నిర్ధారించారు, చేపల చెరువుల నుంచి కలుషితమైన నీరు గుండ్లకమ్మ రిజర్వాయర్‌లోకి వదులుతున్నట్లు నిర్ధారణకు వచ్చారు. ఇదేవిధంగా అద్దంకి, కొరిశపాడు మండలాల్లోని మరికొన్ని గ్రామాల వద్ద కూడా అనధికారికంగా చేపల చెరువులు ఉన్నట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ మత్స్యశాఖ గుండ్లకమ్మ ప్రాజెక్టు అధికారులతో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విజయజ్యోతి కుమారి సమీక్ష నిర్వహించారు. ప్రకాశం జిల్లా మత్స్య శాఖ జాయింట్ డెరెక్టర్ శ్రీనివాసరావు, చీరాల ఏడీ కృష్ణకిషోర్, గుండ్లకమ్మ ప్రాజెక్టు ఈఈలు శ్రీహరి, శ్రీనివాసరావు, తహసీల్దార్ శ్రీచరణ్, సిబ్బంది పాల్గొన్నారు.



చెరువులను పరిశీలిస్తున్న అధికారులు, సమీక్షిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విజయజ్యోతికుమారి

విద్యార్థి కోసం ఉపాధ్యాయుల సాయం

రూ.2లక్షల విరాళం అందజేత


నగదును అందజేస్తున్న ఎంఈవోలు శివకోటేశ్వరరావు, వెంకట్రామయ్య

పర్చూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థి దీనస్థితిని గురించి తెలుసుకున్న ఉపాధ్యాయులు స్పందించారు. వైద్యానికి రూ.2 లక్షలు సేకరించి వారి కుటుంబానికి అందజేసి బాసటగా నిలిచాడు. పర్చూరు మండలం చెన్నుంబొట్ల అగ్రహారం ఎంపీపీ పాఠశాలలో పేర్లి సాత్విక్ 5వ తరగతి చదువుతున్నాడు. ఆయనకు సెప్టెంబర్ 5న తీవ్రజ్వరం రావడంతో పరీక్షించిన వైద్యులు మెదడువాపు వ్యాధిగా నిర్ధారించారు. ఆ విద్యార్థి గుంటూరు లోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతుండగా, వైద్యానికి రూ.3 లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పారు. దీంతో ఆ నిరుపేద కుటుంబం తల్లడిల్లింది. ఆర్థిక స్తోమత లేక తమ కుమారుడిని ఎలా బతికించుకోవాలో తెలియక, దీనస్థితికి చేరుకుంది. ఈవిషయం తెలుసుకున్న పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు గనిపిశెట్టి గోవిందరావు స్పందించారు. విద్యార్థి పరిస్థితిని వాట్సప్ గ్రూపు ద్వారా పోస్టు చేసి తోటి ఉపాధ్యాయులతోపాటు, మరికొంత మంది దాతల నుండి రూ.2 లక్షల నగదును సేకరించారు. మంగళవారం ఎంఈవోలు శివకోటేశ్వరరావు, పి.వెంకట్రామయ్య చేతుల మీదుగా విద్యార్థి తల్లికి అందజేశారు. విషయం తెలుసుకున్న స్థానికులు ఉపాధ్యాయుని చొరవను కొనియాడారు.

వైసీపీ ఆధ్వర్యంలో 'అన్నదాత పోరు' గళం

మాజీ మంత్రి మేరుగ నాగార్జున ఆధ్వర్యంలో ర్యాలీ



నిరసన ర్యాలీ చేపడుతున్న మేరుగ నాగార్జున, నాయకులు

చీరాల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : చీరాల్లో వైసీపీ 'అన్నదాత పోరు' గళం వినిపించారు. ఆ పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు జిల్లా పార్టీ అధ్యక్షులు మేరుగు నాగార్జున, చీరాల నియోజవకర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్‌ల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ముందుగా ముక్కోణం పార్క్ కూడలిలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రాంల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్ల అర్పించారు. అనంతరం ర్యాలీగా ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ రాష్ట్రంలో యూరియా కొరతతో రైతులు అల్లాడుతున్నట్లు ఆరోపించారు. అధికార పార్టీ అండదండలతో ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు తరలుతున్నాయన్నారు. నష్టపోయిన రైతుల గోడు పట్టించుకోవాలని కోరారు. వారి వెంట చీరాల, పర్చూరు, అద్దంకి నియోజకవర్గాల వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.

30 పోలీస్ యాక్టుకు తూట్లు

పట్టణంలో మంగళవారం పోలీసులు 30 పోలీస్ యాక్టుకు తూట్లు పొడిచారు. వైసీపీ చేపట్టిన ర్యాలీ కారణంగా ఎటువంటి అల్లర్లు, శాంతిభద్రతలకు విఘాతం ఉండకూడదని 30 పోలీసు యాక్టును అమల్లోకి తెచ్చారు. తద్వారా భారీ ర్యాలీకు అనుమతి అసలు లేదు. ఆర్డీవోను కలిసి వినతిపత్రం అందించేందుకు 15 మందికి మాత్రమే అనుమతి కల్పించారు. అయితే వైసీపీ వ్యవహరించిన తీరు అందుకు పూర్తి భిన్నంగా ఉంది. ఒక దశలో రోపులను సైతం నెట్టుకుని ఆర్డీవో కార్యాలయానికి చేరుకున్నారు. అందులోనూ ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడుకు తెలుగు చదవడం రాదన్నట్లు మాజీ మంత్రి మేరుగ నాగార్జున వ్యవహరించడం ఎబ్బెటుగా మారింది. ఆర్డీవోను నిలబెట్టి వినతిపత్రాన్ని చదవడం చర్చనీయాంశమైంది. భారీగా పోలీసులు హాజరైనా, 30 యాక్టును అమలు చేయలేకపోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

స్త్రీశక్తి పథకంతో పెరిగిన మహిళా ప్రయాణికులు


డిపోలో వేచి ఉన్న ప్రయాణికులు


మాట్లాడుతున్న సామ్రాజ్యం

అద్దంకి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్త్రీశక్తి పథకం అమలుతో మహిళా ప్రయాణికులు సంఖ్య బాగా పెరిగిందని డీపీటీవో సామ్రాజ్యం అన్నారు. అద్దంకి డిపో, బస్టాండ్‌లను ఆమె మంగళవారం పరిశీలించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడారు. సాధారణ మహిళలతో పాటు విద్యార్థినులు, ఉద్యోగులు, కూలీపనులకు వెళ్లే మహిళలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ఉపయోగపడుతుందన్నారు. గతంలో మహిళా ప్రయాణికులు 40 శాతం ప్రయాణిస్తుండగా స్త్రీ శక్తి పథకం అమలు ద్వారా తరువాత 65 శాతానికి పెరిగిందన్నారు. జిల్లాలోని 4 డిపోలలో మొత్తం 254 బస్సులు ఉండగా 212 బస్సులలో మహిళలు స్త్రీ శక్తి పథకం ద్వారా ఉచితంగా ప్రయాణించవచ్చన్నారు. మహిళలు తప్పనిసరిగా తమ వెంట ఆధార్‌కార్డు లేదా ఏదైనా గుర్తింపు కార్డు తెచ్చుకోవాలన్నారు. డీఎం రామ్మోహనరావు, అసిస్టెంట్ డీఎం మహబూబి తదితరులు ఉన్నారు.

అద్దంకి : అనంతపురంలో జరిగే 'సూపర్‌సిక్స్-సూపర్‌హిట్' విజయోత్సవ సభకు అద్దంకి డిపో నుంచి మంగళవారం 20 బస్సులు వెళ్లాయి. దీంతో పలురూట్లలో బస్సులు రద్దయ్యాయి. దీంతో ప్రయాణికులు గంటలకొద్ది వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. అత్యధికశాతం గ్రామీణ రూట్ల బస్సులను రద్దు చేయడంతో ప్రయాణికులు ప్రవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వచ్చింది. అనంతపురం వెళ్లిన బస్సులు గురువారం సాయంత్రం తిరిగి వచ్చే అవకాశం ఉంది. దీంతో బుధ, గురు వారాలలో కూడా ప్రయాణికులకు అరకొర బస్సులే అందుబాటులో ఉంటాయి.

కోటేశ్వరరావు మృతి కేసులో కొత్త కోణం

- హత్యగా నిర్ధారించిన పోలీసులు
- నిందితుడిపై గతంలోనూ ఓ హత్యకేసు
- పోలీసుల అదుపులో అనుమానితుడు..!
- నేడో రేపో అధికారికంగా వెల్లడించే అవకాశం


కోటేశ్వరరావు (ఫైల్)

పేరాల(చీరాల), సెప్టెంబరు 9 (ఆంధ్ర జ్యోతి) : పేరాలకు చెందిన పేర్లి కోటేశ్వరరావు మృతిలో కొత్తకోణం వెలుగులోకి వచ్చింది. అతడిని ఉద్దేశ్యపూర్వకంగా హత్యచేశారన్న కుటుంబ సభ్యుల అనుమానం నిజమైంది..! చిల్లచెట్ల మధ్య విగతజీవిగా పడివున్న కోటే శ్వరరావు మృతిపై అనుమానస్పద కేసుగా నమోదు చేసిన పోలీసులు మొదట్లో తేలికగానే తీసుకున్నారు. అయితే తీగలాగే కొద్దీ డొంక కదలినట్లు గతంలో ఓ హత్య కేసులో ప్రధాన ముద్దాయిగా ఉన్న వ్యక్తే, కోటేశ్వరరావును హతమార్చినట్లు గుర్తించారు. ఇప్పటికే అతడిని అదుపులోనికి తీసుకున్నట్లు సమాచారం. అయితే హత్యకు పాల్పడినట్లు నిందితుడు ఒప్పుకున్నప్పటికీ, పొంతన లేని సమాదానాలు చెప్తుండడంతో లోతైన దర్యాప్తు చేపడుతున్నారు. నేడో రూపో అధికారికంగా వివరాలు వెల్లడించే అవకాశం ఉంది.

కేసు విచారణ ప్రారంభ సమయంలో పోలీసులు తడబడ్డారు. అయితే ఈ ఘటనపై స్థానికంగా పలు అనుమానాలు వ్యక్తం కావ డంతో వారుకూడా విచారణ ముమ్మరం చేశారు. ఆ సమయంలో అనుమానితుడి కద లికపై నిఘా ఉంచారు. నేరస్థుడు నేరానికి పాల్పడిన తర్వాత అనారోగ్యమంటూ ఒంగోలు రిమ్స్‌లో చేరి స్వల్ప చికిత్స పొందాడు. అయితే పోలీసులు తమదైన శైలిలో విచారించడంతో వాస్తవాలు ఒప్పుకున్నాడు. తన అంతరింగిక విషయాలు కోటేశ్వరరావు బయటకు చెప్తు న్నట్లు అపోహతోనే గొంతుకు గొలుసు బిగించి హతమార్చినట్లు సమాచారం. దీంతో కేసును ఛేధించడంలో పోలీసులు పురోగతి సాధించి నట్లయ్యింది.

జనసేన కార్యకర్త కుటుంబానికి బీమా చెక్కు అందజేత


బీమా చెక్కును అందజేస్తున్న నాయకులు

సంతమాగులూరు సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి) మండలంలోని పాతమాగులూరు గ్రామంలోని జనసేన క్రియాశీలక కార్యకర్త ఎం గోపి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. ఆయన జనసేన క్రియాశీలక సభ్యుడిగా ఉన్నారు. ఆయన కుటుంబానికి రూ.5 లక్షల ప్రమాదబీమా చెక్కును ఉమ్మడి ప్రకాశం జిల్లా నాయకుల సమక్షంలో వలంటీర్ అడపాల సాయి ద్వారా బాధితుల కుటుంబానికి చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా బాలినేని ప్రణీత్‌రెడ్డి, జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి రాయపాటి అరుణ, రాష్ట్ర మాల కార్పొరేషన్ ఛైర్మన్ పెదపూడి విజయ్‌కుమార్, జిల్లా నాయకులు మలగా రమేష్, కందుకూరి బాబు, బెల్లంకొండ సాయి బాబా మంగళగిరి సెంట్రల్ ఆఫీస్ ప్రతినిధులు, నియోజకవర్గ జనసైనికులు పాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్ విద్యార్థికి ప్రత్యేక అవార్డు

చీరాల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ఎంబీఏ విద్యార్థి షేక్ ఖాజావలి జేఎన్‌టీయూ కాకినాడ యూనివర్సిటీ నుంచి ప్రత్యేక అవార్డు అందుకున్నారు. ఇటీవల కాలంలో దేశ, విదేశాల్లో పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచాడు. ఆయనకు అవార్డు దక్కడంతో కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు, ప్రిన్సిపల్ డా.జగదీష్ ప్రత్యేకంగా అభినందించారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత



విద్యార్థులకు మెటీరియల్ అందజేస్తున్న హెచ్ఎం శ్రీనివాసరావు

అద్దంకిటౌన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చక్రాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు జీవశాస్త్రం స్టడీ మెటిరియల్‌ను జీవశాస్త్రం ఉపాధ్యాయురాలు వంకాయలపాటి ప్రమీలారాణి ఉచితంగా పంపిణీ చేశారు. ఆమెను హెచ్ఎం కేవీ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయునికి సత్కారం

చినగంజాం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాజుబంగారుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీషు ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న రావిపాటి శివవెంకటపోతురాజును సోపిరాల గ్రామపెద్దలు మంగళవారం రాత్రి ఘనంగా సన్మానించారు. గ్రామ పెద్దలు తుమ్మలపెంట సీతారామయ్య, టి.జయరావు, నరహరి శ్రీనివాసరావు, పల్లపోలు లక్ష్మీనారాయణ, సిద్ధం పాపారావు, సందు శ్రీనివాసరావు, గంటా వెంకటస్వామి, నరహరి సుబ్బారావు, శిఖరం రాంబాబు, ఉలిచి ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.





నిండుకుండలా సోమశిల

- ప్రాజెక్టులో 70 టీఎంసీలు దాటిన నీరు
- మరో 4 టీఎంసీల నిల్వకు చర్యలు
- అధికారుల అప్రమత్తం

అనంతసాగరం సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదతో ప్రాజెక్టు నీటిమట్టం మంగళవారం నాటికి 70 టీఎంసీలు దాటింది.దీంతో ఇరిగేషన్ అధికారులు అప్రమత్తమయ్యారు. పూర్తిసామర్థ్యం 77.988 కాగా ఈసారి 74 టీఎంసీలు నిల్వ చేసి అదనపు జలాలను దిగువకు విడుదల చేస్తామని అధికారులు చెబుతున్నారు. రోజువారీగా సరాసరి 2 టీఎంసీలు వస్తుండగా అతితక్కువ సమయంలో సోమశిల, కండలేరు జలాశయాలు పూర్తినిల్వకు చేరుకొన్నాయి. ప్రస్తుతం ఇన్‌ఫ్లో 19,510 క్యూసెక్కులు వస్తుండగా 70.230 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఉత్తర కాలువకు 400, కండలేరుకు 9,200, డెల్టాకు 1,850 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

- 11 నుంచి నీటి విడుదల?

సోమశిల పూర్తి సామర్థ్యం వైపు పరుగుతీస్తుండగా ఈ నెల 11 నుంచి దిగువ ప్రాంతానికి నీరు విడుదల చేసే సూచనలు ఉన్నాయి. ఈ మేరకు సోమశిల అధికారులు రెవెన్యూ, పోలీసు అధికారులను అప్రమత్తం చేస్తూ డీఈ రవీంద్రప్రసాద్ లేఖ విడుదల చేశారు. నీటి విడుదల సమయంలో ప్రజలు పెన్నా పరివాహక ప్రాంతాలకు వెళ్లవద్దని, పశువులను మేతకు తీసుకువెళ్లవద్దని తెలియజేశారు. స్థానిక యంత్రాంగం ప్రజలను అప్రమత్తం చేయాలని కోరారు.

నేటి నుంచి స్కూల్‌గేమ్స్ ఎంపికలు

నెల్లూరు(విద్య), సెప్టంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 2025-26 విద్యా సంవత్సరానికి నిర్వహించే అండర్-19 స్కూల్ గేమ్స్ ఎంపికలు బుధవారం నుంచి జరుగుతాయని, ఇందుకు అన్నీ ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీవీఈవో బీవీ కృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం నెల్లూరులోని కేఏసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పీడీల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్కూల్‌గేమ్స్ షెడ్యూల్‌ను ఇప్పటికే ప్రకటించిన నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లోని పీడీలు ఎంపికలను పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. ఎప్పటి కప్పుడు నివేదికలు అందచేయాలని కోరారు. బుధవారం ఏసీ సుబ్బా రెడ్డి స్టేడియంలో ఆర్చరీ, గట్కా క్రీడా ఎంపికలు, ఇందు కూరుపేట మండలం కొత్తూరులో సెపక్‌తక్రా ఎంపికలుం టాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐవో టీ వర ప్రసాద్‌రావు, కేఏసీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివా సులు రెడ్డి, అండర్-19 స్కూల్ గేమ్స్ కార్యదర్శి పీ వేణు గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరులో మొక్క నాటుతున్న ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు తదితరులు

సంస్థ అభివృద్ధికి పాటుపడాలి

- అభినందన సభలో ఏపీఎస్ ఆర్టీసీ ఎండీ

ఆత్మకూరు/రాపూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఏపీఎస్ ఆర్టీసీ అభివృద్ధికి ప్రతి ఉద్యోగి పాటుపడాలని ఆ సంస్థ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు పిలుపు నిచ్చారు మంగళవారం జిల్లాలోని రాపూరు, ఆత్మకూరు ఆర్టీసీ డిపోలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేసి, అభినందించారు. ఆర్టీసీ ప్రాంగణాలలో మొక్కలు కూడా నాటారు. ఆత్మకూరులో జరిగిన కార్యక్రమంలో ఎండీ మాట్లాడుతూ ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైన వారిని ఆదర్శంగా తీసుకుని మిగతా వారు కృషి చేయాలని కోరారు. ఖాళీగా ఉన్న ఆర్టీసీ స్థలాలను ఓఎస్ -15 పథకం కింద ఉపయోగించుకోవాలని తెలిపారు. అనంతరం జోనల్ చైర్మన్ నన్నపరెడ్డి సురేష్ రెడ్డి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఈడీ అప్పలరాజు, నెల్లూరు జోన్ -3 ఎగ్జిక్యూటర్ డైరెక్టర్ నాగేంద్రప్రసాద్, డీటీపీవో షేక్ సమీమ్, డీఎంలు శివకేశ్ యాదవ్, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డు వచ్చిందో.. లేదో!?

నెల్లూరులో గందరగోళంగా పంపిణీ ప్రక్రియ

వలసదారులకు తప్పని ఇబ్బందులు

సచివాలయ సిబ్బంది, డీలర్ల మధ్య సమన్వయలోపం • అర్బన్‌లో 36.68 శాతమే పంపిణీ

నెల్లూరు (హరనాథపురం), సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ముఖ్యంగా నెల్లూరు అర్బన్‌లో స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ గందర గోళంగా మారింది. ఎంతోకాలంగా కొత్త కార్డుల కోసం, ఉన్న కార్డులలో మార్పు, చేర్పుల కోసం ఎదురు చూసిన వారిలో స్మార్ట్ కార్డుల పంపిణీ ఆనందం నింపింది. అయితే ఈ కార్డుల పంపిణీనే గందరగోళానికి దారి తీసింది. వలంటీర్లు మ్యాపింగ్ చేయడంలో ఏర్పడిన గందరగోళం ఇప్పుడు కార్డుల పంపిణీకి విఘాతం కలుగుతోంది. ఉదాహరణకు వెంకటాచలం నుంచి నెల్లూరులో స్థిరపడిన కార్డుదారులు తాను వెంకటాచలం నుంచి నెల్లూరుకు వచ్చానని, మ్యాపింగ్ చేసిన వలంటీర్‌కు లేదా డీలర్‌కు చెప్పకపోవటంతో వారి కార్డులు వెంకటాచలానికి చేరాయి. దీంతో కార్డుదారులు నగరంలో సరుకులు పొందుతున్న డీలర్ వద్దకు వెళుతున్నారు. కానీ డీలర్లు సరుకులు ఎక్కడనుంచైనా తీసుకొనే పోర్టబులిటీ ఉండటంతో సరకులు ఇచ్చామని, సచివాలయానికి వెళ్లాలని సూచిస్తున్నారు. సచివాలయానికి వెళితే అక్కడున్న సిబ్బంది మీ కార్డు మా దగ్గర లేదు. డీలర్ వద్దకు వెళ్లమని సూచిస్తున్నారు. డీలర్, సచివాలయ సిబ్బంది సరైన సమాచారం ఇవ్వకపోవటంతో స్మార్ట్ రేషన్ కార్డులు లబ్ధిదారులకు అందని పరిస్థితి ఏర్పడింది.

- నెల్లూరులో దారుణంగా..

నెల్లూరు అర్బన్, రూరల్ ప్రాంతాల్లో స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ అస్తవ్యస్తంగా ఉంది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఉద్యోగాలు, పనుల కోసం వలసవచ్చి స్థిరపడిన వారు ఎందరో ఉన్నారు. వీరందరి కార్డులు వారి స్వస్థలాల తహసీల్దారు కార్యాలయాలకు వెళ్లినట్లు సమచారం. వారి ద్వారా సచివాలయాలకు వెళ్లాయి. నెల్లూరు అర్బన్‌కు 63,422 స్మార్ట్ కార్డులు రాగా ఇప్పటివరకు 23,262 కార్డులను పంపిణీ చేశారు. ఇంకా 40,160 కార్డులు పంపిణీ చేయాల్సి ఉంది. నెల్లూరు రూరల్‌కు 82,862 కార్డులు కార్డులు రాగా ఇప్పటివరకు 45,455 కార్డులను పంపిణీ చేశారు. ఇంకా 37,407 కార్డులు పంపిణీ చేయాల్సి ఉంది. జిల్లాకు మొత్తం 7,10,998 కొత్త స్మార్ట్ రేషన్‌కార్డులు రాగా, ఇప్పటివరకు 5,07,375 కార్డులను పంపిణీ చేశారు. ఇంకా 2,03,623 కార్డులు (71.36 శాతం) పంపిణీ చేయాల్సి ఉంది. కందుకూరులో 71.54 శాతం, కావలిలో 71.25 శాతం, ఆత్మకూరులో 78.79శాతం పంపిణీ జరిగింది. నెల్లూరు రూరల్ అర్బన్, ఇతర మున్సి పల్ ప్రాంతాలలో డీలర్లు వెళ్ల కుండా సచివాలయ సిబ్బంది ఈ కార్డులను పంపిణీ చేస్తున్నారు. దీంతో సమస్య తలెత్తింది. జిల్లాలోని గ్రామీణ మండలాల్లో డీలర్లు, వీఆర్‌ఓలు, సచివాలయ సిబ్బంది సమన్వయంతో స్మార్ట్‌కార్డుల పంపిణీని అద్భుతంగా చేస్తున్నారు. డీలర్లు ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేయడం వలన 80శాతానికి దాటింది. కానీ పట్టణ ప్రాంతాలలో సచివాలయ సిబ్బందిపై మాత్రమే ప్రక్రియను వదిలేయడంతో పంపిణీ చేయలేక పోతున్నారనే విమర్శలు ఉన్నాయి.



కోవూరులో లబ్ధిదారుకు స్మార్ట్ కార్డు అందజేస్తున్న చేస్తున్న డీలర్ల సంఘం ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి

కార్డుల పంపిణీ ఇలా

ప్రాంతం	శాతం
కోవూరు	80.53
పొదలకూరు	84.34
గుడ్లూరు	80.36
సైదాపురం	80.21
జలదంకి	80.79
ఇందుకూరుపేట	84.89
మర్రిపాడు	81.12
మనుబోలు	81.16
వెంకటాచలం	80.55
కలిగిరి	84.19
దగదర్తి	82.98
కలువాయి	84.87
ఏఎస్‌పేట	80.88
రాపూరు	85.93
వరికుంటపాడు	80.11
ఉదయగిరి	84.13
చేజర్ల	84.72
దుత్తలూరు	84.20
నెల్లూరు అర్బన్	36.68
నెల్లూరు రూరల్	54.86

జీజీహెచ్ వైద్యుడు ధీరజ్‌కు స్వర్ణ పతకం

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో న్యూరోసర్జన్‌గా పనిచేస్తున్న డాక్టర్ జొన్నలగడ్డ ధీరజ్ రాష్ట్ర గవర్నర్ నజీర్ అహ్మద్ నుంచి ప్రొఫెసర్ ఎంఆర్‌సీ నాయుడు గోల్డ్ మెడల్ అందుకున్నారు. మంగళవారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన ఎన్టీఆర్ హెల్త్ యూని వర్సిటీ స్నాతకోత్సవంలో ఆయన ఈ పతకం అందుకున్నారు. 2021 - 22 సంవత్సరానికి సం బంధించి యూనివర్సి టీలో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనపరిచి న్యూరాలజీ విభాగంలో పట్టా పుచ్చుకున్నందుకు డాక్టర్ ధీరజ్‌కు స్వర్ణ పతకం లభించింది. ప్రజలకు మరింతగా వైద్య సేవలు అందించేందుకు ఈ మెడల్ స్ఫూర్తినిస్తుందని పతక గ్రహీత పేర్కొన్నారు.



గవర్నర్ నుంచి గోల్డ్ మెడల్, ప్రశంసాపత్రం అందుకుంటున్న ధీరజ్

కోవూరులో మద్యం 'సిట్ 'విచారణ

కోవూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రాన్ని కుదిపేస్తున్న మద్యం కుంభకోణాన్ని పరిశోధిస్తున్న సిట్ అధికారులు మంగళవారం కోవూరులో ఓ రియల్టర్‌ను రహస్యంగా విచారించారు. పట్టణానికి చెందిన డేగపూడి ప్రభాకరరెడ్డికి మద్యం కేసులో నిందితుడి ఉన్న ధనుంజయ రెడ్డి సమీప బంధువు. గత ప్రభుత్వ హయాంలో ధనుంజయరెడ్డి ప్రభుత్వ కార్యదర్శిగా పనిచేసే సమయంలో కోవూరులో 80 అంకణాల స్థలాన్ని కొనుగోలు చేశారు. ఇటీవల ధనుంజయరెడ్డి ఆస్తుల గురించి సిట్ దృష్టి సారించడంతో కోవూరులో ఆయన స్థలం కొనుగోలు చేసిన విషయం వెలుగు చూసింది. దీంతో సిట్ అధికారులు ప్రభాకరరెడ్డిని విచారించారు. అంకణం ఎంతకు కొనుగోలు చేశారు.. ఎవరి వద్ద కొనుగోలు చేశారనే విషయాలను రాబట్టారు. మార్కెట్టు ధర ప్రకారమే ప్లాటును కొనుగోలు చేశారని ఆయన సిట్ అధికారులకు తెలిపారు. పాటూరు గ్రామానికి వెళ్ళే దారిలో ఏర్పాటుచేసిన ప్లాటు పరిసర ప్రశాంతంగా ఉండటంతో ధనుంజయ రెడ్డి కొనుగోలు చేసినట్లు సమాచారం. ఇద్దరు మధ్యవర్తుల సమక్షంలో ప్రభాకరరెడ్డి స్టేట్‌మెంటు రికార్డు చేసినట్లు తెలిసింది. అలాగే మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి కూడా కోవూరు, విడవలూరు మండలాల్లో పొలం కొనుగోలు చేశారని సిట్ అధికారులకు సమాచారం అందింది. ఈ విషయం మీద కూడా త్వరలోనే విచారించనున్నట్లు తెలిసింది.



రియల్టర్‌ను విచారిస్తున్న సిట్ అధికారులు

రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

- జేసీకి వినతిపత్రం అందించిన వైసీపీ నేతలు

నెల్లూరు (వెంకటేశ్వరపురం), సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రైతులు పండించిన పంటకు కనీస గిట్టుబాటు ధర కల్పించలేని స్థితిలో కూటమి ప్రభుత్వం చేస్తోందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. వైసీపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం రెవెన్యూ డివిజన్ కేంద్రాలైన నెల్లూరు, కావలి, ఆత్మకూరు, కందుకూరులలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీలు చేపట్టారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నగరంలోని వీఆర్‌సీ కూడలిలోని అంబేడ్కర్ చిత్రపటనికి పూలమాల వేసి ర్యాలీగా కలెక్టరేట్ వద్దకు చేరుకొన్నారు. రైతాంగ సమస్యలపై జేసీ కార్తిక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు యురియా బస్తా గతంలో రూ.270 ఉంటే ప్రస్తుతం 600 వరకు అమ్ముతున్నారన్నారు. కూటమి ప్రభుత్వంలో కమీషన్లకు కక్కుర్తిపడి రైతులను ఇబ్బందులకు గురిచేస్తూ ప్రైవేటు వ్యాపారులకు అందించారని విమర్శించారు. ఇందులో దాదాపు రూ.200 కోట్లు చేతులు మారాయని ఆరోపించారు. ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రైతుల కన్నీరు మంచిది కాదని, ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, వైసీపీ నాయకులు నల్లపురెడ్డి రజత్‌కుమార్, కాకాణి పూజిత పలువురు రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.



- సీపీఎం నిరసన ప్రదర్శన

నెల్లూరు (వైద్యం) : ధాన్యానికి మద్దతు ధర కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ డిమాండ్ చేశారు. ధాన్యానికి మద్దతు ధర కల్పించాలంటూ మంగళవారం నెల్లూరులో సీపీఎం నిరసన ప్రదర్శన నిర్వహించింది. ఈ సందర్భంగా మూలం రమేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ధాన్యానికి మద్దతు ధర కింద ఏ గ్రేడ్ రకానికి రూ.20,308, బి గ్రేడ్ రకానికి రూ. 20,130 ప్రకటించిందన్నారు. దీని ప్రకారం వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం కొనాలని కోరారు. మార్కెట్ కంటే దళారులు రూ.6వేలు, 4 వేలు తగ్గించికొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అంతేగాక తూకా ల్లోనూ మోసం చేస్తున్నారని మండిపడ్డారు. వెం టనే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో సీపీఎం నేతలు మాదాల వెంకటేశ్వర్లు, మోహన్‌రావు, రైతు సంఘాల నేతలు పాల్గొన్నారు.

పౌరసంబంధాల శాఖ డీడీగా వేణుగోపాల్‌రెడ్డి



నెల్లూరు (హరనాథపురం), సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా పౌరసంబంధాశాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా పి. వేణుగోపాల్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సత్య సాయి జిల్లా పుట్టపర్తిలో పౌరసంబంధాల శాఖలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా వేణుగోపాల్‌రెడ్డిపని చేస్తున్నారు. పదోన్నతిపై డిప్యూటీ డైరెక్టర్‌గా నెల్లూరుకు నియమితులయ్యారు.

జనం కష్టాలు 'అనంత'ం!

- 'సూపర్' సభకు 260 పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసులు
- బస్సులు లేక గ్రామీణ ప్రజానీకం అవస్థలు
- సర్వీసులను సమకూర్చడంలో అధికారుల వైఫల్యం
- విచారణ కేంద్రంలో సమాధానం చెప్పేవారూ కరువే!

బస్సుల కొరత ఏర్పడటంతో ప్రైవేటు వాహనదారులు ఇష్టానుసారం చార్జీలు వసూలు చేశారు. చేసేది లేక ప్రయాణికులు కూడా ప్రైవేటు వాహనాల్లో ప్రయాణించాల్సి వచ్చింది.

\- నెల్లూరు (క్రైం, ఆంధ్రజ్యోతి)

'సూపర్ సిక్స్-సూపర్ హిట్' సభకు జనసమీకరణ కోసం జిల్లా నుంచి అనంతపురానికి ఆర్టీసీ సర్వీసులు తరలివెళ్లడంతో పల్లెజనం అవస్థలు ఎదుర్కొంది. గంటల తరబడి వేచిఉన్నా బస్సులు రాకపోవడంతో చివరకు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వచ్చింది. కనీసం బస్టాండ్లలో సమాచారం ఇచ్చే సిబ్బంది కూడా కరువయ్యారు. అనంతపురంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి సభకు 260 బస్సులను ఆర్టీసీ అధికారులు కేటాయించారు. ఇవన్నీ పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసులు కావడంతో పల్లెజనానికి అవస్థలు తప్పలేదు. కనీసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయంలోనూ అధికారులు చేతులెత్తేశారు. మరోవైపు ఆర్టీసీ



కందుకూరులో బస్టాండ్‌లో..



నెల్లూరు : బస్సులు లేక బోసిపోయిన ప్రధాన బస్టాండు



ఉదయగిరి : ఎండలో మండిపోతూ..



హమ్మయ్య.. ఎంత సేపటికి బస్సు వచ్చిందో..



అల్లూరులో..



కావలి : బస్సులు లేవు.. తప్పదు మరి!



కావలిలో ఎగబడుతున్న ప్రయాణికులు



పొదలకూరులో బస్సుల కోసం పడిగాపులు

ఎయిర్‌పోర్టుకు టెండర్లు

- ఆహ్వానించిన ఎయిర్‌పోర్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్
- పీపీపీ మోడ్‌లో నిర్మాణం.. నవంబరు 10 వరకు గడువు

నెల్లూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లావాసుల చిరకాల వాంఛ అయిన విమానాశ్రయ నిర్మాణంలో అడుగులు వేగంగా పడుతున్నాయి. గత నెలలో దగదర్తి వద్ద ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం తెలపగా, తాజాగా ఈ నిర్మాణానికి సంబంధించి ఏపీ ఎయిర్‌పోర్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ టెండర్లు ఆహ్వానించింది. పబ్లిక్-ప్రైవేట్-పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానంలోని డీబీఎఫ్‌వోటీ (డిజైన్-బిల్డ్-ఫైనాన్స్-ఆపరేట్-ట్రాన్స్‌ఫర్) పద్ధతిలో ఎయిర్‌పోర్ట్ నిర్మించనున్నారు. ఈ పద్ధతిలో కాంట్రాక్టర్లు చూపించే ఆసక్తిని బట్టి కొంత ఖర్చును ప్రభుత్వం భరిస్తుంది. నవంబరు 10వ తేదీ వరకూ ఆసక్తి కలిగిన సంస్థలు ఎయిర్‌పోర్టు నిర్మాణానికి టెండర్లు దాఖలు చేసుకోవచ్చు. మొత్తం 1379 ఎకరాల్లో దగదర్తి వద్ద నిర్మించనున్న ఎయిర్‌పోర్టును గ్రీన్‌ఫీల్డ్ మోడ్‌లో నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గతంలోనే 814 ఎకరాలను ఎయిర్‌పోర్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు జిల్లా యంత్రాంగం అప్పగించింది. మిగిలిన భూమిని కూడా అప్పగించే ప్రక్రియ వేగంగా జరుగుతోంది. జిల్లాలో ఎయిర్‌పోర్ట్ నిర్మాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో రెండేళ్లలో పనులు పూర్తి చేసేలా ఎయిర్‌పోర్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రణాళికలు రూపొందించింది. ఈ ఏడాది చివరి నాటికి టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి నిర్మాణ సంస్థకు పనులు అప్పగించాలని అధికారులు భావిస్తున్నారు. కాగా జిల్లా పారిశ్రామికంగా, వ్యాపార పరంగా ఎంతో వృద్ధి చెందుతున్నా జిల్లావాసులకు విమాన సేవలు అందుబాటులో లేవు. జిల్లాలో ఎయిర్‌పోర్ట్ నిర్మించాలని ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వాలను కోరుతూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో దగదర్తిలో ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి 2019లోనే అప్పటి సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేయగా, పనులు కూడా మొదలయ్యాయి. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఈ పనులను అర్థాంతరంగా ఆపేసింది. ఆ తర్వాత ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ఇప్పుడు మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎయిర్‌పోర్ట్ నిర్మాణంలో కదలిక వచ్చింది. అందుకు తగ్గట్లుగానే వేగంగా అడుగులు ముందుకు పడుతున్నాయి.

ఎస్సీ కాలనీ శ్మశాన స్థలాన్ని కాపాడండి

కందుకూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): లింగసముద్రం మండలం మాలకొండరాయునిపాలెం పంచాయతీ ముక్తేశ్వరం ఎస్సీ కాలనీ శ్మశాన స్థలాన్ని ఆక్రమించిన వ్యక్తిపై చర్యలు తీసుకుని శ్మశాన స్థలాన్ని కాపాడాలని మంగళవారం ఆ కాలనీవాసులు సబ్ కలెక్టరు దామెర హిమవంశీని కలిసి వినతిపత్రం అందజేశారు. స్పందించిన సబ్ కలెక్టరు హిమవంశీ అక్కడికక్కడే లింగసముద్రం తహసీల్దారుతో ఫోన్‌లో మాట్లాడి గ్రామాన్ని సందర్శించి పరిశీలన చేయటంతో పాటు శ్మశానస్థలానికి సర్వేచేయించి వారంలోగా నివేదిక అందజేయాలని ఆదేశించారు. సబ్ కలెక్టరును కలిసిన వారిలో టీడీపీ నెల్లూరు పార్లమెంటు అధికార ప్రతినిధి గోచిపాతల మోషే, ముక్తేశ్వరంకు చెందిన గొడపేరు రత్నం, ఏసోబు, బాలయ్య, సామ్యేలు, కోటేషు, ఆదాము, రజనీకాంత్, రమేష్ తదితరులున్నారు.

'విద్యుత్'లో సిబ్బంది కొరత!

- ఇబ్బడి ముబ్బడిగా మరమ్మతులు
- సరఫరాలో తరచూ అంతరాయం
- ప్రైవేట్ వ్యక్తులతో రైతుల పనులు
- సిబ్బందిని నియమించాలని వినతి


వలేటివారిపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్

వలేటివారిపాలెం, సెప్టెంబరు 9(ఆంధ్ర జ్యోతి): మండలంలోని పోకూరు, చుండి, వలేటి వారిపాలెం, నలదలపూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో సిబ్బంది కొరత వేధిస్తోంది. దీంతో రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరాకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతోన్నాయి. మండలంలో సుమారు 2,600 వ్యవసాయ కనెక్షన్‌లు, 10,100 గృహ వినియోగదారులు, వాణిజ్య కనెక్షన్లు ఉన్నాయి. వీరందరికి సిబ్బంది కొరత కారణంగా నాణ్యమైన విద్యుత్ అందించలేకపోతున్నారు అంతేగాకుండా విద్యుత్ సరఫరాకు తరచూ అంతరాయం ఏర్పడుతుండడంతో రైతులు ప్రయివేట్ వర్కర్‌లను ఆశ్రయిస్తున్నారు. అయినా డబ్బులు, సమయం వృథా అవుతుందే తప్ప సమస్య తీరడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో సరిపడు సిబ్బందిని నియమించాలని రైతులు కోరుతున్నారు. మండలంలో వలేటివారిపాలెం, చుండి, పోకూరు, నలదలపూరు గ్రామాల్లో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో 23 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా 16 మంది మాత్రమే ఉన్నారు. పోకూరు, చుండి, పోలినేనిపాలెం, వలేటివారిపాలెం, జమీన్‌ఉప్పలపాడు, మాలకొండ, శింగమనేనిపల్లె గ్రామాల్లో సిబ్బంది లేరు. దీంతో వర్షాకాలం వచ్చిందంటే పొలాల్లో ఏదో ఒక విద్యుత్ సమస్య తలెత్తుతోంది. ఆ సమస్యలను అధిగమించాలంటే తగినంత మంది సిబ్బంది లేకపోవడంతో ఎప్పటికప్పుడు పరిష్కరించలేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. మారుమూల గ్రామాల్లో రాత్రిళ్లు విద్యుత్ సమస్య ఏర్పడితే చిన్న చిన్న మరమ్మతులు చేయాలన్నా ప్రయివేట్ వ్యక్తులను ఆశ్రయించాల్సి వస్తోందని వాపోతున్నారు.

● బోర్ల వద్ద ఫీజులు పోయినా...

రైతులు వ్యవసాయ బోర్లకు అమర్చిన ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద కనీసం ఫీజు పోయినా అమర్చే వారు లేక ప్రయివేట్ వ్యక్తులకు రైతులు వందల రూపాయలు ఇచ్చి ఫీజు వేయించుకొంటున్నారు. ప్రభుత్వం అందించే ఉచిత విద్యుత్ రైతులకు రెండు విడతలుగా అందిస్తున్నారు. రాత్రి వేళల్లో సరఫరాలో అంతరాయం ఏర్పడితే సరిచేసే సిబ్బంది లేకపోవడంతో రైతులే సరిచేసుకొంటుండడంతో ఎక్కడ ప్రమాదాలు జరుగుతాయేనని ఆందోళన చెందుతున్నారు.


వలేటివారిపాలెంలో కూలడానికి సిద్ధంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

● కొత్త సర్వీసులను అమర్చాలంటే...

రైతులు బోర్లను వేసుకొని వాటికి కొత్తగా సర్వీసు అమర్చుకోవాలంటే ప్రయివేట్ వ్యక్తులను ఆశ్రయించాలి. పొలాల్లో కొద్దిపాటి పనులు చేయాలన్నా ప్రయివేట్ వ్యక్తులే దిక్కు. రైతులు పొలాల్లో ఒరిగిపోయిన విద్యుత్ స్తంభాలను నిటారుగా నిలబెట్టాలన్నా, కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేయడానికి కూడా సిబ్బంది లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అవసరమైన సిబ్బందిని నియమించాలని రైతులు, వినియోగదారులు కోరుతున్నారు.

సిబ్బంది కొరత వాస్తవమే..

మండలంలో విద్యుత్ సిబ్బంది కొరత వాస్తవమే. దీంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతోంది. దీనిని అధిగమించడానికి తగిన సిబ్బందిని నియమించాలి. సిబ్బంది కొరతపై ఉన్నతాధికారులకు నివేదించాం. ఉన్న సిబ్బందితోనే పనులు చేయిస్తున్నాం. సరఫరాలో సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తాం.

- తాటికొండ మధుబాబు, ఏఈ

న్యూస్ బాక్స్

హలో.. హలో.. వినిపిస్తోందా..!?


వలేటివారిపాలెంలోని బీఎస్ఎన్ఎల్ టవర్

వలేటివారిపాలెం, సెప్టెంబరు 9 (ఆంధ్ర జ్యోతి) : మండల కేంద్రమైన వలేటివారిపాలెంలోని పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ నుంచి సేవలు నిలిచిపోయి నిరుపయోగంగా మారింది. కరెంట్ పోతే చాలు బీఎస్ఎన్ఎల్ ఫోన్లు పనిచేయడం లేదు. ప్రభుత్వ అధికారిక సిమ్‌లు అధికంగా బీఎస్ఎన్ఎల్‌వే ఉండడంతో సమాచారం ఉన్నతాధికారులకు చేరవేయడానికి, మాట్లాడేందుకు అవస్థలు పడుతున్నారు. ఫోన్ చేస్తే హలో.. హలో.. వినిపిస్తోందా అనుకుంటుండగానే కాల్ కట్ అవుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి బీఎస్ఎన్ఎల్ సేవలను పునరుద్ధరించాలని వినియోగదారులు కోరుతున్నారు.

రైల్వే అధికారులకు ధన్యవాదాలు

బిట్రగుంట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కరోనా సమయంలో బిట్రగుంట రైల్వే స్టేషన్‌లో స్టాపింగ్ ఎత్తేసిన రైళ్లలో కొన్నింటికి మళ్లీ స్టాపింగ్ ఇస్తున్నందుకు బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ సభ్యులు మంగళవారం మిఠాయిలు పంపిణీ చేసి విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. రైల్వే అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఈనెల 10వ తేదీ నుంచి చెన్నై-కాట్రా వెళ్లే అండమాన్, చెన్నై-లక్నో, తిరుపతి-కాకినాడ ఎగువ, దిగువ మార్గాల్లో నడిచే ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగనున్నాయి. ఈ కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు షేక్.నూరుద్దీన్, బత్తుల రవిచంద్ర, మునుస్వామి వేణు, షేక్.జహీర్, రాజారత్నం, నవీద్, నౌషాద్, తదితరులు పాల్గొన్నారు.

రైతులు, కార్మికులు సంఘటితంగా పోరాడాలి

జలదంకి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): వ్యవసాయాన్ని కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి వెళ్లకుండా కాపాడుకోవాలంటే రైతులు, వ్యవసాయ కార్మికులు సంఘటితంగా పోరాడాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సీపీఎం కార్యాలయం సురే చెంచురెడ్డి భవన్‌లో ఖాజీబీ అధ్యక్షతన జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం 6వ మహాసభలో నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా బత్తన నరసింహం, మేలంగి ఆంథోనీబాబు, సభ్యులుగా ఏడుగురుని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మహాసభలో సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు తాళ్లూరి మాల్యాద్రి, రైతుసంఘం నేత గడ్డం మాల్యాద్రి, మేలంగి ఆంథోనీబాబు తదితరులు ప్రసంగించారు. ఈ మహాసభకు మండలంలోని పలుగ్రామాలకు చెందిన వ్యవసాయ కార్మికులు పాల్గొన్నారు.

పగిలిన మంచినీటి పైపులైను

లింగసముద్రం, సెప్టెంబరు 9(ఆంధ్ర జ్యోతి) : మండల కేంద్రమైన లింగసముద్రంలోని శ్రీ ఆంజనేయస్వామి పెట్రోల్ బంకు ఎదురుగా ఆర్అండ్‌బీ రోడ్డు పక్కనే ఉన్న అంతర్గత మంచినీటి పైపులైను పగిలి నీరు వృథాగా పోతోంది. ఐదు రోజుల క్రితం స్థానికులు ఒకరు ఈ రోడ్డు పక్కనే గుంత తీస్తుండగా ఎక్స్‌కవేటర్ బకెట్ మంచినీటి పైపుకు తగిలడంతో మంచినీటి పైపు పగిలి పోయింది. దీంతో మంచినీరు వృథాగా పోవడంతో పరిసర ప్రాంతాల్లో కుళాయిలకు నీరు తక్కువగా వస్తోంది. అంతేగాకుండా మంచినీరు రోడ్డుపై నిలిచి వాహనాల రాకపోకల సమయంలో పాదాచారులపై పడుతుండడంతో ఇబ్బందిపడుతున్నారు. అయితే మంచినీటి పైపులైన్ పగిలి నీరు వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. సబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జనసేన కార్యాలయం ప్రారంభం

కొండాపురం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): కొండాపురంలో జనసేన పార్టీ కార్యాలయాన్ని ఆపార్టీ మండల కన్వీనర్ ఆకుల వెంకట్ మంగళవారం ప్రారంభించారు. పార్టీ సీనియర్ నాయకులు వేములపాటి అజయ్‌కుమార్ సూచనల మేరకు కొట్టే వెంకటేశ్వర్లు సారథ్యంలో కార్యాలయాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ మండలంలో నాయకులు, కార్యకర్తల సహకారంతో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. కార్యకర్తల సమస్యలు పరిష్కరించడంలో ముందుండి త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలలో ఎన్‌డీఏ కూటమి అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు అక్బర్‌బాషా, మండల కార్యవర్గ సభ్యులు బీ.వాసు, పీ.శ్రీనివాసులు, ధనలక్ష్మి, ఎం.శ్రీనివాసులు, నియోజకవర్గంలోని జనసేన మండల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నేరాల నియంత్రణకు డ్రోన్ కెమెరాతో నిఘా

● ఫిరోజ్, వన్‌టౌన్ సీఐ, కావలి

ముఖాముఖి

కావలిరూరల్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణ శివారు ప్రాంతాల్లో నేరాల నియంత్రణకు డ్రోన్ కెమెరాతో నిఘా ఉంచాం. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, చట్టవ్యతిరేక చర్యలు చేపట్టినా తక్షణం తెలిసిపోతోంది. వెంటనే తమ సిబ్బంది సంఘటనా స్థలికి చేరుకుని నిందితులను అదుపులోకి తీసుకునేందుకు డ్రోన్ కెమెరా ఎంతో దోహదపడుతుందని కావలి వన్‌టౌన్ సీఐ ఫిరోజ్ తెలిపారు.

? నేరాల నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

! పట్టణ శివారు ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో నేరాల నియంత్రణకు డ్రోన్‌లను వినియోగిస్తున్నాం.

? మత్తుపదార్థాల నియంత్రణకు ఏ విధమైన చర్యలు తీసుకుంటున్నారు.

! పట్టణ పరిసర ప్రాంతాల్లో మత్తుపదార్థాల అమ్మకాలు, వినియోగం జరగకుండా ప్రత్యేక నిఘా ఉంచాం. విద్యార్థుల ప్రవర్తన, కదలికలపై తల్లిదండ్రులు కూడా దృష్టి సారించాలి.

? సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారా.

! పట్టణంలోని విద్యా సంస్థల్లో విద్యార్థులు, యువతకు నేరాలు, సైబర్ నేరాలపై వివిధ రకాలుగా అవగాహన కల్పిస్తున్నాం.

? ట్రాఫిక్ నియంత్రణకు ఎలాటి చర్యలు చేపడుతున్నారు.

! పట్టణంలోకి లగేజీతో వచ్చే గూడ్సు లారీల వల్ల ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు చేపడుతున్నాం. లారీలను రాత్రి, తెల్లవారుజాము సమయాల్లో మాత్రమే పట్టణంలోకి అనుమతిస్తున్నాం.

బీజేపీలో చేరిక

కందుకూరు, సెప్టెంబరు 9(ఆంధ్ర జ్యోతి): లింగసముద్రం మండలం వెంగళాపురంకు చెందిన రాతికింది వేణు, రాతికింది కొండమ్మలు మంగళవారం పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త గట్టమనేని హరిబాబు సమక్షంలో బీజేపీలో చేరారు. వారికి ఆయన కండువాలు కప్పి ఆహ్వానించారు. నాయకులు మన్నేపల్లి వరప్రసాదరావు, జొన్నాదుల రాఘవయ్య, జగన్నాథం వైకుంఠం, ముప్పల భూషయ్య, మట్లె ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్' పేరుతో మోసం

● వైసీపీ రైతుపోరు ర్యాలీలో ఉదయగిరి వైసీపీ ఇన్‌చార్జి రాజగోపాల్ రెడ్డి


ర్యాలీని అడ్డుకుంటున్న పోలీసులు

కావలి(టౌన్), సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సూపర్‌సిక్స్ పథకం పేరుతో ప్రభుత్వం రైతులను ముంచిందని వైసీపీ ఉదయగిరి నియోజక వర్గ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆరోపించారు. కావలి, ఉదయగిరి నియోజకవర్గాల వైసీపీ శ్రేణులు సంయుక్తంగా మంగళవారం పట్టణంలో రైతుపోరు నిరసన ర్యాలీ నిర్వహిం చారు. ఆర్ఎస్ఆర్ కల్యాణ మండపం నుంచి ప్రారంభమైన ర్యాలీకి అనుమతి లేదని పోలీసులు అడ్డుకునేందుకు చేసిన ప్రయత్నాలు విఫల మయ్యాయి. చివరకు వైసీపీ శ్రేణులు రైతులతో కలిసి ఆర్డీవో కార్యాలయం వరకు చేరుకున్నారు. ఆర్డీవోకు వినతిపత్రం అందించారు. అనంతరం రాజగోపాల్ రెడ్డి, వైసీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పందిటి కామరాజులు విలేకర్లతో మాట్లాడారు. రైతులకు యూరియా సరఫరా చేయకుండా ఇబ్బంది పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ. కార్యక్రమంలో వైసీపీ పట్టణ అధ్యక్షుడు కేతిరెడ్డి శివకుమార్, కనమర్లపూడి నారాయణ, కావలి, ఉదయగిరి నియోజకవర్గాల నాయకులు పాల్గొన్నారు.

● జలదంకి(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణంలో జరిగిన రైతుపోరు నిరసనకు మండలంలోని జమ్మలపాలెం నుంచి ఉదయగిరి నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా తరలివెళ్లారు. ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ శ్రేణులు ముందుగా జమ్మలపాలెం చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇస్కా మదన్‌మోహన్‌రెడ్డి, పాలవల్లి మాలకొండారెడ్డి, మేదరమెట్ల శివలీల, రావి ప్రసాద్‌నాయుడు, తమ్మినేని సతీష్‌నాయుడు, బీపీ కృష్ణారెడ్డి, గండు వెంకారెడ్డి పాల్గొన్నారు.

సకాలంలో ఎరువులు అందించాలి

● వైసీపీ ఆధ్వర్యంలో కందుకూరులో రైతు పోరుబాట


కందుకూరు : పోరుబాట ర్యాలీలో వైసీపీ శ్రేణులు

కందుకూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైతులకు సకాలంలో ఎరువులు అందించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కందుకూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్‌యాదవ్ కోరారు. రైతుపోరు కార్యక్రమంలో మంగళవారం ఆయన పాల్గొన్నారు. అంబేడ్కర్ విగ్రహం సెంటర్ నుంచి సబ్ కలెక్టరు కార్యాలయం వరకు రైతులతో కలిసి ర్యాలీ నిర్వహించేందుకు ప్రయత్నించగా సీఐ అన్వర్‌బాషా ఆధ్వర్యంలో పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం సబ్ కలెక్టరు కార్యాలయంలో వినతిపత్రం అందజేసి బుర్రా మాట్లాడిరు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కనిగిరినే కలవరిస్తున్న బుర్రా

కనిగిరి ఎమ్మెల్యేగా ఉన్న బుర్రా మధుసూదన్‌యాదవ్‌ను గత ఎన్నికల సమయంలో ఆపార్టీ అధినేత జగన్ కందుకూరుకు పంపించినప్పటికీ ఆయన ఇప్పటికీ కనిగిరినే కలవరిస్తుండటం పట్ల వైసీపీ కార్యకర్తలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం రైతు పోరుబాట కార్యక్రమంలో మాట్లాడుతూ కరేడు రైతులకు అండగా నిలుస్తామని వారి పొలాలు ప్రభుత్వం తీసుకోకుండా కాపాడతామని వారంతా కనిగిరి నియోజకవర్గంలో అంతర్భాగంగా ఉండేలా కృషి చేస్తానని ప్రకటించారు. దీంతో ఖంగుతిన్న ఆపార్టీ ద్వితీయశ్రేణి నేతలు ఏదో అలవాటులో పొరపాటు అయిఉంటుందిలే అని భావించి కనిగిరి కాదు కందుకూరు అని సవరించే ప్రయత్నం చేసినప్పటికీ ఆయన వినకుండా మా కనిగిరి నియోజకవర్గంలో కూడా ఇలాంటి సమస్యలే ఉన్నాయి, అందుకే ప్రస్తావించాను అనడంతో నేతలు అవాక్కయ్యారు.

యూరియా అధిక వినియోగంతో అనర్థం


ఉలవపాడులో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో విజయకుమార్


వలేటివారిపాలెం : నేకునాంపురంలో రైతులకు పీఎండీఎస్ కిట్స్ అందజేస్తున్న ఏవో శేషారెడ్డి


లింగసముద్రంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు దుర్గ, హర్షవర్ధన్‌లు

ఉలవపాడు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి) : యూరియా అధికంగా వాడితే పంటలో దుష్పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని మండల వ్యవసాయశాఖ అధికారి విజయ్ కుమార్ రైతులకు సూచించారు. మండలంలోని ఆత్మకూరులో మంగళవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ.. అధికంగా యూరియా వాడకం వలన నేలలో ఆమ్ల గుణం పెరిగి నేల సారవంతం కోల్పోయి భాస్వరం, పోటాష్ లభ్యత తగ్గుతుందన్నారు. ప్రధాన పంటకు ముందు పచ్చిరొట్ట పంటలను సాగు చేసుకోవాలన్నారు. పీఎండీఎస్ బహుళ ధాన్యాల 6 కిలోల కిట్ ధర రూ.500 అందిస్తున్నందున రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీసీఎన్ఎఫ్ సభ్యులు, వీఏఏ అజయ్, సాజిద్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

వ్యవసాయాన్ని లాభసాటి చేయడమే లక్ష్యం

● వలేటివారిపాలెం : వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని ఏవో కేవీ శేషారెడ్డి తెలిపారు. మండలంలోని నేకునాంపురంలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ శేషారెడ్డి మాట్లాడుతూ పంటల్లో చీడపీడల నివారణా చర్యలకు అధికారుల సలహాలు సూచనలు తీసుకోవాలని తెలిపారు. అధిక మోతాదులో ఎరువులు, పురుగుమందులను వినియోగించకూడదని చెప్పారు. అలా వినియోగించడం వలన తెగుళ్లు ఎక్కువై దిగుబడులు తగ్గిపోతాయని తెలిపారు. అనంతరం రైతులకు పీఎండీఎస్ కిట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట పంటల సాగుతో ప్రయోజనం

● లింగసముద్రం: రైతులు పచ్చిరొట్ట పంటలు, నవధాన్యాలు, జొన్న, సజ్జ, మొక్కజొన్న వంటి పంటలను సాగు చేయాలని పొలం పిలుస్తోంది ఇన్‌చార్జ్ కె హర్షవర్ధన్, ఇన్‌చార్జ్ మండల వ్యవసాయ అధికారి దుర్గ చెప్పారు. మంగళవారం మండలంలోని వెంగళాపురం, లింగసముద్రం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు దీప, రేణుక, ఏఎంసీ సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ఊట ధ్వంసం


పాముల కాలనీలో బెల్లం ఊటను పారబోస్తున్న ఎస్ఐ నారాయణ

లింగసముద్రం, సెప్టెంబరు 9 (ఆంధ్ర జ్యోతి) : నాటు సారా కాసేందుకు నిల్వ ఉంచిన బెల్లం ఊటను పోలీసులు ధ్వంసం చేశారు. మంగళవారం రాత్రి లింగసముద్రం పంచాయతీలోని జంగంరెడ్డిపాలెం పాములకాలనీలో ఒక వ్యక్తి ఇంటిలో బెల్లం ఊట కాచి నిల్వ ఉంచారని ఎస్ఐ ఎం.నారాయణకు అందిన సమాచారం మేరకు ఆయన సిబ్బందితో కలసి దాడి చేశారు. అయితే బెల్లం ఊటను నిల్వ ఉంచిన నిందితుడు పోలీసుల రాకను గమనించి పరారయ్యాడు. దీంతో ఇంట్లో గాలించి డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన బెల్లం ఊటను బయట పారబోశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు. నిందితుడిని త్వరలో పట్టుకుంటామన్నారు. ఈ దాడిలో రైటర్ కే.శ్రీనివాసులు, షేక్ నస్రుల్లా, తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరత తీర్చండి

కలిగిరి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండ లంలోని కలిగిరి, సిద్ధనకొండూరు పీఏసీఎస్ ఛైర్మన్‌లు కదిరి వెంకట రంగారావు, మెట్టుకూరు కృష్ణజీవిరెడ్డిలు ఎన్‌డీసీ సీబీ ఛైర్మన్ మెట్టుకూరి ధనుంజయరెడ్డిని మంగళవారం జిల్లాకేంద్రంలో ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. పీఏసీఎస్‌ల పరిధిలో పంటలు సాగుచేస్తున్న రైతులకు యూరియా కొరత తీర్చాలని వినతి పత్రం అందించారు. సొసైటీ పరిధిలోని రైతుల పంటల సాగుకు సుమారు 100 టన్నుల యూరియా కేటాయించాలని కోరగా రైతులకు ఎరువుల పంపిణీలో ఇబ్బందులు లేకుండా చేస్తామని ధనుంజయరెడ్డి హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

గ్రామ కంఠాల్లో ఇళ్లు, స్థలాలకు హక్కులు


సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో

వలేటివారిపాలెం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి) : గ్రామ కంఠాల్లో ఇళ్లు, స్థలాలపై ప్రజలకు యాజమాన్య హక్కు కల్పించడమే ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని ఎంపీడీవో నరేంద్రదేవ్ తెలిపారు. మండలంలోని పోలినేనిపాలెంలో స్వామిత్వ సర్వే కార్యక్రమాన్ని మంగళవారం ఆయన పరిశీలించి పారదర్శకత నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

డీ గ్రేడ్ విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలి

జలదంకి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): డీ గ్రేడ్ విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని డైట్ అధ్యాపకురాలు ఎం.పద్మజ సూచించారు. ప్రభుత్వ పాఠశాలల పర్యవేక్షణలో భాగంగా మంగళవారం ఆమె జలదంకి మోడల్ ప్రాథమిక పాఠశాల (మెయిన్)ను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న బోధనను, విద్యార్థుల గ్రేడ్ విధానాన్ని, మధ్యాహ్న భోజన పథకాన్ని, పాఠశాల తరగతి గదులు, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. సీ, డీ గ్రేడ్‌లలో ఉన్న విద్యార్థుల బోధన పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఆమె వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కే.ఇమ్మానుయేల్, ఉపాధ్యాయులు ఉన్నారు.


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డైట్ అధ్యాపకురాలు పద్మజ

పొగాకు నారుమడులకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

● వేలం నిర్వహణాధికారి శివకుమార్


పొగ నారుమళ్లు పరిశీలిస్తున్న బోర్డు అధికారులు

కలిగిరి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): కలిగిరి పొగాకు వేలం కేంద్రం పరిధిలో పొగనారుమళ్లు పెంపకానికి రైతులు బోర్డులో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వేలం నిర్వహణాధికారి వీ.శివకుమార్ తెలిపారు. మంగళవారం వేలం కేంద్రం పరిధిలోని కావలియడవల్లి, హసనాపురం, వేల్పులగుంట తదితర గ్రామాల్లో రైతులు సాగుచేస్తున్న పొగాకు నారుమళ్లను బోర్డు అధికారులు, సిబ్బంది పరిశీలించారు. ఈ సందర్భంగా నారుమళ్ల సాగులో యజమాన్య పద్ధతులు పాటించి నాణ్యమైన నారు ఉత్పత్తి చేయాలని కోరారు. అదేవిధంగా పొగాకు నర్సరీలు, నారుమళ్లు అనుమతి లేకుండా సాగుచేస్తే పొగాకుబోర్డు చట్టం ప్రకారం శిక్షార్హులవుతారన్నారు. అనుమతి లేకుండా సాగుచేసిన వారివద్ద నారు కొనుగోలు చేసి రైతు పంట సాగుచేస్తే వారి బ్యారన్ లైసెన్సు రద్దు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్షేత్రాధికారి సంతోష్‌కుమార్, క్షేత్రసహాయకులు బుట్టి రోహిత్, వీ.వెంకటేష్ పాల్గొన్నారు.

ఫొటోగ్రఫీ, రీల్స్ పోటీలకు ఆహ్వానం

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ పర్యాటక దినోత్సవం-2025 సందర్భంగా జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక ఫొటోగ్రఫీ పోటీలు, రీల్స్ వీడియోల పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా పర్యాటక అధికారి ఉషశ్రీ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని పర్యాటక ప్రదేశాలు, సాంస్కృతిక వారసత్వ కోటలు, జలపాతాలు, ఎకో టూరిజం, స్థానిక వంటకాలు వంటి అంశాలను ప్రోత్సహిస్తూ విద్యార్థులు, ఫొటోగ్రాఫర్లు, సృజనాత్మక ప్రతిభ కలిగిన వారు ఈ పోటీల్లో పాల్గొనాలని కోరారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి ఈనెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా బహుమతులు, జ్ఞాపికలు అందజేస్తామని తెలిపారు. పూర్తి వివరాల కోసం 9493668022, 7780749802 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

'కానగ చెట్టు' కాలనీకి వెళ్లొద్దాం రండి..!

రోడ్డుకిరువైపులా కానగ చెట్లు... అందుకే ఆ పేరు

కొన్ని ఊర్ల పేర్లు చాలా ఆశ్చర్యంగా ఉంటాయి. మరికొన్ని విచిత్రంగా ముచ్చటగొలిపేలా ఉంటాయి. ఆ పేర్ల వెనుక అంతులేని చరిత్ర కూడా ఉండొచ్చు. ఆయా ప్రాంతాల ప్రత్యేకతను బట్టి స్థల నామాలు ఏర్పడతాయి. కాలక్రమంలో స్థానికంగా ప్రముఖ వ్యక్తులు... లేదా ప్రకృతి, ఆధ్యాత్మిక విశిష్టతలను బట్టి కూడా కొన్ని ఊర్ల పేర్లు ఏర్పడి ఉంటాయి. బుచ్చి-జొన్నవాడ మార్గంలోని చెల్లాయపాళెం పంచాయతీ వడ్డిపాళెంకు సమీపంలోని ప్రధాన రహదారిలో చెట్టు పేరుతో ఓ గ్రామం ఉంది. దాని పేరు 'కానగ చెట్టు' కాలనీ. 50 ఏళ్ళ క్రితం 25 గిరిజన కుటుంబాలు ఇక్కడ నివసించేవి. వీరి ఇళ్లు ఉన్న ప్రాంతంలో ప్రధాన రహదారికి ఇరువైపులా వరుసగా కానగ చెట్లు వుండేవి. పరిణామ క్రమంలో ఈ ప్రాంతం రెవెన్యూ రికార్డుల్లో సైతం "కానగచెట్టు కాలనీ'గా నమోదు కావడం గమనార్హం. అప్పట్లో రోడ్డుకు పడమటి వైపు ఇటుక బట్టీలుండేవి. ఇటుక బట్టీలు, వ్యవసాయ పనులే ఈ కాలనీ గిరిజనుల జీవనాధారం. చేసుకుంటూ కుటుంబాలు పోషించుకునేవారు. క్రమక్రమంగా పలు సామాజిక వర్గాలకు చెందిన 70కి పైగా కుటుంబాలు ఇక్కడ నివాసం ఏర్పరచు కున్నాయి. ప్రస్తుతం కానుగచెట్టు కాలనీలో సుమారు 200కు పైగా జనాభా ఉంది. 130 నుంచి 150 మంది వరకు ఓటర్లు ఉన్నారు.

- బుచ్చిరెడ్డిపాళెం, (ఆంధ్రజ్యోతి)





అల్లూరులో వరికోత యంత్రాల సందడి

వరికోతలు ముమ్మరమైన నేపథ్యం లో వందల సంఖ్యలో వరికోత యంత్రాలు అల్లూరు మండలానికి తరలి వచ్చాయి. ఈ క్రమంలో ప్రతి రోజూ ఉదయాన్నే స్థానిక పెట్రోలు బంకుల వద్ద బారులు తీరి డీజిల్ నింపుకొంటున్నాయి. మంగళవారం పెట్రోల్ బంకు వద్దకు వచ్చి ఆ ప్రాంతమంతా లారీల్లో ఎక్కిన వరికోత యంత్రాలతో వాటి నిర్వాహకులు, కూలీలు, రైతులతో సందడి నెలకొంది.

- అల్లూరు,(ఆంధ్రజ్యోతి)

మరణమే మార్గమా..!?



కుటుంబ కలహాలు, వేధింపులు, ఆర్థిక ఇబ్బందులు, పరీక్షల్లో ఫెయిల్ అయ్యారనో, ప్రేమ విఫలం అయ్యిందనో క్షణికావేశంలో ఆత్మహత్యకు పాల్పడేవారు నేటి సమాజంలో ఎక్కువవుతున్నారు. ఓ ఇంటి పెద్ద మరణిస్తే ఆ కుటుంబ పరిస్థితి తలకిందులవుతుంది. అలాగే, ఇంటి ఇల్లాలు ఆత్మహత్య చేసుకుంటే పిల్లల భవిష్యత్తు అగమ్యగోచరం అవుతుంది. చేతికి అందివచ్చిన కొడుకో.. కూతురో బలవన్మరణానికి పాల్పడితే ఆ తల్లిదండ్రుల వేదన ఎవరూ తీర్చలేనిది. ప్రపంచంలో సమస్యలే లేనివారు ఉండదనేది వాస్తవం. అలాగే ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందనేది సత్యం. కొంచెం సహనంతో ఆలోచిస్తే, పెద్దల సలహాలు తీసుకుంటే మన సమస్యకు తప్పక పరిష్కారం లభిస్తుందనే విషయాన్ని గుర్తించాలి. అంతేకానీ మరణమనే మార్గాన్ని ఎంచుకుంటే మిగిలేది రోదనే అని గ్రహించాలి.

సమస్యలకు ఆత్మహత్యే పరిష్కారమా?

ఒక్క క్షణం ఆలోచించండి

పోరాడి విజేతలుగా నిలవండి

నేడు ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినం

ఇలా ఎదుర్కోవాలి



ధైర్యం, ఆత్మవిశ్వాసం, మంచి ఆలోచనలు, భవిష్యత్‌ను చక్కగా ఊహించుకోవాలి. ఆత్మహత్య బావన ఉన్నవారు చావు గురించి మాట్లాడటం, డైరీ, ఇతర పుస్తకాల్లో ఎలా చావాలో వంటి అంశాలను రాస్తుంటారు. వాటిని గమనిస్తూ ఉండాలి. అలాంటి వారిని ఒంటరిగా ఉంచకూడదు. వీలైనంత వరకు ఇంట్లో వారందరి మధ్య ఉంచుతూ అందరూ కలిసి వారిలో ధైర్యం నింపాలి. ఆత్మహత్యకు సహకరించే వస్తువులను అందుబాటులో లేకుండా చూడాలి. పాజిటివ్ థింకింగ్ పుస్తకాలు, బిహేవియర్ థెరిపీ, కౌన్సెలింగ్ వంటివి శక్తివంతంగా ఉపయోగపడతాయి.

- డాక్టర్ సురేష్‌బాబు, మానసిక వైద్యనిపుణుడు

ఇటీవల కాలంలో వరుస ఆత్మహత్యలు

- నెల్లూరులోని డైకాస్‌రోడ్డు ఎన్‌సీసీ కాలనీలో భార్యాభర్తల మధ్య వివాదంతో మస్తానయ్య(36) అనే వ్యక్తి ఈ నెల 3వతేదీ ఆత్మహత్య చేసుకున్నాడు. అతనికి 18 నెలల పాప ఉంది.
- రిత్విక్‌ఎన్‌క్లేవ్ సమీపంలో నివసించే షేక్ రసూల్(23) మద్యానికి బానిసై ఆ మత్తులో పలుమార్లు ఆత్మహత్యకు యత్నించాడు. ఈ క్రమంలో గత నెల 30న ఇంట్లో ఉరి వేసుకుని మరణించాడు.
- నేపాల్ దేశం నుంచి పొట్టకూటి కోసం వలస వచ్చిన కార్మికుడు బికాష్(25) మద్యానికి బానిసయ్యాడు. ఈ విషయమై ఫోన్‌లో తల్లిదండ్రులు మందలించారు. భార్య సైతం మద్యం అలవాటు మానుకోవా లని చెప్పడంతో మనస్తాపం చెందిన బికాష్ గత నెల 24న ఉరేసుకుని మృతి చెందాడు.


నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): చిన్నచిన్న కారణాలతో, ఆలోచనారహితంగా కొందరు ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. వీటికి ప్రధాన కారణాల్లో ఒకటి ఒత్తిడికాగా మరొకటి ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నం కావడమనేది నిపుణుల విశ్లేషణ. గతంలో ఉమ్మడి కుటుంబాలు ఉన్నప్పుడు ఒకరి బాధలను మరొకరితో పంచుకునే వారు. దీంతో సమస్యలకు పరిష్కా రం లభించేది. కానీ, ఇప్పటి రోజుల్లో ఇంట్లో భార్య, భర్త, పిల్లలు మాత్రమే ఉంటున్నారు. ఆ నలుగురు కూడా రోజు మొత్తం మీద కలిసి ఉండే సమయం అతి తక్కువ. ఉన్న కాసేపు కూడా సెల్‌ఫోన్‌తోనే గడిపేస్తున్నారు. ఈ క్రమంలో వారి మధ్య మనస్పర్థలు వస్తే చెప్పుకోవడానికి మరో మనిషి లేక, ఇతరులకు చెప్పుకోలేక కుంగిపోతూ ఆత్మహత్య వైపు అడుగులు వేస్తున్నారు. దీనివల్ల ఆ కుటుంబం ఎంతో నష్టపోతోంది. సమస్యలను సంప్రదింపులతో సామరస్యంగా పరిష్కరించుకోవాలి. వీలుకాకపోతే పోరాడి సాధించుకోవాలేగానీ ప్రాణాలను విడవాలనుకోవడం సరైన నిర్ణయం కాదు. మన రాజ్యాంగం జీవించే హక్కు కల్పించింది. దీనిని ఉల్లంఘిస్తూ ఆత్మహత్యకు యత్నించిన వారు సెక్షన్ 309 ప్రకారం శిక్షార్హులవుతారని గుర్తించాలి.

జిల్లాలో ఏటా ఆత్మహత్యలు ఇలా...

సంవత్సరం	పురుషులు	మహిళలు	మొత్తం
2022	274	96	370
2023	333	99	432
2024	292	90	382
	899	285	1184

చిన్నారులకు సాయం కోసం సీఎంను కలిసిన ఎమ్మెల్యే కాకర్ల

- ఒక్కొక్కరికి రూ.2 లక్షలు ప్రకటించిన చంద్రబాబు



ఉదయగిరి, సెప్టెంబరు 9(ఆంధ్ర జ్యోతి): మండలంలోని అప్పసముద్రంలో వినాయక నిమజ్జనోత్సవం సందర్భంగా ప్రమాదవశాత్తు బాణసంచా పేలి చిన్నారులకు తీవ్ర గాయాలైన విషయం తెలిసిందే. ఆ చిన్నారులకు ఆర్థికసాయం చేయాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్, సీఎం నారా చంద్రబాబునాయుడును మంగళవారం అమరావతిలో కలిశారు. ఈ సందర్భంగా ప్రమాద సంఘటనపై సీఎంకు ఎమ్మెల్యే వివరించారు. చలించిన ఆయన ఒక్కో చిన్నారికి రూ2 లక్షల చొప్పున 9 మంది చిన్నారులకు రూ.18 లక్షల ఆర్థికసాయం ప్రకటించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్థికసాయాన్ని క్షతగాత్రుల ఇంటికెళ్లి అందజేస్తామన్నారు. అలాగే ప్లాస్టిక్ సర్జరీ అవసరమైన చిన్నారులకు వైద్యుడు రవి వైద్యం చేసేందుకు ముందుకొచ్చారన్నారు.

● నేతల హర్షం

చిన్నారులకు సీఎం చంద్రబాబు ఆర్థికసాయం మంజూరు చేయడం పట్ల టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పీ. చెంచలబాబుయాదవ్, రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి, మండల కన్వీనర్ సీహెచ్ బయ్యన్న, మాజీ ఎంపీపీ శ్రీకుర్తి రవీంద్రబాబు, టీఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు బొజ్జా శ్రీనివాసులు, పార్టీ నాయకుడు తుమ్మల కిరణ్‌బాబులు ఓ సంయుక్త ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

తెలుగు భాషాభివృద్ధికి కృషి చేద్దాం

- సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి

వెంకటాచలం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : తెలుగు భాషాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చవటపాళెం పంచాయతీ సరస్వతి నగర్ వద్ద గల ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో గిడుగు వేంకటరామమూర్తి, కాళోజీ నారాయణ రావు జయంత్యుత్సవాల సందర్భంగా 'తెలుగు భాషా పరిణామంలో మైలురాళ్ళు' అనే అంశంపై మంగళవారం జాతీయ సదస్సు నిర్వహించారు. తొలిరోజు ప్రారంభ సమావేశానికి ముఖ్య అతిథిగా సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి హాజరై సదస్సును ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రం మైసూరులో ఉన్న ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రాన్ని పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ప్రత్యేక చొరవతో సర్వేపల్లి నియోజకవర్గంలో ఏర్పాటు చేశారన్నారు. ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. తెలుగు భాషాభివృద్ధికి అవసరమైన శిక్షణ కార్యక్ర మాలు చేపట్టాలన్నారు. భాషాభివృద్ధికి చేసే ప్రతి కార్యక్రమంలో తనవంతు పూర్తి సహాయ సహకారాలు ఉంటాయన్నారు. వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు మాట్లాడుతూ మాతృభాషా మాధ్యమంలో విద్యాబోధన వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. మైసూరు విశ్వవిద్యాలయ ఆచార్యులు ఆర్‌వీఎస్ సుందరం మాట్లాడుతూ అంతర్జాతీయంగా ఆయా దేశాలు మాతృభాషలో విద్యా బోధనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయన్నారు. ఈ కేంద్రానికి స్వయం ప్రతిపత్తి ఎంతో అవసమని, ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం, భాషావేత్తలు సమిష్టిగా కృషి చేయాలన్నారు. ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకులు ప్రొఫెసర్ మాడభూషి సంపత్‌కుమార్ మాట్లాడుతూ ఈ కేంద్రం అభివృద్ధికి స్వయం ప్రతిపత్తి ఎంతో దోహదపడుతుందన్నారు. అనంతరం అతిథులను ఘనంగా సత్కరించారు. సదస్సుకు డాక్టర్ ఎల్ఆర్ ప్రేమ్‌కుమార్ సమన్వయకర్తగా వ్యవహరించారు. కార్యక్ర మంలో డాక్టర్ వేదాంతం రాజగోపాల్ చక్రవర్తి, ప్రముఖ భాషావేత్త ఆచార్య జీ ఉమమహే శ్వరరావు, భక్తవత్సలరెడ్డి, శ్యామల పాల్గొన్నారు.

మత్స్యకారుల మధ్య ఉద్రిక్తత



ఇతర జిల్లాల మత్స్యకారులను పంపించి వేయాలని ఆందోళన చేస్తున్న స్థానిక మత్స్యకారులు

కలువాయి, (ఆంధ్రజ్యోతి): కండలేరు జలాశయం వద్ద మంగళవారం సభ్యత్వం కలిగిన మత్స్యకారులకు, ఇతర జిల్లాల నుంచి వచ్చిన మత్స్యకారుల మధ్య ఉద్రిక్తత చోటుచేసుకుంది. స్థానిక వ్యాపారులు కొందరు ఇతర జిల్లాల నుంచి మత్స్యకారులను తీసుకు వచ్చి జలాశయంలో అక్రమంగా చేపలవేట సాగిస్తున్నారు. వారు జలాశయం పరిసరాల్లోనే నివాసాలు ఏర్పాటు చేసుకుని అక్కడే ఉంటున్నారు. మంగళవారం స్థానిక మత్స్యకారులు ఇతర జిల్లాల మత్స్యకారులు ఉంటున్న ప్రాంతానికి వెళ్లారు. అక్కడ వారు వేటాడి ఎండబెట్టిన చేపలను చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరు బయట ప్రాంతాల నుంచి వచ్చి, చేపపిల్లలను అక్రమంగా వేటాడి మాపొట్ట కొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా బయట నుంచి వచ్చిన మత్స్యకారులు జలాశయం వదిలి వెళ్లిపోవాలని వారు హెచ్చరించారు. ఈ విషయమై మత్స్య శాఖ అధికారులకు ఎన్ని సార్లు తెలియజేసినా పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. జేసీ స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

వీఆర్వోలపై పని ఒత్తిడి తగ్గించాలి

విజయవాడ (గాంధీనగర్), సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా వీఆర్వోలు తీవ్ర పని ఒత్తిడి గురవుతున్నారని, వారి సమస్యలు పరిష్కరించాలని ఏపీ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బీహెచ్ రవీంద్రరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిరియాల లక్ష్మీనారాయణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్, రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.జయలక్ష్మిని రాష్ట్ర సచివాలయంలో మంగళవారం కలిసిన వారు వీఆర్వోల సమస్యలను ఆమెకు వివరించారు. కాగా, వెంటనే 15 రోజుల సర్వే ట్రైనింగ్ చేపట్టి, పరీక్షలు నిర్వహించాలని అధికారులకు ఆదేశాలిచ్చారని వారు తెలిపారు.

సువాసన తగ్గిన బంతిపూలు



బంతిపూలు కోస్తున్న కూలీలు



బంతిపూల ధర పతనమైంది. మార్కెట్‌లో కేజీ రూ.5కు కూడా వ్యాపారులు అడగడం లేదని రైతులు వాపోతున్నారు. కోత కూలి, రవాణా ఖర్చులు కూడా రాకపోవడంతో తోటల్లో కోతకు వచ్చిన పూలను ఏమిచేయాలో దిక్కుతోచని స్థితిలో రైతులు పడిపోయారు. కోతకు వచ్చిన పూలు కోయకపోతే తరువాత కోతలు సక్రమంగా రావని వారు వాపోతున్నారు. మార్కెట్‌లో అడిగేవారు లేకున్నా కొందరు రైతులు పూలు కోసి తోటల్లో గుట్టలు పోస్తున్నారు.

- కలువాయి, (ఆంధ్రజ్యోతి)

- మార్కెటలో ధర పతనం
- కేజీ పూలు రూ.5
- ఆందోళనలో సాగుదారులు

కలువాయి మండలంలో ఈ ఏడాది కలువాయి, కొలవపల్లి, తోపుగుంటలో గ్రామాల్లో సుమారు 15ఎకరాల్లో బంతిపూల తోటలు సాగు చేశారు. ఎకరాకు రూ. 60 నుంచి రూ. 70వేలు ఖర్చు చేసి తోటలు సాగు చేశారు. ఈ ఏడాది పైరుకు తెగుళ్లు ఎక్కువగా ఆశించడంతో పురుగుమందులకు కూడా భారీగానే ఖర్చు చేశారు. వినాయక చవితి సమయంలో కేజీ పూలు రూ.50 నుంచి రూ.60ల వరకు పలికింది. ఆ సమయంలో పెద్దగా పూల దిగుబడి లేదు. ఈ ధర మార్కెట్‌లో కొంతకాలం కొనసాగితే నాలుగు రూపాయిలు చేతికి వస్తాయని రైతులు ఆశ పడ్డారు. కాగా వినాయక చవితి అనంతరం మార్కెట్‌లో పూల ధర పతనమైంది. ఇదే సమయంలో తోటలలో పూల దిగుబడి కూడా పెరిగింది. కోతకు వచ్చిన పూలను అడిగే వ్యాపారులు లేక రైతులు లబోదిబోమంటున్నారు.

తీవ్రంగా నష్టపోయాం..



మార్కెట్‌లో ధర పూర్తిగా పతనం కావడంతో ఈ ఏడాది బంతి పూలు సాగు చేసి మేం తీవ్రంగా నష్టపోయాం. కనీసం సాగు ఖర్చులు కూడా చేతికి అందే పరిస్థితి లేదు. తెగుళ్ల దాటికి సాగు ఖర్చులు కూడా రెండింతలైంది.

- ఇమ్మరాజు పెంచలయ్య, రైతు, కొలవపల్లి

ప్రభుత్వం ఆదుకోవాలి



ఈ ఏడాది బంతి పూలు సాగు చేసి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. పూలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటుందని ఆశ పడి సాగు చేశాం. ఇంత ఘోరంగా ధర పడిపోతుందని కలలో కూడా ఊహించలేదు.

- ఎన్.కార్తీక్, రైతు, కొలవపల్లి

ఈ-క్రాప్ నమోదు అయితేనే యూరియా

- సమస్యను అధిగమించేందుకు టోల్‌ఫ్రీ నంబరు
- జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి

ఉదయగిరి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఈ-క్రాప్ నమోదు చేసుకుంటేనే రైతులకు యూరియా అందజేస్తామని జిల్లా వ్యవసాయాధికారి పుట్టా సత్యవాణి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక వ్యవసాయ సహాయ సంచాలకుల కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. జిల్లాలో యూరియా అధిక వినియోగం వల్ల వచ్చే అనర్థాలను వ్యవసాయ, ప్రకృతి వ్యవసాయశాఖ సిబ్బంది రైతులకు వివరిస్తున్నారని పేర్కొన్నారు. ఈ అవగాహన కార్యక్రమాలు అక్టోబరు 31 వరకు కొనసాగుతాయన్నారు. వ్యవసాయ సీజన్ ప్రారంభం కావడంతో యూరియా కావాల్సిన రైతులు కచ్చితంగా ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు. యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడవద్దని, అవసరమైన రైతులకు తప్పనిసరిగా యూరియా అందజేస్తామన్నారు. సోమవారం ఉదయగిరిలో చేపట్టిన యూరియా పంపిణీలో కొన్ని ఇబ్బందులు తలెత్తాయని, భవిష్యత్తులో అవి తలెత్తకుండా చర్యలు చేపడతామన్నారు. ఉదయగిరి సబ్ డివిజన్‌కు అవసరమైన యూరియాను త్వరలో పంపిణీ చేస్తామన్నారు. రైతులు యూరియా సమస్యను అధిగమించేందుకు 83310 57285 టోల్ ఫ్రీ నంబరును ఏర్పాటు చేశామన్నారు. అవసరమైన రైతులు సంబంధిత వ్యవసాయ కార్యాలయాన్ని లేదా టోల్ ఫ్రీ నంబరును సంప్రదించాలన్నారు. తొలుత గుడినరవ రైతుసేవా కేంద్రంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ఏడీఏ లక్ష్మీమాధవి డిప్యూటేషన్‌పై కడపకు బదిలీపై వెళ్లడంతో ఆమెను సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఏలు నర్సోజీరావు, చెన్నారెడ్డి, ఏవోలు సునీల్, మదన్, విజయభాస్కర్, ఏఈవోలు భోగ్యం సుధీర్‌కుమార్, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



ఏడీఏ లక్ష్మీ మాధవిని సన్మానిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి, అధికారులు

నిధుల స్వాహాపై ఎంపీడీవో విచారణ



పంచాయతీ కార్యదర్శి సుధాకర్‌ను విచారిస్తున్న ఎంపీడీవో భవానీ

కలువాయి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కలువాయి మేజర్ పంచాయతీలో జూనియర్ సహాయకుడి కుమారుడు పెత్తనం, డూప్లికేట్ రసీదు పుస్తకాలతో ఇంటి పన్నులు వసూలు చేసి పెద్ద మొత్తం నగదు స్వాహా జరిగినట్లు వచ్చిన ఆరోపణలపై డీపీవో ఆదేశాల మేరకు మంగళవారం ఎంపీడీవో ఎం.భవానీ విచారణ జరిపారు. కలువాయి సచివాలయం-1లో పంచాయతీ కార్యదర్శి సుధాకర్ నుంచి ఈ ఆరోపణలపై వాతపూర్వకమైన వివరణ తీసుకున్నారు. విచారణ నివేదికను డీపీవోకి పంపనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. ఆమె వెంట సీనియర్ అసిస్టెంట్ రమేష్ తదితరులు ఉన్నారు.